www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

7th ANNIVERSARY 22nd October, 2025

PRAJAPAKSHAM ★★

సంపుటి 08, సంచిక: 349 | గురువారం | 20-11-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



రక్తపాతం ముగిసిపోలే

భరించలేని ఒత్తిడితోనే బిఎల్ఒలు మృతి

గ్యాంగ్‌స్టర్ అన్మోల్ బిష్ణోయ్‌ను భారత్‌కు తీసుకొచ్చిన ఎన్ఐఎ

ఢిల్లీలో పేలుడు భద్రతా చేసిన తప్పిదం

05


## పంచాయతీ ఎన్నికలకు ఎన్నికల సంఘం కసరత్తు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. పంచాయతీల ఓటరు జాబితాను సవరించేందుకు ఎన్నికల కమిషన్ మరోసారి బుధవారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈనెల 23 వరకు ఓటరు జాబితాను సవరించి, తుది జాబితాను ప్రకటించనున్నారు. గురువారం ఓటర్ల దరఖాస్తులు, తప్పుల సవరణ, అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఇందులోని అభ్యంతరాలను పరిష్కరించి, 23న తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ చేయనున్నట్టు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. కాగా ఓటర్లు తమ పేరు జాబితాలో ఉందో లేదో తెలుసుకునేందుకు, అవసరమైన సవరణలను చేసుకునేందు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించింది.


ప్రభుత్వ హాస్పిటళ్లలో వృద్ధులకు ప్రత్యేక వైద్య సేవలు

'స్కిల్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా'గా తెలంగాణ

పోలీసులపై లంచం ఆరోపణలు వస్తే ఉపేక్షించొద్దు

03


## 'మావోయిస్టుల ప్రభుత్వ హత్యల'పై
# సమగ్ర న్యాయ విచారణ



మనుషులను చంపినంత మాత్రాన, సిద్ధాంతాలను, భావాలను చంపడం సాధ్యం కాదనే విషయం మానవ చరిత్ర చెబుతోంది. మావోయిస్టులు తమ కుటుంబాలను, జీవితాలను వదులుకుని అడవుల్లో జీవిస్తున్నారు. వారు ఏ సమస్యల కోసం అడవి బాట పట్టారో ఆ సమస్యల పరిష్కారానికి ఆలోచించాలి. మావోయిస్టులను చంపేస్తే అటవీ ప్రాంతాల్లో ఉన్న విలువైన ఖనీజాల విషయాన్ని ఎవ్వరూ అడిగేవారు ఉండబోరని కేంద్రం భావిస్తోంది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశాన్ని జంగల్ రాజ్‌గా మారుస్తోంది.
– కూనంనేని

- న్యాయస్థానాలు సుమోటోగా కేసులు ఎందుకు స్వీకరించడంలేదు
- కోర్టుల మౌనం నష్టదాయకం
- తక్షణమే ఎన్‌కౌంటర్లు నిలిపివేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్
- నేడు మావోయిస్టుల ఏకపక్ష హత్యలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎన్‌కౌంటర్ పేరుతో 'మావోయిస్టుల ప్రభుత్వ హత్యల'పైన వెంటనే సమగ్ర న్యాయ విచారణ చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఒక దొంగను చంపినా సుమోటోగా కేసులను స్వీకరించే న్యాయస్థానాలు మావోయిస్టుల విషయంలో మాత్రం స్పందించడం లేదని, న్యాయస్థానాల మౌనం చాలా నష్టదాయకమని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే తక్షణమే కోర్టులు స్పందించి విచారణ చేపట్టాలని ఆయన న్యాయ స్థానాలను కోరారు. ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 'మావోయిస్టుల ఏక పక్ష హత్యల'పైన హైదరాబాద్, మఖ్దూం భవన్‌లో వామపక్ష, ప్రజాస్వామిక మేధావులతో గురువారం ఉదయం 11గంటలకు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహాతో కలిసి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎన్‌కౌంటర్ పేరుతో చంపిన మావోయిస్టుల ఘటనలు, వారి కుటుంబ నేపథ్యం సమగ్ర వివరాలపైన ఒక శ్వేతప్రతం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మావోయిస్టు నాయకుడు హిడ్మా రక్షణ కోసం లొంగిపోయే అవకాశాలు ఉంటే, సంప్రదింపులు జరపాల్సిన వారు, ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌కౌంటర్లు ఆగబోవని కేంద్ర మంత్రి బండి సంజయ్ చెబుతున్నారని, ఎన్‌కౌంటర్‌కు, ఫేక్‌ఎన్‌కౌంటర్‌కు తేడా లేకుండా బండి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. 2026 మార్చి నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తామని కేంద్రహోం మంత్రి అమిత్‌షా ప్రకటించారని గుర్తు చేశారు. కాల్పులను విరమించిన వారిపైన ఏకపక్షంగా కాల్పులు జరపడం ఇదేం యుద్ధధర్మమని, మనుషులను చంపడం ఒక ఫ్యాషన్‌గా మారిందని అన్నారు. రాహుల్‌గాంధీ తన తండ్రి రాజీవ్‌గాంధీని చంపిన దోషులకు క్షమాబిక్ష పెట్టాలని కోరిన విషయాన్ని

తరువాయి 2లో

## మారేడుమిల్లిలో మళ్లీ ఎన్‌కౌంటర్
# ఏడుగురు నక్సల్స్ మృతి

హతుల్లో మావోయిస్టు కీలక నేత టెక్ శంకర్




- ఘటనాస్థలం నుంచి ఆయుధాల స్వాధీనం
- కొనసాగుతున్న గాలింపు
- హిడ్మా ఎదురుకాల్పుల్లోనే మృతి చెందారు
- ఇంటెలిజెన్స్ డిజి మహేశ్‌చంద్ర

రంపచోడవరం/చింతూరు/పెద్దాపురం

మరోమారు ఏజెన్సీ ప్రాంతం కాల్పుల మోతతో దద్దరిల్లింది. ఎపిలోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలం జి.ఎం.వలస సమీపంలోని అటవీ ప్రాంతం లో బుధవారం తెల్లవారు జామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మతి చెందారు. మృతుల్లో మావోయిస్టు కీలక నేత మేటూరి జోగారావు అలియాస్ టెక్ శంకర్ తో పాటు నరేశ్, షమ్మీ , గణేష్ మహిళా మావోయిస్టులు జ్యోతి , అనిత, సైను ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనకు సంబందించి

తరువాయి 2లో

## లొంగిపోతానన్న హిడ్మా ఎన్‌కౌంటర్ ఎలా అయ్యాడు?

- మోదీ మెప్పు కోసమే ఎపి ప్రభుత్వం స్కెచ్ వేసినట్లు అనుమానాలు
- ముందుగా వరంగల్ పోలీసుల ముందు తన కుమార్తెను సరెండర్ చేసిన హిడ్మా
- తాను సరెండర్ కావాలనుకున్న తరుణంలో ఎన్‌కౌంటర్

ప్రజాపక్షం/హైదరాబాద్

మావోయిస్టు పార్టీ అగ్ర నాయకుడు, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి మడావి హిడ్మా అలియాస్ సంతోష్ నేడో రేపో లొంగిపోయేందుకు సిద్దమౌతున్నారే వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆయనతో సహా ఆయన భార్య మృతి చెందారనే వార్త అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఎపిలోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమనే వాదనలు వినిపిస్తున్నాయి. హిడ్మా గత నెలలోనే లొంగిపోయేందుకు మార్గం సిద్ధం చేసుకున్నారని, ఈ మేరకు ఎపికి చెందిన ఓ నిఘా అధికారితో టచ్‌లో ఉన్నారనే వాదనలకు ఇటీవలే హిడ్మా కుమార్తె కేశా వరంగల్ పోలీసుల ముందు లొంగిపోయి

తరువాయి 2లో



## పరిస్థితులు మారాయి..
# మనమూ మారాలి

అజ్ఞాతం వీడి ప్రజల్లోకి రావాలంటూ మావోయిస్టులకు మల్లోజుల పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలో పరిస్థితులు మారాయి..అందుకు తగ్గట్టుగా మనం కూడా మారాలి అని ఇటీవలో జన జీవన స్రవంతిలోకి వచ్చిన మాజీ మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ మావోయిస్టులను కోరారు. అజ్ఞాతం

తరువాయి 2లో

## అంతర్జాతీయ మార్కెట్‌కు
# మహిళా ఉత్పత్తులు

అమెజాన్‌తో ఒప్పందానికి సంప్రదింపులు జరుపుతున్నాం

ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన



చీరల పంపిణీని పండుగ వాతావరణంలో నిర్వహించాలి. ఎంపిలు, ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలి. బుధవారం నుంచి డిసెంబరు 9 వరకు గ్రామీణ ప్రాంతాలలోని 18 ఏళ్లు నిండిన మహిళలకు చీరల పంపిణీ పూర్తి చేయాలి. అందుకు 65 లక్షలు అందుబాటులో ఉంచాం. పట్టణ ప్రాంతాలలో మార్చి 1 నుంచి 8వ తేదీ వరకు 35 లక్షలు చీరలు పంపిణీ చేయాలి.
– సిఎం రేవంత్‌రెడ్డి

- మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్
- చీరల పంపిణీకి ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిని నియమించాలని కలెక్టర్లకు ఆదేశం
- అర్హులైన ప్రతీ మహిళకూ అందుతుందని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ వ్యాప్తంగా మహిళా సంఘాలు ఉత్పత్తి చేస్తున్న వివిధ వస్తువులను ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు అమెజాన్‌తో సంప్రదింపులు చేస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహానికి సిఎం ఎ.రేవంత్ రెడ్డి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లాలలోని మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎం మాట్లాడారు. తెలంగాణలోని ఆడ బిడ్డలకు పుట్టింటి వాళ్లు అన్నదమ్ములు సారె చీరె పెట్టడం సాంప్రదాయమని, అలాగే రాష్ట్రంలోని ప్రతీ ఆడబిడ్డను తోబుట్టువుగా భావించి తమ ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతీ మహిళకు చీర అందిస్తుందని సిఎం అన్నారు. తెలంగాణలోని అర్హులైన కోటి మంది మహిళలకు చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు సిఎం తెలిపారు. ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ ప్రక్రియకు సంబంధించి ప్రతీ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని కలెక్టర్లను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. 'మహిళా ఉన్నతి –తెలంగాణ ప్రగతి' పేరిట చీరల పంపిణీ కార్యక్రమాలను

తరువాయి 2లో







## చట్టసభల్లో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం తగ్గడంతో కార్పొరేట్ల
# ఆగడాలు మితిమీరుతున్నాయ్

- ప్రజాస్వామ్యవాదులు, కమ్యూనిస్టులు తిప్పి కొట్టాలి
- మతోన్మాదుల మెడలు వంచేది వామపక్షాలే
- చరిత్రను తొక్కిపెడితే ప్రజలే బుద్ధి చెబుతారు
- ప్రచార జాతాల్లో పలువురు వక్తలు

ప్రజాపక్షం/చౌటుప్పల్/వరంగల్ / హైదరాబాద్

చట్టసభలలో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం తగ్గడం వల్ల కార్పొరేట్ శక్తులు ఆగడాలు మితిమీరిపోతున్నాయని, దేశంలో ఉన్న సహజ సంపదను కార్పొరేట్లకు పంచిపెట్టే విధానాలను ఈ పాలక ప్రభుత్వాలు రూపొందిస్తున్నాయని, వీటిని ప్రజాస్వామ్యవాదులు, కమ్యూనిస్టులు తిప్పి కొట్టాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, ఇ.టి. నర్సింహ్మా, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యురాలు పశ్యపద్మ పిలుపునిచ్చారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా చేపట్టిన ప్రచార జాతాలు బుధవారం నల్లగొండ, యాదాద్రి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, భూపాలపల్లి జిల్లాలో కొనసాగాయి. కాగా, గద్వాల్ నుంచి ప్రారంభమైన ప్రచార జాతా మంగళవారం చౌటుప్పల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వందేళ్ళ ఘనమైన చరిత్ర కలిగి, ప్రజా ఉద్యమాల సారథిగా నిలిచిన పార్టీ సిపిఐ అని

తరువాయి 12లో




## ఎన్‌డిఎ శాసనసభాపక్ష నేతగా
# నితీశ్‌కుమార్ ఎన్నిక

సిఎం పదవికి రాజీనామా, గవర్నర్ ఆమోదం

నేడు బిహార్‌లో కొలవుదీరనున్న కొత్త ప్రభుత్వం



**పాట్నా :** బిహార్‌లో కొత్త ప్రభుత్వం కొలువు దీరనుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌కు సమర్పించారని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్ తెలిపారు. నితీశ్ రాజీనామాను గవర్నర్ ఆమోదించి, కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరారని జైస్వాల్ విలేకరులకు తెలిపారు. రాజ్ భవన్ పర్యటన సందర్భంగా కుమార్‌తో పాటు కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్, ఆర్‌ఎల్‌ఎం చీఫ్ ఉపేంద్ర కుష్వా, ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ఉన్నారు. గురువారం ఉదయం 11 గంటలకు పాట్నాలోని చరిత్రాత్మక గాంధీ మైదానంలో నితీశ్ కుమార్ రికార్డు స్థాయిలో 10వసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అంతకు ముందు పాట్నాలో జరిగిన సంకీర్ణ భాగస్వాముల నుండి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల సమావేశంలో జెడియు అధినేత నితీష్ కుమార్‌ను బిహార్‌లో ఎన్‌డిఎ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర మంత్రి

తరువాయి 12లో

## రాష్ట్ర ప్రగతిని ప్రపంచానికి చూపేందుకే
# 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యం

- మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యసాధనలో ప్రతీ శాఖ భాగస్వామి కావాలి
- గ్లోబల్ సమ్మిట్‌కు దేశం, ప్రపంచంలోని ప్రముఖ కంపెనీల సిఇఒలను ఆహ్వానిస్తున్నాం
- 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనపై వార్ రూమ్ సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ రాష్ట్రం గత రెండేళ్లలో సాధించిన ప్రగతి, రాష్ట్ర భవిష్యత్తును ప్రపంచానికి చూపడమే 'తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్' లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాభవన్‌లో బుధవారం సాయంత్రం అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో కలిసి ఏర్పాటు చేసిన '2047 విజన్ డాక్యుమెంట్ వార్ రూమ్' సమావేశంలో ఆయన ప్రసంగించారు. 'మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్య సాధన

తరువాయి 12లో

## ట్రిబ్యునల్స్ సంస్కరణల చట్టంలో
# కీలక నిబంధనలు రద్దు

- న్యాయ వ్యవస్థపై పార్లమెంటు పెత్తనం చేయకూడదు
- కేంద్రానికి షాక్ ఇచ్చిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** నియామకాలకు సంబంధించి ట్రిబ్యునల్స్ సంస్కరణల చట్టం (2021)లో ఉన్న కీలకమైన నిబంధనలను సుప్రీంకోర్టు రద్దుచేసింది. న్యాయస్థానం జారీ చేసిన మార్గదర్శకాలను పదే పదే ఉల్లంఘించడంపై 137 పేజీల తీర్పులో ధర్మాసనం కటువైన పదజాలంతో కేంద్ర ప్రభుత్వానికి మొట్టికాయ వేసింది. ఒక జాతీయ ట్రిబ్యునల్ కమిషన్‌ను స్థాపించాలని కేంద్రానికి తాజా మార్గదర్శకత్వం చేసింది. ట్రిబ్యునల్స్ సంరక్షణకు, వాటి నిబంధనల రూపకల్పనకు, బాహాటత్వానికి, నియామకాలో ఏకీకృత విధానం పాటించడానికి జాతీయ కమిషన్ ఆవశ్యకత ఎంతో ఉందని పేర్కొంది. దీంతో కేంద్ర ప్రభుత్వం పెద్ద కుదుపునకు గురైనట్లయింది. తిరస్కరించిన నిబంధనలనే మళ్ళీ మళ్ళీ చట్టరూపంలో తెస్తున్నారని, ఇది 'కొత్త సీసాలో పాతసారా' వ్యవహారంగా మారిందని మండిపడింది. ఏదైనా ఒక నిబంధన చెల్లుబాటు కాదని రద్దు చేస్తే న్యాయవ్యవస్థ నిర్ణయానికి విరుద్ధంగా పార్లమెంటు వ్యవహరించి మళ్ళీ దానినే ఆమోదించి పెత్తనం చేయాలని చూడకూడదని హితవు చెప్పింది. న్యాయ వ్యవస్థ ఒక లోపాన్ని గుర్తించి ఎత్తి చూపిస్తే, పార్లమెంటు నిర్దేశిత షరతులకు అనుగుణంగా దానిలో మార్పులు చేయడం, తొలగించడం, రాజ్యాంగబద్దంగా పునర్వ్యస్థీకరించడం వంటి చర్యల ద్వారా ఆ లోపాన్ని శాసనపరంగా సరిదిద్దే ప్రయత్నం చేయాలని చాలా స్పష్టంగా ధర్మాసనం

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## చిలీలో మంచు తుఫాను... ఐదుగురు టూరిస్టులు మృతి

**శాంటియాగో:** శీతకాలం భయంకరమైన గాలులు, మంచు తుఫాను ప్రమాదంలో చిక్కుకున్న ఐదుగురు పర్యాటకులు చిలీ పాతగోనియా ప్రాంతంలో మరణించారు. గ్రానైట్ పర్వత శిఖరాలకు, విభిన్న జాతి జీవుల సంచారానికి, మంచు కొండలకు నిలయంగా ఉండే చిలీ దక్షిణ ప్రాంతంలో పర్యాటకులు సంచరిస్తున్న సమయంలో వారు తీవ్ర శీతగాలులు, మంచు ప్రమాదంలో చిక్కుకుని మరణించారు. దేశరాజధాని చిలీకి దక్షిణంగా 2,800 కి.మీ దూరంలో ఈ ఘటన సంభవించింది. తొలుత ఏడుగురు పర్యాటకులు గల్లంతైనట్లు వార్తలు వెలువడ్డాయి. ఐతే నలుగురు పర్యాటకులను సజీవంగా వెలికి తీశారు. ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. గత ఏడాది ఈ పర్వత ప్రాంతాలను3.67 లక్షలమంది పర్యాటకులు సందర్శించి ఎంజాయ్ చేశారు. 1978లో యునెస్కో ఈ ప్రాంతాన్ని బయోస్ఫియర్ రిజర్వు ప్రాంతంగా గుర్తించింది. చిలీ దేశాధ్యక్షుడు గాబ్రియేట్ బోరిక్ ఎక్స్ వేదికగా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

## చైనా మార్కెట్లో జపాన్ సీఫుడ్ విక్రయాలు నిషేధం

### తైవాన్‌పై తకైచి వ్యాఖ్యలకు మండిపాటు

**బీజింగ్ :** చైనా–జపాన్ మధ్య వివాదం ముదురుతున్నది. తాజాగా జపాన్ సముద్ర ఆహార ఉత్పత్తులను తమ మార్కెట్‌లో విక్రయాలను అడ్డుకుంటూ చైనా ఉత్తర్వులు జారీ చేసింది. జపాన్ దౌత్య వర్గాలకు సాధారణ సమాచార మార్గాల ద్వారా ఈ విషయం స్పష్టం చేసింది. ఒకవేళ బలవంతంగా చైనాకు జపాన్ సముద్ర ఆహార ఉత్పత్తులను ఎగుమతి చేసినప్పటికీ వాటికి మార్కెట్‌లలో ప్రవేశం ఉండదని చైనా స్పష్టం చేసింది. జపాన్ సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల విషయంలో నియంత్రణలు పాటించలేదని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మావో నింగ్ ప్రకటించినప్పటికీ దీనికి వెనుక అసలు కారణం అదికాదని, తైవాన్‌పై తకైచీ వ్యాఖ్యలకు ప్రతీకారంగా ఈ నిషేధం విధించారని జపాన్ పత్రికలు వ్యాఖ్యానించాయి. మావోనింగ్ తకైనా వ్యాఖ్యలను కూడా ప్రస్తావిస్తూ, తైవాన్ ప్రస్తావన తీసుకురావడంవల్ల చైనా ప్రజలు చాలా ఆగ్రహంతో ఉన్నారనీ, ఈ పరిస్థితుల్లో జపాన్ సముద్ర ఉత్పత్తులను తమ దేశంలోకి అనుమతించనా ఉపయోగం ఉండదన్నారు. జపాన్ సీ ఫుడ్‌పై చైనా తిరిగి ఆంక్షలు విధించిందని జపాన్ పత్రికలు వార్తలు ప్రచురించాయి. జపాన్ కొత్త ప్రధానమంత్రి తకైచీ అధికారంలోకి వచ్చినప్పటినుండీ చైనాకు, జపాన్‌కు మధ్య వాగ్వాదం పెరిగింది. తైవాన్‌పై తకైచీ చేసిన వ్యాఖ్యలపై చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ తీవ్రస్థాయిలో మండిపడింది. ఒకవేళ తైవాన్‌పై చైనా దాడి చేస్తే అది జపాన్ మనుగడకు ప్రమాదంగా మారుతుందని, అలాంటి సమయాల్లో సైనిక జోక్యం అవసరం పడుతుందని పార్లమెంటు సభ్యులను ఉద్దేశించి తకైచీ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. దీంతో చైనా–జపాన్ మధ్య వాగ్వాదం రగులుకుని ఇంతదాకా వచ్చింది.

## ఎప్‌స్టీన్ ఫైల్స్ విడుదలకు రంగం సిద్ధం

### భారీ మద్దతుతో దిగువసభలో బిల్లు ఆమోదం

**వాషింగ్టన్:** లైంగిక కార్యకలాపాల నేరస్థుడు, ఫైనాన్సియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ (1953–2019) కు సంబంధించిన వేలాది పత్రాలు,ఫైల్స్ విడుదల చేసేందుకు అమెరికా న్యాయశాఖకు అనుమతి లభించింది. ఇందు కు వీలుగా అమెరికా దిగువ సభ బిల్లుకు ఆమోదం తెలియజేయడంతో మార్గం సుగమమైంది. అమెరికాలో ట్రంప్ లాంటి అనేకమంది ప్రముఖుల జాతకాలు జెఫ్రీ ఎప్‌స్టీన్ వద్ద నిక్షిప్తమై ఉన్నాయి. ఎవరికీ తెలియకుండా ఈ సమాచారాన్ని ఎప్‌స్టీన్ రికార్డు చేసి బ్లాక్‌మెయిల్ చేశాడు. దిగువసభలో భారీ ఎత్తున 427–1 తేడాతో ఈ బిల్లుకు ఆమోద ముద్ర పడింది. ఇప్పుడు బిల్లు దేశాధ్యక్షుడు ట్రంప్ సంతకం కోసం ఆయన టేబుల్ మీదకు వెళుతుంది. ట్రంప్ పిలుపు మేరకు అమెరికా అధికారపార్టీ సభ్యులు కూడా ఈ బిల్లుకు అనుకూలంగా ఓటు వేశారు. ఐతే ఈ విషయంలో రిపబ్లికన్‌పార్టీలో విభేదాలు తలెత్తాయి. జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్‌కు ఉన్న సంబంధాలు ఇప్పటికే బయటపడ్డాయి. దీంతో ఆయన వెనక్కు తగ్గుతున్నారు. పూర్వపు వైఖరిని సడలించుకున్న కొత్త పద్ధతిలో ఆయన ముందుకు వెళుతున్నారు. ఎప్‌స్టీన్‌తో, ఈ సెక్స్ స్కాండల్స్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

## ఉక్రేన్ ఆకాశహర్మ్యాలపై దాడులు

### 25 మంది మృతి
### ఐదు ఇంధన కేంద్రాలు ధ్వంసం

**కీవ్:** గడచిన రెండు నెలలుగా ఉక్రేన్‌పై యుద్ధాన్ని ఉధృతం చేసిన రష్యా బుధవారం పశ్చిమ ఉక్రేన్‌లోని 192 ప్రాంతాలపై దాడులు చేసింది. ఆకాశ హర్మ్యాలపై జరిపిన దాడుల్లో 25 మంది మరణించారు. 73 మంది గాయపడ్డారు. వీరిలో 14 మంది పిల్లలు ఉన్నారు. పలువురు శిథిలాల్లో చిక్కుకుని ఉంటారని భయపడుతున్నారు. లెవివ్, ఇవానో ఫ్రాంకివ్స్క్ ప్రాంతాలు బాగా నష్టపోయాయి. అనేక ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 2022 ఫిబ్రవరిలో ఉక్రేన్‌పై రష్యా పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించిన తర్వాత జరిగిన అతిపెద్ద దాడి ఇదే. ఇవానోవ్ ఫ్రాంకెస్కీ ప్రాంతంలో మరో ఐదు ఇంధన వనరుల మౌలిక సదుపాయాలపై కూడా దాడులు జరగడంతో అపారనష్టం వాటిల్లింది. అదేవిధంగా ఉక్రేన్ కూడా రష్యాలోని పలు ప్రాంతాలపై డ్రోన్లతో దాడులు చేసింది. 91 రష్యా డ్రోన్లను కూల్చివేసినట్లు ఉక్రేన్ సైన్యం ప్రకటించగా, అజోవ్, బ్లాక్ సీ ప్రాంతాలలో ఉక్రేన్ సైనికులు డ్రోన్ దాడులు చేశారనీ, వీటిల్లో 65 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా సైన్యం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ దాడుల్లో ఐదుగురు గాయపడ్డారు. కాగా పశ్చిమ ఉక్రేన్ టెర్నోపిల్ ప్రాంతంలో ఆకాశ హర్మ్యాలపై రష్యా క్షిపణులు, డ్రోన్లు విరుచుకుపడ్డాయి. మొత్తం 476 డెకాయ్ డ్రోన్లు, 48 క్షిపణులతో రష్యా దాడులు చేసిందని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ విమర్శించారు. ఈ దాడుల్లో అనేకమంది శిథిలాలలో చిక్కుకుపోయి ఉంటారని ఆందోళన వ్యక్తం చేశారు. చాలామంది ఉక్రేన్ పౌరులు భయపడి మెట్రో స్టేషన్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో రాత్రి పూట నిద్రిస్తున్నారు. శీతాకాలం సమీపిస్తూ ఉండటంతో ఉక్రేన్, రష్యాలలో ఇళ్ళల్లో వేడి వాతావరణం సృష్టించేందుకు విద్యుత్, గ్యాస్ సరఫరా ఎంతో ముఖ్యం. దీనిని దృష్టిలో పెట్టుకునే రష్యా సైన్యం ఉక్రేన్ ఇంధన కేంద్రాలను, సంబంధిత మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటున్నది. లెవివ్ ప్రాంత గవర్నర్ మాట్లాడుతూ, ఇంధన కేంద్రాలపై దాడులు జరిగాయన్నారు.



#### టర్కీలో చర్చలేమీ లేవు : పెస్కొవ్

యుద్ధం ముగించేందుకు ట్రంప్ ఇచ్చిన పిలుపు మేరకు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మూడు యూరప్ దేశాల పర్యటన ముగించుకుని టర్కీ చేరుకున్నారు. టర్కీ దేశాధ్యక్షుడు రెసిప్ తయ్యప్ ఎర్డొగాన్‌తో చర్చలు జరుపుతారు. రష్యా ప్రతినిధి కిరిల్ దిమిత్రేవ్‌తో రష్యా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్‌తో అంకారాలో చర్చలున్నాయన్న విషయాన్ని రష్యా ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ ఖండించారు. టర్కీలో ఎలాంటి చర్చలూ జరగడంలేదన్నారు. ఉక్రేన్‌తో చర్చల పునరుద్ధరణకు తాము ఎలాంటి సుముఖతా వ్యక్తం చేయలేదని స్పష్టం చేశారు. గురువారం ఇస్తాంబుల్‌లో చర్చలు జరుగుతాయన్న సంకేతాలేమీ తమవద్ద లేవన్నారు.

#### ఉక్రేన్‌కు 100 రఫేల్ జెట్స్

మూడు యూరప్‌దేశాలలో పర్యటించిన జెలెన్స్కీ రక్షణ ఒప్పందాలు చేసుకున్నారు. ఆర్థిక సహాయం సంపాదించారు. అదేవిధంగా ఇంధన వనరులను పెంపొందించుకోవడానికి, శీతాకాలం ఉక్రేన్‌కు ఇంధన సరఫరాలు మెరుగుపరుచుకోవడానికి ఒప్పందాలు చేసుకున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌తో చర్చలు జరిపి ఆర్థిక సహాయానికి పచ్చజెండా ఊపించారు. అదేవిధంగా రాఫెల్ యుద్ధ విమానాలు తెచ్చుకునేందుకు ఒక ఒప్పందంపై సంతకాలు చేశారు. దాదాపు 100 రాఫెల్ యుద్ధ విమానాలు తెచ్చుకోవాలని జెలెన్స్కీ ఆశిస్తున్నారు. ఫ్రాన్స్–ఉక్రేన్ మధ్య కుదిరిగిన ఈ ఒప్పందాన్ని రష్యా తీవ్రంగా వ్యతిరేకించింది. రాఫెల్ యుద్ధ విమానాల సరఫరా విచారకరమైన విసయమని పేర్కొంది.

## హసీనాను బంగ్లాదేశ్‌కు రప్పించేందుకు 'ఇంటర్‌పోల్' రెడ్ నోటీస్!

**ఢాకా:** షేక్ హసీనాను బంగ్లాదేశ్‌కు రప్పించేందుకు ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఇంటర్‌పోల్ సహాయం తీసుకోవాలని మహ్మద్ యూనుస్ నాయకత్వానగల తాత్కాలిక ప్రభుత్వం భావించింది. షేక్ హసీనా ప్రధానమంత్రిగా ఉండగా గత ఏడాది జులైలో అల్లర్లు ప్రారంభమైనప్పుడు హోంమంత్రిగా ఉన్న అసదుజ్జామన్ ఖాన్ కమల్ కూడా భారతదేశంలోనే ఆశ్రయం పొందుతున్నారు. ఈ కేసులో హసీనాకు వ్యతిరేకంగా వాదనలు వినిపించిన ప్రాసిక్యూటర్ గాజీ మహ్మద్ తమిమ్ మంగళవారం పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ ఇద్దరు దోషులను (హసీనా–ఖాన్ కమల్) అంతర్జాతీయ నేరస్థులుగా ప్రకటించేందుకు వీలుగా రెడ్ నోటీసు జారీ చేయాలని కోరుతూ ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పినట్లు బంగ్లాదేశ్ ఫైనాన్సియల్ ఎక్స్‌ప్రెస్ ప్రకటించింది. ట్రిబ్యునల్ జారీ చేసిన అరెస్టు వారెంటుతోపాటు ఈ ఇద్దరు నేరస్థులూ పరారీలో ఉన్నారన్నవిషయాన్ని ఇప్పటికే ఇంటర్‌పోల్‌కు తెలియజేశామన్నారు. ఇప్పుడు తమ దేశ విదేశాంగశాఖ ద్వారా అరెస్టు వారెంటుకు బదులుగా రెడ్ నోటీసు జారీ చేయాల్సిందిగా ఇంటర్‌పోల్‌ను అడుగుతామని తమిమ్ చెప్పారు. వీరిద్దరికీ బంగ్లాదేశ్ అంతర్జాతీయ ట్రైబ్యునల్ కోర్టు (ఐసిటి) నవంబరు 16వ తేదీన ఉరిశిక్ష విధిస్తూ తీర్పు ప్రకటించింది. యూనుస్ ప్రభుత్వం వీరిని దేశానికి రప్పించేందుకు ఇంటర్‌పోల్‌ను ఆశ్రయిస్తారని పలు బంగ్లాదేశ్ పత్రికలు ప్రకటించాయి. వారిద్దరినీ తమ దేశానికి అప్పగించాలని న్యూఢిల్లీకి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేస్తామని బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రకటించిన తర్వాత ఈ వార్తలు వెలువడ్డాయి. ఈ కేసులో మరో నిందితుడు పోలీస్ ఉన్నతాధికారి ఛౌధురీ అబ్దుల్లా అల్–మమన్ ప్రభుత్వానికి అనుకూలంగా మారిపోవడంతో ఆయనకు కేవలం ఐదు సంవత్సరాలు జైలు శిక్ష మాత్రమే విధించారు.



## లెబనాన్‌లో శరణార్థ శిబిరంపై ఇజ్రాయెల్ దాడి

### 13 మంది మృతి

**టెల్‌అవీవ్:** హమాస్ ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుని లెబనాన్‌పై ఇజ్రాయెల్ మరోసారి గగనతల దాడి చేసింది. తీరప్రాంత నగరం సిడాన్‌లో ఉన్న శరణార్థ శిబిరంపై ఇజ్రాయెల్ సైన్యం గగనతల దాడులు చేసింది. బుధవారం జరిగి న ఈ దాడుల్లో 13 మంది మరణించారు. ఈ ఏడాది మేనెలలో ట్రిపోలీలో ఒకసారి, జులై నెలలో సిడాన్‌లో ఒకసారి ఇజ్రాయెల్ సైన్యం లెబనాన్‌లో దాడులు చేసి హమాస్ సంస్థకు చెందిన ఇద్దరు ఉన్నతశ్రేణి కమాండర్లను హతమార్చిం ది. హమాస్ ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నాగానీ తాము ఆ దేశంలో దాడులు కొనసాగిస్తామని మరోసారి ఇజ్రాయెల్ ప్రతిజ్ఞ చేసింది. ఇంతకు ముందు కూడా సెప్టెంబరు తొమ్మిదో తేదీ న దోహాలో హమాస్ అగ్రశ్రేణి నాయకులు సమావేశమైన సమయంలో కూడా ఐడిఎఫ్ దాడులు చేసింది. ఈ దాడులు తీవ్ర వివాదస్పదంగా మారాయి. ఈ విషయంలో డోనాల్డ్ ట్రంప్ కూడా ఇజ్రాయెల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శరణార్థ శిబిరం ముగుసులో లెబనాన్‌లోని సిడాన్‌లో హమాస్ నిర్వహిస్తున్న ఉగ్రవాద శిక్షణ శిబిరంపై తాము దాడులు చేశామని ఇజ్రాయెల్ ప్రభుత్వం చెబుతుండగా, శరణార్థ శిబిరాలపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేసిందని హమాస్ వాదిస్తున్నది.

ఇవన్నీ శరణార్థ శిబిరాలేననీ, ఈ ప్రాంతంలో సైనిక సంబంధమైన సామాగ్రి ఏమీ లేదని చెబుతున్నది. దీంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. శరణార్థ శిబిరంలో లో హమాస్ ఉగ్రవాదుల శిక్షణా శిబిరాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం ఒక ప్రకటనలో ధృవీకరించింది. ఈ దాడుల్లో మరో నలుగురు గాయపడినట్లు లెబనాన్ ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకటించింది. ఇజ్రాయెల్ దేశంమీద, ఐడిఎఫ్ దళాలున్న కేంద్రాలపైన దాడులు చేసేందుకు హమాస్ ఉగ్రవాద శిక్షణా కేంద్రం నడుపుతోందని, ఈ దుశ్చర్యలు కొనసాగకుండా తాము అడ్డుకుని భవిష్యత్ కుట్రను భగ్నం చేశామని ఐడిఎఫ్ సేనలు తెలియజేశాయి. ఖచ్చితమైన నిఘాతో, తక్కువ ఆయుధాలతో సాధారణ పౌరులకు ఎలాంటి హానీ కలిగించకుండా, గూఢచారి వర్గాల సమాచారం మేరకు గురిచూసి ఈ దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ ప్రభుత్వం ప్రకటించింది.

## మనమూ మారాలి (మొదటి పేజీ తరువాయి)

వీడి ప్రజల్లోకి రావాలని ఆయన మావోయిస్టులకు పిలుపు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏజెన్సీ ప్రాంతం రెండు రోజులుగా వరుస ఎన్ కౌంటర్లతో దద్దరిల్లుతోంది. మారేడుమిల్లి వద్ద జరిగిన ఎన్ కౌంటర్లో ఆరుగురు మావోయిస్టులు చనిపోగా తాజాగా బుధవారం జరిగిన మరో ఎన్ కౌంటర్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ నేపథ్యంలో మాజీ మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ మీడియాకు ఒక వీడియో రిలీజ్ చేశారు. ఆపరేషన్ కగార్ కారణంగా గత కొంతకాలంగా మావోయిస్టుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఎన్ కౌంటర్ల వల్ల ఇప్పటికే పలువురు మావోయిస్టు కీలక నేతలు మృతి చెందారు. తాజాగా హిడ్మా సైతం ఎన్ కౌంటర్ అయ్యారని ఈ నేపథ్యంలో మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని వీడియో సందేశం పంపించారు. మావోయిస్టులు ప్రాణాలు కోల్పోవడం బాధ కలిగించిందన్నారు. పరిస్థితులు మారుతున్నాయి.. దేశం కూడా మారుతోంది. ఎన్ కౌంటర్లలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారు. అందుకే మావోయిస్టులు అజ్ఞాతం వీడి ప్రజల్లోకి రావాలని విజ్ఞప్తి చేశారు. లొంగిపోవాలని అనుకునే మావోయిస్టులు తన ఫోన్ నంబర్ 8856038533 ను సంప్రదించాలని సూచించారు.

## మహిళా ఉత్పత్తులు (మొదటి పేజీ తరువాయి)

చేపట్టాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సిఎం సూచించారు. నవంబరు 19 నుంచి డిసెంబరు 9 వరకు గ్రామీణ ప్రాంతాలలోని 18 ఏళ్లు నిండిన మహిళలకు చీరల పంపిణీ పూర్తి చేయాలని, ఇందుకు 65 లక్షలు అందుబాటులో ఉంచామని సిఎం తెలిపారు. పట్టణ ప్రాంతాలలో మార్చి 1నుంచి 8వ తేదీ వరకు 35 లక్షలు చీరలు పంపిణీ చేయాలని సిఎం ఆదేశించారు. అర్హులైన ప్రతి మహిళకు చీర అందుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు.ప్రజా ప్రభుత్వం చేపట్టిన సామాజక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ కుల సర్వే (సిపెక్) డాటాను దగ్గర పెట్టుకుని ప్రతి మహిళకు చీర అందెలా చూడాలని, చీర అందించే సమయంలో ఆధార్‌ను తీసుకోవాలని, ముఖ గుర్తింపు చేపట్టాలని సిఎం కలెక్టర్లకు సూచించారు. మహిళల ఉన్నతే లక్ష్యంగా తమ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని సిఎం చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం వడ్డీలేని రుణాల విషయంలో నిర్లక్ష్యం వహించిందని, తాము వడ్డీలేని రుణాలు ఇవ్వడంతో పాటు అందుకు సంబంధించిన నిధులు విడుదల చేసిన విషయాన్ని సిఎం గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ రేషన్ కార్డు ఉన్న మహిళలందరికీ చీరలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థిక క్రమశిక్షణతో బ్యాంక్‌లు రుణాలు ఇచ్చేందుకు సంఘాల దగ్గరకు వస్తున్నాయని తెలిపారు. 98 శాతం రుణ చెల్లింపుతో సంఘాలు తమ క్రమశిక్షణను చాటుతున్నాయని కొనియాడారు. ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీపైనా కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలని సూచించారు. ఆకాశమే హద్దుగా మహిళలు ఎదగాలనే ఉద్దేశంతో ఆకాశం రంగును చీరలకు ఎంచుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ కార్యదర్శి శేషాద్రి, సిఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, సెర్ప్ సిఈఓ దివ్య దేవరాజన్, చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ తదితరులు పాల్గొన్నారు.

**మీ పెట్రోల్ బంక్ ఎలా నడుస్తోంది :** 'మీ సంఘం ఆధ్వర్యంలోని పెట్రోల్ బంక్ ఎలా నడుస్తోంది' అని నారాయణ పేట జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడిగారు. బాగా నడుస్తోందని, నెలకు రూ.4 లక్షల రాబడి వస్తోందని ఆమె సిఎంకు తెలియజేశారు. ఇతర జిల్లాల నుంచి సంఘాలను అక్కడకు తీసుకెళ్లి వారి పనితీరు, రాబడిని ప్రత్యక్షంగా చూపాలని కలెక్టర్లకు సిఎం సూచించారు..

**డిజైన్లు ఎంతో బాగున్నాయి:**'మాకు ఇస్తున్న చీరల డిజైన్లు ఎంతో బాగున్నాయి' అని రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి కృతజ్ఞత లు తెలిపారు. 9 మీటర్లు, 6 మీటర్ల చీరలు తమకు నచ్చినట్లు ఉన్నాయని, తమకు ఎంతో సంతోషంగా ఉందని ఆమె సిఎంకు తెలియజేశారు.

**మాకు యూనిఫామ్ ఇచ్చినట్లు ఉంది :** ఇందిరామహిళా శక్తి చీరలు ఇవ్వడం ద్వారా తమకు యూనిఫామ్ వచ్చిందనే సంతోషం ఉందని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి తెలిపారు. ఈ చీరలు ధరించడం ద్వారా తమ సంఘాల మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఆమె అన్నారు.

## సమగ్ర న్యాయ విచారణ (మొదటి పేజీ తరువాయి)

కూనంనేని గుర్తు చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 12వందల మందిని చంపిందని, రెండేళ్ల కాలంలో 900ల మందిని హత్య చేసిందన్నారు. ఇప్పటికైనా ఎన్‌కౌంటర్లను నిలిపివేసి, పోలీసుల అదుపులో ఉన్నట్టు చెబుతున్న మావోయిస్టు నాయకులు తిరుపతితో పాటు అందరినీ న్యాయస్థానంలో హాజరుపర్చాలని, చట్టపరంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కొందరు అక్రమ మార్గంలో వేల కోట్లు సంపాదించిన వారు పార్లమెంట్‌లో ఉంటే, ప్రజల కోసం పనిచేసే వారు జైలులో, అడవుల్లో ఉంటున్నారన్నారు. 1952 అనుభవాలు దృష్టిలో పెట్టుకుని మావోయిస్టులు తమ మార్గాన్ని వదిలి, పేద వర్గాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి అందరూ కలిసి పనిచేసేందుకు ముందుకురావాలని కోరారు. మావోయిస్టు హత్యలపైన న్యాయపోరాటం చేసే విషయమూ ఆలోచిస్తామని, అలాగే అందరిని కలుపుకుని పోరాటం చేస్తామన్నారు.

**కఠినంగా వ్యవహరించే వాళ్లు ప్రభుతాన్ని ఎలా నడిపిస్తారు ?**

దేశంలో మనిషి ప్రాణానికి విలువ ఇవ్వడం లేదని, ప్రజాస్వామ్య దేశంలోనే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, కనీసం మానవత్వంగా వ్యవహరించకుండా, కఠినంగా వ్యవహరించే వారు (కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం) ఇక ప్రభుత్వాన్ని ఎలా నడిపిస్తారని, ఇలాంటి వారు ప్రజాస్వామ్యాన్ని కాపాడుతారా? అని కూనంనేని సాంబశివరావు దుయ్యబట్టారు. పేద వర్గాల తరపున పోరాటం చేసే వారిని, ప్రభుత్వాలను ప్రశ్నించిన వారిని గతంలో జైలు లో పెడితే, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం చిత్రహింసలకు గురి చేస్తూ చంపేస్తున్నారని, ఇందుకు హిడ్మానే నిదర్శనమన్నారు. బ్రిటీష్ కాలంలో కూడా ప్రజా సమస్యలపైన పోరాటం చేసే వారిని, ప్రశ్నించేవారిని పిలిచి మాట్లాడేవారని, కానీ ప్రస్తుతం కనిపించినవారినల్లా చంపుకుంటూ వెళ్తున్నారని, ఇలాచేస్తే సమాజంలో మనుషులు ఉంటారా? అని అన్నారు.

పుల్వామా దాడి నేపథ్యంలో చర్చలకు సిద్ధమైన కేంద్ర ప్రభుత్వం, భారతదేశానికి చెందిన, పేద వర్గాల కోసం పనిచేసే మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపబోరని నిలదీశారు. మావోయిస్టులను చంపిన వారిని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా అభినందిస్తున్నారని, ఒక దేశం మరో దేశంపైన గెలిచినట్టుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

**సిద్ధాంతాలను, భావాలను చంపడం సాధ్యం కాదు..**

మనుషులను చంపినంత మాత్రానా, సిద్ధాంతాలను, భావాలను చంపడం సాధ్యం కాదనే విషయం మానవ చరిత్ర చెబుతుందని కూనంనేని సాంబశివరావు గుర్తు చేశారు. మావోయిస్టులు తమ కుటుంబాలను, జీవితాలను వదులుకుని అడవుల్లో జీవిస్తున్నారని, వారు ఏ సమస్యల కోసం అడవి బాట పట్టారో ఆ సమస్యల పరిష్కారానికి ఆలోచించాలని సూచించారు. మావోయిస్టులను చంపేస్తే ఇక అడవీ ప్రాంతాల్లో ఉన్న విలువైన ఖనీజాల విషయంలోఎవ్వరూ అడిగేవారు ఉండబోరని కేంద్రం భావిస్తుందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశాన్ని జంగల్ రాజ్యగా మారుస్తున్నారని కూనంనేని సాంబశివరావు దుయ్యబట్టారు. బిజెపిని ప్రశ్నించే వారిని అర్బన్ నక్సలైట్లుగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. హిట్లర్ నమూనాగా పరిపాలిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ప్రజలు భయానకంగా శిక్షిస్తారని, ఇలాంటి వారు కాలగర్భంలో కలువక తప్పదని హెచ్చరించారు. నేపాల్, శ్రీలంకలో కూడా ఇదే జరిగిందని కూనంనేని గుర్తుచేశారు.

## ఏడుగురు నక్సల్స్ మృతి (మొదటి పేజీ తరువాయి)

అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ రంపచోడవరం పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశం లో వివరాలు వెల్లడించారు. ఈ ఆపరేషన్ కి సంభవ్ అని నామకరణం చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 13 మావోయిస్టులు హతమార్చామని, అందులో ఇద్దరు అగ్ర నేతలు ఉన్నట్లు తెలిపారు. ఆపరేషన్ సంభవ్ కొనసాగుతుందన్నారు. బుధవారం తెల్ల వారు జామున కూంబింగ్ చేస్తున్న భద్రతా దళాల కు మావోయిస్టు లు తారస పడటంతో భీకరంగా ఎదురు కాల్పులు జరిగినట్లు తెలిపారు. ఆతర్వాత ఘటనా స్థలిలో ఏడుగురు మావోయిస్టుల మత దేహాలు కనుగొన్నట్లు ఎస్పీ తెలిపారు.

మృతి చెందిన వారిలో ముగ్గురు మహిళా మావోయిస్టులతో పాటు అగ్ర నేత మేటూరి జోగారావు అలియాస్ టెక్ శంకర్ ఉన్నట్లు తెలిపారు. మృత దేహాలను రంపచోడవరం ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. కాగా, ఈ ఘటనలో రెండు ఏకే 47 రైఫిళ్లు, ఐదు మ్యాగజైన్‌లు, విప్లవ సాహిత్యం తో పాటు కిట్ బ్యాగ్ లు లభించినట్లు తెలిపారు. మంగళవారం ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతానికి ఐదు కిలోమీటర్ల దూరంలోనే ఈ ఎన్ కౌంటర్ చోటు చేసుకుంది. మతి చెందిన మెట్టూరి జోగారావు అలియాస్ టెక్ శంకర్ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు. ఏఓబీ ప్రాంతానికి ఇంచార్జ్‌గా ఉన్నారు. బాంబుల తయారీ వంటి సాంకేతిక పనుల్లో దిట్ట. టెక్నికల్ ఆపరేషన్లలో కీలక నేతగా పేరొందారు. జోగారావు శ్రీకాకుళం ప్రాంతానికి చెందినవారు.

**మిగిలిన మావోయిస్టులులొంగిపోవాలి:ఇంటెలిజెన్స్ డిజి లద్దా**

మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌ను ఏపీ ఇంటెలిజెన్స్ డీజీ మహేశ్‌చంద్ర లద్దా ధ్రువీకరించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు అందాల్సి ఉందని చెప్పారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మిగిలిన మావోయిస్టులు లొంగిపోవడం మంచిదని హితవు పలికారు. ''చత్తీస్గఢ్, తెలంగాణ నుంచి ఏపీకి రావడానికి మావోయిస్టులు ప్రయత్నిస్తున్నారు. పటిష్ట నిఘా ఏర్పాటు చేసి కదలికలను గమనిస్తున్నాం. నవంబరు 17న ఒక ఆపరేషన్ ప్రారంభించాం. 18న ఉదయం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. సెంట్రల్ కమిటీ మెంబర్ హిడ్మా మద్వితో పాటు మరో ఐదుగురు మావోయిస్టులు హతమయ్యారు. మరోవైపు ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో 50 మందిని అరెస్టు చేశాం. వీరిలో స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్లు ముగ్గురు, ప్లాటూన్ మెంబర్లు 23 మంది, డివిజినల్ కమిటీ మెంబర్లు ఐదుగురు, ఏరియా కమిటీ మెంబర్లు 19 మంది ఉన్నారు. ప్రజలకు ఎక్కడా హాని జరగకుండా ఈ అరెస్టులు చేశాం. దొరికిన మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు కూడా స్వాధీనం చేసుకున్నాం. మంగళవారం జరిగిన మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ తర్వాత కొందరు మావోయిస్టులు పారిపోయారు. వారిని కూడా పట్టుకునేందుకు బందాలు రంగంలోకి దిగాయి'' అని ఏడీజీ తెలిపారు. ఇక హిడ్మా ఎదురుకాల్పుల్లోనే చనిపోయారని, జర్నలిస్టులకు హిడ్మా లేఖ రాయడం గురించి తెలియదని తెలిపారు. ఆయన్ను పట్టుకున్నాక చంపారనే విషయంలో వాస్తవం లేదన్నారు. మావోయిస్టు రహిత ఆంధ్రప్రదేశ్ కోసం కషి చేస్తున్నామని తెలిపారు. మావోయిస్టుల ప్లాన్ ఏంటో, కానూరులో ఎందుకున్నారో దర్యాప్తు చేస్తున్నామన్నారు. త్వరలో చాలా మంది లొంగిపోతారని, అరెస్టుల వల్ల భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. చత్తీస్గఢ్‌లో చాలా చోట్ల దాడులు జరుగుతున్నాయి. దీంతో అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు మావోయిస్టులు వెళ్తున్నారు. ఈక్రమంలో వారు పట్టుబడుతున్నారు'' అని లద్దా తెలిపారు.

**కోనసీమ జిల్లాలో హిడ్మా అనుచరుడి అరెస్ట్?**

కోనసీమ జిల్లాలో మావోయిస్టు కార్యకలాపాలు కలకలం రేపాయి. మావోయిస్టు అగ్రనేత హిడ్మా అనుచరుడిగా భావిస్తున్న మడివి సరోజ్‌ను పోలీసులు రావులపాలెంలో ఈరోజు అదుపులోకి తీసుకున్నారు. అతడిని అరెస్ట్ చేసి, రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్లు సమాచారం. హిడ్మా అనుచరుడిగా ఉన్న మడివి సరోజ్ రావులపాలెంలో తలదాచుకున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందడంతో రంగంలోకి దిగిన ప్రత్యేక బందాలు అతడిని గుర్తించి అరెస్ట్ చేశాయి. అరెస్టయిన మడివి సరోజ్ స్వస్థలం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంగా గుర్తించారు. మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ తర్వాత ఏజెన్సీ నుంచి తప్పించుకుని కోనసీమ ప్రాంతానికి వచ్చాడా? లేక మరేదైనా కారణంతో ఇక్కడ ఆశ్రయం పొందుతున్నాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ అరెస్ట్‌తో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మరోసారి మావోయిస్టుల కదలికలపై చర్చ మొదలైంది.

**ఏలూరులో 15మందికి రిమాండ్**

ఏలూరులో అరెస్టు చేసిన 15 మంది మావోయిస్టులకు కోర్టు రిమాండ్ విధించింది. మొబైల్ కోర్టు న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఒక్కొక్కరిని విడివిడిగా విచారించారు. పేరు, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులు బెదిరించారా? అని నేరుగా మావోయిస్టులను న్యాయమూర్తి ప్రశ్నించినట్లు తెలిసింది. నిందితులను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

**కాకినాడలో ఇద్దరికి రిమాండ్**

హిడ్మా ఎన్ కౌంటర్ నేపథ్యంలో కాకినాడ నుంచి తప్పించుకోవాలని ప్రయత్నంచి సామర్లకోట పోలీసులకు పట్టుబడ్డ మహిళా మావోలను బుధవారం సాయంత్రం పెద్దాపురం పోలీసులు కాకినాడ కోర్టుకు తరలించారు. కొప్పవరంలో అదుపులోకి తీసుకున్న ఇద్దరు మావోయిస్టులు అంకిత (27) అనూష (25)గా గుర్తించారు. హిడ్మాకు అంగరక్షకులుగా వ్యవహరించారు. వీరికి సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులచే డీఎస్పీ కార్యాలయంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. తొలుత విజయవాడ తరలించాలని నిర్ణయించు కోగా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాకినాడ కోర్టులో హాజరుపర్చారు. డిసెంబర్ మూడో తేదీ వరకు రిమాండ్ విధిస్తూ మెజిస్ట్రేట్ ఆదేశించారు. దీంతో కాకినాడ సబ్‌జైలుకు తరలించారు.

## ఎన్‌కౌంటర్ ఎలా అయ్యాడు? (మొదటి పేజీ తరువాయి)

జనజీవన స్రవంతిలోకి రావడం బలాన్ని చేకూరుస్తుంది. హిడ్మా ఇంకా తుపాకీనే నమ్ముకుని ఉంటే తన కూతురిని ఎందుకు జనజీవన స్రవంతిలోకి పంపించాడనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో హిడ్మా కూడా త్వరలో లొంగిపోతారనే ప్రచారం జోరుగా సాగింది. తన అనుచరులతో కలిసి తెలంగాణ పోలీసుల ఎదుట హిడ్మా ఆయుధాలు అప్పగించే అవకాశాలున్నాయని రాష్ట్ర నిఘా వర్గాలు అంచనా వేశాయి. గత నెల 27న 'ప్రజాపక్షం' దినపత్రికలో ''హిడ్మా లొంగుబాటుకు రంగం సిద్ధం?'' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. మరుసటి రోజే సిపిఐ (మావోయిస్టు)కీలక నేతలు, కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాద్‌రావు అలియాస్ చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాష్ అలియాస్ ప్రభాత్‌లు తెలంగాణ డిజిపి బి.శివధర్‌రెడ్డి ముందు లొంగిపోయిన విషయం తెలిసిందే. ఇదే తరహాలో హిడ్మా కూడా త్వరలో లొంగిపోతాడని అందరూ భావించినట్లుగానే అతడు పావులు కదిపాడని తెలుస్తుంది. తన లొంగుబాటును క్లియర్ చేసుకునేందుకు ఎపికి చెందిన ఓ పోలీసు అధికారితో పాటు జర్నలిస్టుకు కూడా హిడ్మా లేఖ రాశాడనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. లొంగిపోయేందుకు గ్రీన్ సిగ్నల్ వచ్చిన తరువాతనే తన భార్యతో పాటు హిడ్మా కర్రెగుట్టల నుంచి ఎపిలోకి అడుగుపెట్టినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో హిడ్మాను నమ్మించి హత మార్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2003 అక్టోబర్ 1న అప్పటి ఉమ్మడి ఎపి సిఎం చంద్రబాబును లక్ష్యంగా చేసుకుని తిరుపతిలోని అలిపిరిలో మావోయిస్టులు మందుపాతరలను పేల్చారు. ఈ సంఘటనలో చంద్రబాబు తృటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. దీంతో తనను చంపాలనుకున్న మావోయిస్టులపై సహజంగానే చంద్రబాబుకు కోపం ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మరోవైపు ప్రధాని మోదీ మెప్పు పొందేందుకే బూటకపు ఎన్‌కౌంటర్‌కు ఎపి పోలీసులు స్కెచ్‌వేసి ఉండవచ్చనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలలో రికార్డుస్థాయిలో ఇటీవలే వందలాదిమంది మావోయిస్టులు లొంగిపోయారు. ఎపిలో కూడా లొంగిపోయేందుకు హిడ్మా తన అనుచరులతో వచ్చారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ తరుణంలోనే బుధవారం ఎపిలోని సత్యసాయి జిల్లాలో ప్రధాని మోదీ పర్యటన ఖరారైంది. మోదీ వద్ద ఎపి ప్రభుత్వం సత్తా చాటుకునేందుకే లొంగిపోయేందుకు వచ్చిన హిడ్మాను బూటకపు ఎన్‌కౌంటర్‌తో హతమార్చిందా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

### సవరణ

ప్రజాపక్షం దినపత్రిక 18–11–2025 (మంగళవారం) మొదటి పేజీలో '42 శాతం రిజర్వేషన్లు' శీర్షికన ప్రచురితమైన వార్తలో 'ఎస్ఆర్ఎస్‌పి స్టేజ్–2'కు ఇటీవల మరణించిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేరు పెట్టాలని మంత్రివర్గం తీర్మానించింది అని చదువుకోగలరు.

– సంపాదకులు



# జనరల్
STATE & REGIONAL NEWS

## నార్త్‌ఈస్ట్ కనెక్ట్ ఫెస్టివల్‌కు తెలంగాణ ఆతిథ్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ వేదికగా తెలంగాణ నార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్ ఏ టెక్నోకల్చరల్ ఫెస్టివల్ పేరిట సాంకేతిక, సాంస్కృతిక మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, అసోం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్ సిక్కిం, త్రి పురల మధ్య సాంకేతిక, సాంస్కృతిక పరిజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, త ద్వారా ఇరు ప్రాంతాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. హైటెక్స్‌లో నవంబర్ 20 నుండి 22 వరకు, రాజ్ భ వన్‌లో నవంబర్ 25 నుండి 27 వరకు రెండు విడతలుగా ఈ ఉత్సవాన్ని ని ర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ కార్యాలయం, ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు హైటెక్స్ లో 'సంస్కృతుల సంగమం సమృద్ధికి సోపానం' అనే అంశంతో ఘనంగా ప్రా రంభించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సిఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర మంత్రులు, ఈశాన్య రాష్ట్రాల గవర్నర్లు హాజరుకానున్నారు.

# ప్రభుత్వ హాస్పిటళ్లలో వృద్ధులకు ప్రత్యేక వైద్య సేవలు

- జెరియాట్రిక్ సేవలు విస్తరించాలని సూచించిన మంత్రి దామోదర్
- డిఎంహెచ్‌ఓలు, ఆసుపత్రుల సూపరింటెండెంట్లతో సమీక్ష
- రోగులను దోచుకునే ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోండి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చికిత్స పేరిట ప్రజలను దోచుకునే ప్రైవేట్ హాస్పిటళ్లపై కఠినంగా వ్యవహరించాలని, ఐవిఎఫ్ సెంటర్లు, పెయిన్ క్లినిక్‌లు, రిహాబిలిటేషన్ సెంటర్ల పేరుతో దోపిడీకి, అ వకత వకలకు పాల్పడేవారిని ఉపేక్షించవద్దని రాష్ట్ర వైద్య, ఆరోగ్యచ కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ అన్నారు. మెడికల్ ఎడ్యుకేషన్, వైద్య విధాన పరిషత్, పబ్లిక్ హెల్త్, ఎన్‌హెచ్‌ఎం శాఖల మధ్య మరింత సమన్వయం అవసరమని, ఎక్కడికి అక్కడ సమన్వయ కమిటీలను నియమించుకుని పనిచేయాలన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయాలని, పోలీసులను చూడగానే నేరస్తులు భయపడినట్టు, వైద్యాధికారులను చూస్తే నిబంధనలను ఉల్లంఘించే ఆసుపత్రుల యాజమాన్యాలు భయపడాలన్నారు.ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, అన్ని జిల్లాల డిఎంహెచ్‌ఓలు, ప్రోగ్రామ్ ఆఫీసర్లతో మంత్రి బుధవారం సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ ఇనిస్టిట్యూట్‌లో జరిగిన ఈ సమీక్షలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, డిఎంఈ నరేంద్ర కుమార్, టివివిపి కమిషనర్ అజయ్ కుమార్, డిహెచ్ ర వీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ మాట్లాడుతూ కొన్ని జిల్లాలలో సిజేరియన్ డెలువరీలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని తగ్గించి సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, సిజేరియన్ డెలివరీలు మాత్రమే చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి రోగులను బయటి ఆసుపత్రులకు రిఫర్ చేయొద్దని మంత్రి అన్నారు. సబ్ సెంటర్ నుంచి జిజిహెచ్‌ల వరకూ అన్నిఆసుపత్రుల మధ్య సమన్వయం ఉండాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగికి అవసరమైనప్పుడు మరో ప్రభుత్వ ఆసుపత్రికి మాత్రమే రిఫర్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే అవసరమైన అన్నిరకాల వైద్య సేవలు అందించాలన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రులలో వృద్ధులకు ప్రత్యేక వైద్య సేవలు

దేశంలో, రాష్ట్రంలో పెరుగుతున్న వృద్ధుల జనాభాకు అనుగుణంగా వారికి అవసరమైన వైద్య సేవలను కూడా విస్తరిస్తున్నామని మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ తెలిపారు. అన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులలో జెరియాట్రిక్ సేవలు అందించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు. జీవన ప్రమాణాలు పెరిగాయని, దీంతో వృద్ధుల సంఖ్య కూడా పెరుగుతున్నదన్నారు. పిల్లల కోసం మనం ప్రత్యేకంగా చైల్ హెల్త్ కేర్ సెంటర్లు నిర్వహిస్తున్నట్టుగానే, జపాన్, ఇటలీ తరహాలో వృద్ధుల కోసం ప్రత్యేక హాస్పిటళ్లు నిర్వహించాల్సిన అవసరం భవిష్యత్తులో మన దేశంలోనూ ఏర్పడుతుందన్నారు. వృద్ధాప్యంలో వచ్చే మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని అన్ని హాస్పిటళ్లలోనూ జెరియాట్రిక్ సేవలను విస్తరించాలని మంత్రి సూచించారు. ప్రతి జిజిహెచ్, డిస్ట్రిక్ట్ ఆసుపత్రులలో ఇప్పటికే జెరియాట్రిక్ వార్డులు ఏర్పాటు చేశామన్న విషయాన్ని ప్ర జలకు తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధుల జాబితాలు సిద్ధం చేసుకుని, వారికి ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత డిఎంహెఓలదేనని మంత్రి ఆదేశించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వైద్య వ్యవస్థ కూడా మారాలన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బకాయిలు చెల్లించాలి

### సిఎం రేవంత్ రెడ్డికి చాడ వెంకట్ రెడ్డి వినతిపత్రం

**ప్రజాపక్షం/హైదరాబాద్/ కరీంనగర్ :** రాష్ట్ర వ్యాపితంగా మధ్యాహ్న భోజన పథకంలో పని చేసే కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతన బకాయిలను చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ చాడ వెంకటరెడ్డి కోరారు. సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర వ్యాపితంగా చేపడుతున్న 'బస్సుజాత'లలో ఆయా ప్రాంతాలకు వెళ్ళిన సందర్భాలలో మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తమకు వినతి పత్రాలు అందజేసినట్టు వివరించారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డిని చాడ వెంకట్ రెడ్డి హైదరాబాద్‌లో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేలు ఇస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు అమలు కాలేదని, ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.3 వేలు కూడా ఏడు నెలల నుండి పెండింగ్‌లో ఉన్నాయని సిఎంకు చాడ వివరించారు. కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను, కూరగాయాలు, కోడిగుడ్లు, గ్యాస్ సిలిండర్ ధరలను ప్రభుత్వమే సరఫర చేయాలని, కార్మికులందరికీ గుర్తింపు కార్డులు, బీమా, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ప్ర భుత్వం చెల్లిస్తున్న ధరలకు, ప్రస్తుత మార్కెట్ ధరలకు తేడా ఉన్నదని, ఆ ధరలతో నిత్యావసర వస్తువులు రాకపోవడంతో వారు అప్పులు తెచ్చి విద్యార్థులకు కడుపునిండ భోజనం వడ్డిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే మధ్యాహ్న భోజన పథ కం కార్మికులకు పెండింగ్ లో ఉన్న వేతనాలు చెల్లిస్తూ , నిత్యావసర వస్తువులకు అనుగుణంగా ఇచ్చి న హామీ మేరకు రూ.10 వేలు పెంచాలని చాడ వెంకట్ రెడ్డి కోరారు.



### మానేరు రివర్‌ఫ్రంట్‌లో అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

కరీంనగర్ నగరంలోని మానేరు రివర్ ఫ్రంట్‌లో అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని, జిల్లాలోని ఇతర సమస్యలపై సిపిఐ సీనియర్ జాతీయ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి బుధవారం హైదరాబాదులో సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కరీంనగర్ నగరంలో మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనుల పేరుతో గత ప్రభుత్వం రివర్ ఫ్రంట్ నిర్మాణం కోసం రూ.500 కోట్లు మంజూరు చేసిందని, అందులో టూరిజం శాఖ రూ.100 కోట్లు , నీటిపారుదల శాఖ రూ.100 కోట్లు నిధులు విడుదల చేసిందని పేర్కొన్నారు. గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మానేరు రివర్‌ఫ్రంట్ పనుల నిర్మాణాన్ని చేపట్టి, ఆ నిర్మాణ పనులను పూర్తి చేయుటకు బిఆర్‌ఎస్ నాయకుల అనుచరులకు అప్పగించి పూర్తి చేయకపోవడం వల్ల రివర్‌ఫ్రంట్‌లో చేసిన పనులు నాణ్యత ప్రమాణాలు లోపించాయన్నారు. ఆపనులు పూర్తిగా లోపించాయని, వారికి కొంత బిల్లులు చెల్లించినప్పటికీ నిర్మాణ పనుల్లో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయనే విషయాన్ని సిఎం దృష్టికి వెళ్లిన ట్లు తెలిపారు. రివర్‌ఫ్రంట్ పరిధిలోని చెక్ డ్యాములు నిర్మిస్తే వాటిలోనూ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా వర్షాకాలంలో వర్షాలు కురిస్తే అవి కొట్టుకుపోయాయని, చెక్ డ్యాములు కొట్టుకుపోయినప్పటికీ రివర్ ఫ్రంట్ పనుల నిధులు విడుదలయ్యాయని, ఐదు సంవత్సరాలకు పైగా సమయం గడుస్తున్న నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. తక్షణమే రివర్‌ఫ్రంట్ పనుల్లో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సానకూలంగా స్పం దించారని, అలాగే జిల్లాలోని సమస్యలపై వివరించడం జరిగిందని చాడ వెంకటరెడ్డి తెలిపారు.

# సింగరేణి భవన్ ఎదుట కవిత ఆందోళన

### అదుపులోకి తీసుకుని ఆరెస్టు చేసిన పోలీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించాలని, మెడికల్ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ లక్డీకపూల్‌లోని సింగరేణి భవన్‌ను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ముట్టడించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు అక్కడికి చేరుకుని కవితను అరెస్టు చేశారు. హైదరాబాద్ నగరంలోని నాంపల్లిలో గల సింగరేణి భవన్ వద్ద ఆందోళనకు దిగిన కవితను అదుపులోకి తీసుకున్నారు. సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కవిత సింగరేణి భవన్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డిపెండెంట్ ఉద్యోగులను పునరుద్ధరించాలని ఆమె అన్నారు. సింగరేణి సమస్యలను పరిష్కరించలేని అసమర్థ ప్రభుత్వమని ఆమె విమర్శించారు. కార్మికుల కోసం మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కవితతో పాటు బైఠాయించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సింగరేణి భవన్‌ను కవిత ముట్టడిస్తుందన్న సమాచారంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



# నక్సలైట్లు అడవుల్లో చస్తుంటే.. అర్బన్ నక్సలైట్స్ పదవులు అనుభవిస్తున్నారు

- అమాయక నక్సలైట్లను రెచ్చగొట్టి వారి చావులకు కారకులయ్యారు
- ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు అర్బన్ నక్సలైట్లు వ్యతిరేకం కాదా..? : కేంద్ర మంత్రి బండి సంజయ్



**ప్రజాపక్షం / హుజురాబాద్ :** నక్సలైట్లు అడవుల్లో చస్తుంటే..అర్బన్ నక్సలైట్స్ పదవులు అనుభవిస్తున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. హుజురాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత, గిరిజన, ఆదివాసీ అమాయకులను రెచ్చగొట్టి నక్సలైట్లుగా మార్చిన అర్బన్ నక్సలైట్లే వారి చావులకు కూడా బాధ్యత వహించాల్సిందేనన్నారు. అమాయక నక్సలైట్లు అడవుల్లో చనిపోతుంటే అర్బన్ నక్సలైట్లు మాత్రం ఆస్తులు కూడగట్టుకుని ప్రభుత్వ నామినేటెడ్, కమిషన్ పదవుల్లో కొనసాగుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడటమే తమ సిద్ధాంతమని పదే పదే చెప్పుకునే అర్బన్ నక్సలైట్లు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎందుకు పదవుల్లో కొనసాగుతున్నారని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న లేకున్నా మావోయిజానికి బిజెపికి వ్యతిరేకం, తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం అసాధ్యం అన్నారు. మావోయిస్టుల పేరుతో అమాయకులను బలి తీసుకున్నారన్నారు. అర్బన్ నక్సల్స్ మిమ్మల్ని రెచ్చగొడుతున్నారని, వాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని అడవుల్లో అన్నలకు విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. నక్సలిజాన్ని ఎవరూ సమర్థించినా వాళ్లు కూడా నేరస్థులే అని, మావోయిస్టులే తుపాకులు వదిలి జన జీవన స్రవంతిలో కలుస్తుంటే అందుకు భిన్నంగా అర్బన్ నక్సల్స్ తుపాకులు పట్టండి, మావోయిస్టుల్లో చేరండి అంటే ఊరుకుంటామా ఇది సమర్థనీయమా? వారి విజ్ఞతకే వదిలేస్తున్నా అని అన్నారు. వారి వెంట పలువురు బిజెపి నాయకులు తదితరులు ఉన్నారు.

# ఐ బొమ్మ పోతే మరో బొమ్మ వస్తది..

### ఆ నేరాలు ఆగవు.. నిరంతర నివారణ అవసరం హోంశాఖ స్పెషల్ సిఎస్ సివి ఆనంద్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సినిమాలను పైరసీ చేస్తూ.. ఇండస్ట్రీని బెంబేలెత్తించిన ఐబొమ్మ నిర్వాహకులు ఇమ్మడి రవిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. దర్యాప్తులో అతను 50 లక్షల మందికి చెందిన సమాచారాన్ని డార్క్ వెబ్‌కు అమ్మినట్లుగా తేలింది. దీంతో ఐబొమ్మ వెబ్‌సైట్‌ను విజిట్ చేసిన వారంతా ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఇకనైనా పైరసీ ఆగుతుందా? సైబర్ క్రైమ్‌కు చెక్ పడుతుందా? అని తలెత్తుతున్న సందేహాలపై రాష్ట్ర హోంశాఖ స్పెషల్ సీఎస్ సివి ఆనంద్ ఎక్స్ వేదికగా స్పందించారు.హ్యాకర్లు, హ్యాకింగ్ అనేవి కొనసాగుతూనే ఉంటాయన్నారు. ఒకడు పోతే మరొకడు వస్తాడని, వాడు కూడా మరింత టెక్నాలజీని ప్రదర్శిస్తాడని పేర్కొన్నారు. కొందరిని అరెస్ట్ చేశామన్న కారణంతో పైరసీ లేదా సైబర్ క్రైమ్స్ పూర్తిగా ఆగిపోతాయని అనుకోవడం అసాధ్యమని పేర్కొన్నారు. పెద్ద పెద్ద దొంగతనాలకు పాల్పడిన సాంకేతిక నైపుణ్యం ఉన్న దొంగల గ్యాంగ్స్‌ను పట్టుకున్న తర్వాత దొంగతనాలు, చోరీలు, దాడులు, మోసాలు ఆగిపోయాయా? మనిషి ఉన్నంతకాలం ఈ రకాల నేరాలు కూడా జరుగుతూనే ఉంటాయని తెలిపారు. వీటికి మన చేతిలో ఉన్న మార్గం నివారణ ఒక్కటేనని హితవు పలికారు. ఈజీ మార్గాల్లో డబ్బు సంపాదించాలన్న కోరికలను తగ్గించుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్ పెరగడానికి ఆ కోరికే మూలకారణమని సీవీ ఆనంద్ తెలిపారు. సైబర్ స్పేస్, అకౌంట్లను సేఫ్‌గా ఉంచుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జీవితంలో ఏదీ ఫ్రీగా రాదని డైరెక్టర్ రాజమౌళి చెప్పిన మాటే జీవిత సత్యమని పునరుద్ఘాటించారు.

# 'స్కిల్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా'గా తెలంగాణ

### 'ఏఐ'తో ఉద్యోగాలు పోతాయన్నది కేవలం అపోహే
### సంక్షోభంతో పాటే కొత్త అవకాశాలు : మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'స్కిల్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా' గా తెలంగాణను మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఎఐ, మెషిన్ లెర్నింగ్, క్వాంటం కంప్యూటింగ్ లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌లో తెలంగాణ యువతను పరిశ్రమల భాగస్వామ్యంతో అత్యుత్తమ నైపుణ్యమున్న మానవ వనరులుగా తీర్చిదిద్దేలా కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఇఎస్‌ఐసి)లోనిర్వహించిన 'స్కిల్ కాన్వకేషన్ ఇన్ ఐటి,ఐటిఇఎస్ సెక్టార్ ఎఐ, డిజిటల్ టెక్నాలజీస్ హ్యాకథాన్ 2025'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... టెక్నాలజీ రోజురోజుకీ వేగంగా మారుతుందని, ఆ మార్పులను అందిపుచ్చుకోగలిగితేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. రెండేళ్లలోనే 40 శాతానికి పైగా అంతర్జాతీయ కంపెనీలు 'జనరేటివ్ ఏఐ'ను తమ కోర్ వర్క్‌లో భాగం చేసుకున్నాయన్నారు. 'ఏఐ' వల్ల ఉద్యోగాలు పోతాయన్నది అపోహే, అది కేవలం ఉద్యోగాల స్వరూపాన్ని మాత్రమే మారుస్తుందన్నారు. ఆటోమేషన్ వల్ల 85 మిలియన్ జాబ్స్ పోతే, కొత్తగా 97 మిలియన్ల స్కిల్ బేస్డ్ ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరం తేల్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సంక్షోభంతో పాటే కొత్త అవకాశాలు కూడా వస్తాయని, అందుకు సంసిద్ధంగా ఉండాలని యువతకు సూచించారు. ఓ వైపు సైబర్ క్రైమ్స్ రోజురోజుకీ పెరుగుతున్నాయని, మరోవైపు ఎథికల్ హ్యాకర్లు, సైబర్ సెక్యూరిటీ నిపుణులకు భారీ డిమాండ్ ఏర్పడుతుందన్నారు. వాతావరణ మార్పుల వల్ల క్లీన్ టెక్, ఈవీలు, గ్రీన్ ఇన్నోవేషన్ రంగాల్లో అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. అలా అని ఈ డిజిటల్ యుగంలో కేవలం అకడమిక్ డిగ్రీలతో మాత్రమే ఉద్యోగాలు రావని, ఇన్నోవేషన్, ప్రాబ్లం సాల్వింగ్, ప్రాక్టికల్ స్కిల్స్ ఉంటేనే సక్సెస్ సాధ్యమన్నారు. తమ ప్రభుత్వం భవిష్యత్తును కేవలం ఊహించడం లేదని, దానికి అవసరమైన 'స్కిల్లింగ్ ఎకో సిస్టం'ను నిర్మిస్తోందన్నారు. మార్కెట్, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా 'రెడీ టూ వర్క్ ఫోర్స్'ను తయారు చేసే బాధ్యతను భుజానికి ఎత్తుకొనిఎత్తుకుందని వివరించారు. కార్యక్రమంలో ఇఎస్‌ఐసి డైరెక్టర్ డా.రామేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# సౌదీలో సహాయక చర్యల్లో అజారుద్దీన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సౌదీ అరేబియాలో దురదృష్టవశాత్తు జరిగిన బస్సు ప్రమాదంలో తెలంగాణ వాసులు మృతిచెందారు. ఈ ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తోంది. ప్రభుత్వ సూచనల మేరకు మైనారిటీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ సౌదీకి వెళ్లారు. మదీనాలోనే ఉన్నారు. సోమవారం రాత్రి సౌదీ అరేబియాకు చేరుకున్న మంత్రి.. అప్పటి నుండి సహాయక చర్యలను సమన్వయం చేస్తున్నారు. మంత్రి అజారుద్దీన్.. మైనారిటీ సంక్షేమ కార్యదర్శి బి.షఫియుల్లా, ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌లతో కలిసి.. జెడ్డాలోని భారత కాన్సుల్ జనరల్ ఫహద్ అహ్మద్ ఖాన్ సూరి, సౌదీలోని సీనియర్ అధికారులతో నిరంతర సమన్వయం చేస్తున్నారు. అంతకుముందు.. రియాద్‌లో సౌదీ అరేబియాలోని భారత రాయబారి డాక్టర్ సుహెల్ అజాజ్ ఖాన్‌ను కూడా కలిశారు. పరిస్థితిని వివరించి.. సహకారం కోరారు. మంత్రి మహమ్మద్ అజారుద్దీన్.. సౌదీ అరేబియాలో తనకున్న వ్యక్తిగత పరిచయాలను ఉపయోగించి.. అన్ని లాంఛనాలు, అనుమతులు, లాజిస్టికల్ అవసరాలు ఆలస్యం లేకుండా వేగవంతంగా చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో వివిధ ఏజెన్సీలతో సమన్వయం చేస్తున్నారు. బస్సు ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన షోయెబ్ కుటుంబ సభ్యుడిని కూడా కలిశారు. అతనికి అన్నివిధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అంత్యక్రియల్లో పాల్గొనడానికి మదీనాకు చేరుకున్న మృతుల కుటుంబ సభ్యలను మంత్రి రిసీవ్ చేసుకున్నారు.అదే విధంగా ఆ కుటుంబ సభ్యులతో పాటు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు కూడా మదీనా చేరుకొని వారి ప్రయాణం, వసతి, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.అంతే కాకుండా వారు మృతదేహాల గుర్తింపు, డిఎన్‌ఎ మ్యాచింగ్ ప్రక్రియను కూడా సులభతరం చేస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా లాంఛనాలను పూర్తి చేయడానికి, స్థానిక విధానాలు, కుటుంబ ప్రాధాన్యతలకు అనుగుణంగా అంత్యక్రియలు నిర్వహించడానికి వీలుగా తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం సౌదీ అధికారులతో 24 గంటలూ కలిసి పనిచేస్తోంది. మంత్రి అజారుద్దీన్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నిరంతరం మాట్లాడుతూ.. అక్కడ తీసుకుంటున్న చర్యల గురించి వివరిస్తున్నారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ప్రభుత్వ యంత్రాంగం నిబద్ధతతో పనిచేస్తోంది.




# జూడో పోటీలు వీక్షించిన మంత్రి వాకిటి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎల్‌బి స్టేడియంలో జరుగుతున్న సబ్ జూనియర్ నేషనల్ జూడో ఛాంపియన్ షిప్ కు క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి హాజరై పోటీలను తిలకించారు. 52 కేటగిరీ మహిళల 60కేజి కేటగిరి బాయ్స్ విభాగాల్లో గెలిచిన వారికి మంత్రి బహుమతులు ప్రధానం చేశారు. 52కేజీ మహిళల విభాగంలో మొదటి స్థానంలో మణిపూర్, రెండవ స్థానంలో హర్యానా,మూడవ స్థానంలో జమ్మూ కాశ్మీర్, మహారాష్ట్ర, 60 కేజీ విభాగం బాయ్స్ మొదటి స్థానంలో మణిపూర్,రెండవ స్థానంలో రాజస్థాన్ 3వ స్థానంలో మహారాష్ట్ర,జమ్మూ కాశ్మీర్ నిలిచారు.ఈ కార్యక్రమంలో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# నేడు సిబిఐ కోర్టుకు జగన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వైఎస్‌ఆర్‌సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సుదీర్ఘ కాలం తర్వాత అక్రమాస్తుల కేసులో గురువారం హైదరాబాద్‌లోని సిబిఐ ప్రత్యేక కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరుకానున్నారు. ఈ మేరకు హైదరాబాద్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించడంతో, కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. గత ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరుకాలేదని, ప్రస్తుతం ఈ కేసుల్లోని డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ఆయన భౌతికంగా హాజరుకావడం తప్పనిసరి అని సిబిఐ వాదించింది. ఈ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం, నవంబర్ 21లోగా వ్యక్తిగతంగా హాజరుకావాలని జగన్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో, గడువుకు ఒకరోజు ముందే ఆయన కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల జగన్ కోర్టు అనుమతితో ఐరోపా పర్యటనకు వెళ్లారు. పర్యటన ముగిసిన వెంటనే వ్యక్తిగతంగా హాజరుకావాలని అప్పుడే కోర్టు స్పష్టం చేసింది. అయితే, ఆయన హాజరుకాకుండా మినహాయింపు కోరారు. సిబిఐ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆయన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది.

కాగా, అక్రమాస్తుల కేసులో జగ న్ 2013 సెప్టెంబరు నుంచి బెయిల్‌పై బ యట ఉన్న విషయం తెలిసిందే.

# పోలీసులపై లంచం ఆరోపణలు వస్తే ఉపేక్షించొద్దు

### ఎసిబిని అభినందించిన డిజిపి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మెదక్ జిల్లాలోని టేక్మల్ సబ్ ఇన్‌స్పెక్టర్‌ను అవినీతి ఆరోపణలపై పకడ్బందీగా అరెస్టు చేసిన అవినీతి నిరోధక శాఖ (ఎసిబి)ని డిజిపి బి.శివధర్ రెడ్డి బుధవారం నాడు అభినందించారు. ఆయన ఎసిబి డిజి చారు సిన్హాతో పాటు, ఎసిబిలోని ఇతర అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ అవినీతి పరులైన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించవద్దని ఎసిబికి సూచించారు. లంచం తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న టేక్మల్ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌ను ఎసిబి అధికారులు అరెస్టు చేసిన అనంతరం స్థానిక ప్రజలు సంబరాలు చేసుకున్న సంఘటనపై పోలీసు అధికారులు, సిబ్బంది తమ పనితీరుపై స్వీయ సమీక్ష చేసుకోవాలని డిజిపి సూచించారు. లంచం తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారి అరెస్టుపై స్థానిక ప్రజలు పటాకులు కాల్చి బహిరంగంగా సంబురాలు జరుపుకొనే సంఘటన ప్రజల నుండి ఒక బలమైన సందేశాన్ని పంపుతుందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అభిప్రాయపడ్డారు. ఆ సంఘటన పోలీసుల పట్ల ప్రజల విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందన్నారు. ప్రజలు అవినీతిని ఏ మాత్రం ఉపేక్షించరని, పోలీసుల నుండి వారు శాంతిభద్రతలను, చక్క ని పోలీసింగ్‌ను కోరుకుంటారని, ప్రజలను పీడించేవా రి పట్ల నిర్దయగా ఉంటారని ఈ సంఘటన రుజువు చే సిందని ఆయన అన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బం ది ఎవరైనా అవినీతికి పాల్పడితే వారి పైన పర్యవేక్షణ చేసే అధికారుల లోపమేనని భావిస్తానని, వారి మీద కూడ చర్యలు తీసుకుంటామని డిజిపి హెచ్చరించారు. పోలీసు అధికారులు మరియు సిబ్బంది నీతి, నిజాయితీలో పని చేయాలన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-18, కెజెడ్, జిహెచ్ఎంసి.
GHMC

టెండర్ నోటీసు
NIT No. EOI cum bid Notice Short NIT No: 21/CTO/Cir-18/GHMC/2025-26 తేది: 18.11.2025

**పని పరిధి:** జిహెచ్ఎంసి, ఖైరతాబాద్ జోన్‌లో బిల్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (బిఒటి) ఇన్-సిటు అంటే (ఒకే స్థానం) సూత్రంతో ఇప్పటికే ఉన్న పిఎఫ్‌టిలు / ఆర్‌సిసి టెయిల్లెట్లు / ఇ-టాయిలెట్లు / బయో-టాయిలెట్లను తిరిగి ఉపయోగించడం, రిఫర్‌బిష్, తిరిగి అమర్చడం మరియు ఉపయోగించుకోవాలని ఆసక్తి వ్యక్తీకరణ పిలుపు. **అంచనా మొత్తం:** సీలు వేసిన ప్రతిపాదనలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** ఇఓఐ ప్రారంభం: 19.11.2025న సా.4.00గం.ల నుండి, ప్రతిపాదన సమర్పణ ముగింపు తేదీ: 26.11.2025న సా.4.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-18, కెజెడ్, జిహెచ్ఎంసి. సెల్: 9989930414. మరిన్ని వివరాలను ఈ కార్యాలయం యొక్క టెండర్ నోటిఫికేషన్ నోటీసు బోర్డులో @ http://www.ghmc.gov.in వద్ద చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-18, కెజెడ్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 10922-PP/CL/ADVT/1/2025-26, Date: 19-11-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నెం.6
GHMC

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు
Short Tender NIT No. 28/EE-6/CRZ/GHMC/2025-26 తేది: 19.11.2025

**పని రకం:** సిసి రోడ్లు మరియు ఇతర పనులు. **అంచనా మొత్తం:** రూ.90.50 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 20.11.2025న మ.3.00గం.ల నుండి, బిడ్ల స్వీకరణకు ఆఖరి తేది: 24.11.2025న మ.3.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీ పి.సునిల్ కుమార్, ఇఇ, డివిజన్-6, సిఆర్‌జెడ్, జిహెచ్ఎంసి, హైదరాబాద్. ఫోన్ నెం. 9000922841. మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.in లో చూడవచ్చు.
**గమనిక: టెండర్ నోటీసు తేదీ తర్వాత 1% ఇఎండి పొందాలి.**

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నెం.6, చార్మినార్ జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 10951-PP/CL/ADVT/1/2025-26, Date: 19-11-2025

**OFFICE OF THE KARIMNAGAR MUNICIPAL CORPORATION**
Ph.No. 0878-2243438, Fax No. 0878-2240624,
Email:knrcmnr@rediffmail.com

Sealed Quotation Notice
No. E1/DB/MCK/8201/Quotations/Waste Collection/2025-26, Date: 18-11-2025

కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో, ఇంటి ఇంటికి చెత్తను సేకరించి, సంబంధిత అధికారులు సూచించిన డంపింగ్ యార్డునకు తరలించుటకు గాను ఆసక్తి గల ఆటో/ టాటా ఏస్ యజమానులు లేదా అనుభవము గల డ్రైవర్ల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.
1). ఎంగేజి చేయబడిన వారి స్వంత వాహనమునకు రిజిస్ట్రేషన్, ఫిట్ నెస్ సర్టిఫికేట్ మరియు డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్సు తప్పని సరిగా కలిగి యుండవలెను. 2). వాహనము లేని యెడల నగర పాలక సంస్థ యొక్క వాహనమును సమకూర్చును (అందుబాటులో గల వాహనములు మేరకు). ఇట్టి వాహనము పొందుటకు రూ// ఒక లక్ష రూపాయలు డిపాజిట్ మరియు నెలసరి అద్దె రూ.6,000.00 అక్షరాల ఆరు వేల రూపాయలు చెల్లించవలెను. ఇట్టి వాహనమును నగర పాలక సంస్థ చెత్త సేకరణకు మాత్రమే ఉపయోగించవలెను. ఇతర ఏ పనులకు ఉపయోగించరాదు. ఒక వేళ ఇతర పనులకు ఉపయోగించిన యెడల సంబంధిత వ్యక్తి యొక్క అగ్రిమెంట్ రద్దు పరచి చెల్లించబడిన డిపాజిట్ జప్తు చేయబడును. 3). అగ్రిమెంట్ కాల పరిమితి రెండు సంవత్సరములు. రెండు సంవత్సరముల తరువాత అగ్రిమెంట్ పొడగించుటకు లేదా రద్దు చేయుటకు కమిషనర్, కరీంనగర్ నగరపాలక సంస్థ వారికి పూర్తి అధికారము కలదు. 4). ఒక వాహనమునకు సుమారు 500 ఇండ్లు కేటాయించబడును. (ఇది ఒక అంచనా మాత్రమే) కేటాయించ బడిన ఇండ్ల నుండి ప్రతి రోజు, ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించి, వేరు వేరుగా రవాణా చేసి మునిసిపల్ అధికారి సూచించిన DRCC సెంటర్ లేదా డంపింగ్ యార్డుకు తరలించవలెను. 5). చెత్తను సేకరించిన సంబంధిత గృహ యజమానుల నుండి ఒక ఇంటికి నెలకు రూ. 60=00 చొప్పున యూజర్ చార్జీల రూపమున వసూలు చేసుకోవచ్చును. నగరపాలక సంస్థ నిర్దేశించిన రుసుము కంటే ఎక్కువ రుసుము వసూలు చేసిన యెడల అగ్రిమెంట్ రద్దు చేయబడును. 6). వాహనమునకు సంబంధించిన రిపేర్లు ఇందన ఖర్చు సంబంధిత వ్యక్తులే భరించవలెను. 7). కేటాయించబడిన నివాస గృహముల నుండి మాత్రమే చెత్తను సేకరించవలెను. వాణిజ్య సముదాయముల నుండి చెత్తను సేకరించరాదు.
Last Date of receiving Quotation :26-11-2025- 04.00PM
Sd/- Commissioner, Karimnagar Municipal Corporation.
DIPR R.O. No. : 10916-PP/CL/ADVT/1/2025-26, Date: 19-11-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## సబర్మతి జైలులో హైదరాబాద్ ఉగ్రవాదిపై దాడి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సబర్మతి సెంట్రల్ జైలులో ఉన్నఉగ్రవాద నిందితుడు సయ్యద్ అహ్మద్ మెహియుద్దీన్ అబ్దుల్ ఖాదర్ జిలానీపై ముగ్గురు ఖైదీలు దాడి చేశారు. జైలులో ఖైదీలు దాడి చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దొంగతనం కేసులో శిక్ష అనుభవిస్తున్న నీలేష్ శర్మ మరో ఇద్దరు నిందితులు కలిసి జిలానీపై దాడి చేయడంతో ముక్కు, కళ్ల ప్రాంతంలో గాయాలయ్యాయి. దేశభక్తిని చాటుకునేందుకే నిందితులు ఉగ్రవాది జిలానీపై దాడి చేశారని జైలు అధికారి వెల్లడించారు. దాడి జరుగుతున్న సమయంలో పోలీసులు వెంటనే అప్రమత్తమై ఇరువురిని అదుపు చేశారు. ఈ క్రమంలో జైలులో టెన్షన్ వాతావరణం నెలకొంది. ప్రస్తుతం జిలానీకి జైలులోనే మెడికల్ వార్డులో చికిత్స అందిస్తున్నారు. ఇదిలా ఉంటే హైదరాబాద్‌కు చెందిన జిలానీ చైనాలో ఎంబీబీఎస్ చదువుకున్నాడు. తరవాత దుబాయ్‌లో ప్రాక్టీస్ చేశాడు. కానీ వైద్యం పై దృష్టి పెట్టకుండా ఉగ్రవాదంవైపు ఆకర్షితుడు అయ్యాడు. రెసిన్ అనే రసాయనం తయారు చేసి భారీ ఉగ్రకుట్రకు ప్లాన్ చేశాడు. కానీ ఇంటిలిజెన్స్ అప్రమత్తం అవ్వడంతో కటకటాల పాలయ్యాడు.

## జి20 సదస్సు... సౌత్ ఆఫ్రికా పర్యటనకు ప్రధాని మోదీ

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 22, 23వ తేదీల్లో దక్షిణాఫ్రికా వేదికగా నిర్వహించనున్న జి20 సదస్సులో పాల్గొననున్నారు. ఇందుకోసం మోదీ ఈ నెల 21–23వ తేదీల్లో ఆ దక్షిణాఫ్రికాలో పర్యటించనున్నారని విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. అదే విధంగా ఇండియా బ్రెజిల్ దక్షిణాఫ్రికా (ఐబిఎస్‌ఎ) నేతల సమావేశంలోనూ ప్రధాని మోదీ పాల్గొననున్నట్లు తెలిపింది. '20వ జి20 దేశాల అధినేతల సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌కు వెళ్లనున్నారు. వరుసగా నాలుగోసారి ఆర్థికంగా వెనుకబడిన ఓ దేశం(దక్షిణాఫ్రికా)లో జరుగుతున్న జి20 శిఖరాగ్ర సమావేశం ఇది. సదస్సులోని మూడు సెషన్లలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తారు. సమగ్ర, స్థిరమైన ఆర్థిక వృద్ధి, వాణిజ్యం, వాతావరణ మార్పులు, ఆహార వ్యవస్థలు, అరుదైన ఖనిజాలు, కృత్రిమ మేధస్సు మొదలైన అంశాలపై ఆయన మాట్లాడతారు. వివిధ దేశాధినేతలతో భేటీ అయ్యి ద్వైపాక్షిక చర్చలు చేపడతారు' అని విదేశాంగశాఖ వెల్లడించింది.

**హాజరుకానన్న ట్రంప్**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ జి20 సదస్సుకు అమెరికా నుంచి ఎవరూ హాజరు కారని ఇటీవల సంచలన ప్రకటన చేసిన విషయం తెలిసిందే. దక్షిణాఫ్రికాలో మైనారిటీలైన శ్వేతజాతి రైతుల పట్ల చూపిస్తున్న వివక్షతపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. దక్షిణాఫ్రికాలో శ్వేతజాతి రైతులపై హింస, భూస్వాధీనం జరుగుతోందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇలాంటి మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నంత వరకు ఏ అమెరికా ప్రభుత్వ అధికారి కూడా జి20కి హాజరు కారని ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. అదే సమయంలో ట్రంప్ 2026 జీ20 సమ్మిట్‌ను అమెరికాలోని మియామిలో నిర్వహిస్తానని కూడా ప్రకటించారు. అంతే కాదు అంతకుముందు మయామిలో చేసిన ఓ ప్రసంగంలో దక్షిణాఫ్రికాను జీ20 గ్రూప్ నుంచి తొలగించాలని కూడా ట్రంప్ డిమాండ్ చేశారు.



## బ్యాడ్మింటన్‌లో సత్తా చాటిన తెలంగాణ మహిళలు

### యోనెక్స్–సన్‌రైజ్ 48వ నేషనల్స్ ముగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అరుణాచల్ ప్రదేశ్ ఇటానగర్ వేదికగా జరిగిన యోనెక్స్–సన్‌రైజ్ 48వ ఇంటర్ స్టేట్, ఇంటర్ జోనల్ జూనియర్ నేషనల్స్ బ్యాడ్మింటన్ టోర్నీ బుధవారం ఘనంగా ముగిసింది. దేశం నలుమూలల నుంచి వచ్చిన బ్యాట్మింటన్ ప్రతిభావంతుల మధ్య జరిగిన ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు మరోసారి తమ సత్తా చాటారు.అండర్–19 విభాగంలో తెలంగాణ బాలికలు అద్భుత ఫారమ్‌లో రాణిస్తూ ప్రత్యర్థులను అదరగొట్టి జాతీయ విజేతలుగా మెరిశారు. ఆఖరి వరకు దూకుడును కొనసాగించిన రాష్ట్ర జూనియర్ బాలికల జట్టు నిర్ణాయక మ్యాచ్‌లో చెలరేగి ఫస్ట్ ప్లేస్‌ను కైవసం చేసుకుంది. అదే విభాగంలో ఢిల్లీ జట్టు రన్నరప్‌గా నిలిచింది. మరోవైపు తెలంగాణ బాలురు కీలక మైన ఢిల్లీ జట్టుతో తడబడి తృతీయ స్థానం దక్కించుకున్నారు. పోటీలంతా మంచి నైపుణ్యం ప్రదర్శించినప్పటికీ సెమీఫైనల్‌లో కొన్ని కీలక పొరపాట్లు వారికి ఖరీదయ్యాయి. ఈ సందర్భంగా తెలంగాణ జట్టును రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి , జాతీయ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ లు అభినందించారు. క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో సాధించిన ఈ విజయాలు తెలంగాణ క్రీడారంగానికి,బ్యాడ్మింటన్‌కు మరింత గౌరవం తీసుకొచ్చాయని ఆయన తెలిపారు.

## తెలంగాణలో మహిళా సాధికారతకు నూతన దిశ

### ప్రజాభవన్‌లో చారిత్రక ఉమెన్ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క సారథ్యంలో మేధావుల సమాలోచన




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో మహిళా సాధికారతకు నూతన దిశ కొనసాగుతున్నదని, మహిళలకు ఉపాధి అవకాశాలు, వివక్ష నిర్మూలన, లింగ సమానత్వం, మహిళల భద్రత, ఆరోగ్యం, పోషకాహారం వంటి కీలక అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క చెప్పారు. ప్రజాభవన్‌లో బుధవారం తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉమెన్ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌ను మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, ఉమెన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్, హైదరాబాద్ కలెక్టర్ హరి చందన, సీనియర్ ఐఎఎస్ అధికారులు సీతాలక్ష్మి, అనిత రామచంద్రన్, జి సృజన, శృతి ఓజా, ఐపిఆర్ కమిషనర్ ప్రియాంకా ఆల, అదనపు డిజి అభిలాష్ బిస్త్‌తో పాటు పలువురు మహిళా ఐపిఎస్‌లు, బాలల హక్కుల కమిషన్ సభ్యులు, నిపుణులు, మేధావులు, సామాజికవేత్తలు పాల్గొన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు, వివక్ష నిర్మూలన, లింగ సమానత్వం, మహిళల భద్రత, ఆరోగ్యం, పోషకాహారం వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. నిపుణుల అభిప్రాయాలు, సూచనలు, అనుభవాలను ప్రభుత్వం తెలుసుకుని భవిష్యత్ విధానాల్లో ప్రతిబింబింపజేయడం సమావేశం ఉద్దేశమని ప్రకటించారు. సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళల అభివృద్ధి, ఆత్మవిశ్వాసం, హక్కుల బలోపేతం కోసం ఈ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళలు ఎదుర్కొంటున్న వివక్షను పూర్తిగా తొలగించేందుకు నిపుణులు, మేధావులు, అధికారులు ఇచ్చే సూచనలు అత్యంత ఉపయోగకరమన్నారు. మహిళా సంక్షేమం, భద్రత కోసం చట్టాలు ఉన్నప్పటికీ, సమాజం పోకడల కారణంగా అవి ఆచరణలో అమలుకావడంలో సమస్యలు వస్తున్నాయని, పనిప్రాంతాల్లో మహిళలు ఎదుర్కొనే సమస్యలను చెప్పుకునే అవకాశాలు కోల్పోతున్నారని వివరించారు. ఈ చర్చ రాజకీయ కార్యక్రమం కాదని, మహిళల భవిష్యత్తును నిర్ణయించే చారిత్రక ఘట్టం అని మంత్రి స్పష్టం చేశారు. విద్య, ఉపాధి, ఉద్యోగాలు, భద్రత వంటి రంగాల్లో మహిళలకు ఏలాంటి సౌకర్యాలు అవసరమో తెలుసుకుని, సమగ్ర నివేదిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో వచ్చిన సూచనలు, సలహాలు ఆధారంగా త్వరలో విస్తృత స్థాయి సదస్సును ఏర్పాటు చేసి, అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 నాటికి ఒక కొత్త మహిళా విధానాన్ని రూపకల్పన చేస్తామని వెల్లడించారు.

## సిఆర్ ఫౌండేషన్‌లో విద్యార్థులకు పోటీలు

### 22న బాలల గ్రంథాలయ ప్రారంభోత్సవం - విజేతలకు బహుమతి ప్రదానం





**హైదరాబాద్:** హైదరాబాద్ కొండాపూర్‌లో ఉన్న చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ప్రాంగణంలో ఈనెల 22వ తేదీన చిల్డ్రన్స్ లైబ్రరీ ప్రారంభోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు బుధవారం వరుసగా అనేక రకాల పోటీలను విజయవంతంగా నిర్వహించారు. వివిధ పాఠశాలలకు ప్రాతినిధ్యం వహించిన 500 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని అనేక కార్యక్రమాల ద్వారా తమ తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఎంతో ఉత్సాహపూరితమైన వాతావరణం మధ్య జరిగిన ఈ పోటీలు మరో మూడు రోజులు కొనసాగుతాయి. మొత్తం 11 రకాల పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటిస్తారు. విజేతలకు బాలల గ్రంథాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందజేస్తారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేసి ప్రోత్సహించడం కోసం సర్టిఫికెట్లు ఇస్తారు. ఎస్ఎస్ఆర్ లైబ్రరీ–ఎన్ఆర్ఆర్ రీసెర్చ్ సెంటర్ కమిటీ సభ్యురాలు డా.బి.వి. విజయలక్ష్మి ఒక ప్రకటనలో ఈ విషయం చెప్పారు. జాతీయ సమగ్రత అనే అంశంపై వక్తృత్వ పోటీలతోపాటు 'పిల్లలపై, సమాజంపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాస రచన పోటీలు, పరుగుపందెం, బాలికలకు స్కిప్పింగ్, దేశభక్తి గీతాలాపన, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, మ్యూజికల్ ఛైర్స్, జూనియర్ విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు ఉన్నాయి. ప్రతి పోటీలోనూ ముగ్గురు విజేతలను ప్రకటిస్తారు. విద్యార్థులు, యువకుల ఆలోచనావిధానాలను సమగ్ర వికాసం,అభివృద్ధిని ప్రోత్సహించేవిధంగా తీర్చిదిద్దేందుకు సి.ఆర్. ఫౌండేషన్ కట్టుబడి ఉందన్న విషయాన్ని ఈ పోటీలు ప్రతిబింబిస్తాయి. కొత్తగా ప్రారంభమయ్యే గ్రంథాలయం ఈ లక్ష్యాలను మరింత బలోపేతం చేస్తుంది. విద్యార్థులలో నవీన ఆలోచనలను, వారిని నవీన ఆవిష్కరణలు చేసేదిశగా స్ఫూర్తి నింపేందుకు తదుపరి ఈ గ్రంథాలయం ఎంతగానో దోహదం చేస్తుందని ఆ ప్రకటనలో తెలియజేశారు. ఎస్ఎస్ఆర్ లైబ్రరీ, ఎన్ఆర్ఆర్ రీసెర్చ్ సెంటర్ కమిటీ సభ్యులు ఈ పోటీలను శ్రద్ధగా పరిశీలిస్తూ ఎంతో జాగ్రత్తగా నిర్వహించారు. సిఆర్.ఫౌడేషన్‌కు చెందిన అంకితభావంగల స్వచ్ఛంధ సేవకులతోపాటు డా.బి.వి.విజయలక్ష్మి తోపాటు కమిటీ సభ్యులు కె.జోత్స్న,రాజగోపాల్‌రెడ్డి ఈ పోటీలను నిర్వహించారు. గౌరవనీయులు సుధా మైనేని, నళిని, వాసు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఉపాధ్యాయులు, పాఠశాలల సిబ్బంది కూడా ఎంతో సమష్టిగా పూర్తి సహకారం అందించారు. వారు అందించిన సహకారంవల్ల విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్ని తమ తమ ప్రావీణ్యాన్ని, నైపుణ్యాలను ప్రదర్శించారు.

## ఉప్పల్ - నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ 2026 దసరా నాటికి పూర్తి

### మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ కు సంబంధించి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు,ప్రయాణికులకు మరో శుభవార్త చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ 2026 దసరా నాటికి పూర్తి చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా బుధవారం ఆర్ అండ్ బి అధికారులకు,నిర్మాణ సంస్థకు మంత్రి ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న గతుకుల రోడ్డు మార్గంలో వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఇటీవల మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించి వెంటనే బిటి రోడ్డు పనులు చేపట్టాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఉప్పల్ వరంగల్ మార్గంలో అధికారులు ఇప్పటికే బి.టి రోడ్డు పనులు మొదలు పెట్టారు. ఉప్పల్ వరంగల్ మార్గంలో ప్రయాణించే వారికి,మేడారం వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా రోడ్డు నిర్మాణం చేస్తున్నామనీ అన్నారు. మొత్తం 5.5 కి.మీ గాను 1.5కి.మీ రోడ్డు నిర్మాణం పూర్తయిందనీ,మేడారం జాతర ప్రారంభం వరకు నాణ్యమైన బి.టి రోడ్డు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి వెల్లడించారు. బిటి రోడ్డు పనులు,ఎలివేటేడ కారిడార్ పనులు పొద్దున,రాత్రి షిఫ్టుల వారిగా శరవేగంగా కొనసాగుతున్నాయనీ ఇచ్చిన మాట ప్రకారం,రాజకీయాలకు అతీతంగా 2026 దసరా నాటికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉప్పల్ నారపల్లి ఎలివేటేడ కారిడార్ ప్రారంభిస్తామని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పునరుద్ఘాటించారు.



## ఇందిరమ్మ ఆశయ సాధన లక్ష్యంగా రాష్ట్రంలో ప్రజా పాలన : ఎమ్మెల్సీ బల్మూర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా గాంధీ భవన్ లో ఇందిరా గాంధీ చిత్ర పటానికి , ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ (తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలు), ఎంఎల్‌సి టిపిసిసి ఉపాధ్యక్షులు డాక్టర్ బల్మూర్ వెంకట్, కాంగ్రెస్ నాయకులు పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఇందిరా గాంధీ ఆశయ సాధన కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రజా పాలనలో పేదల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు.

## వర్కర్ల పేరుపై బ్యాంక్ అకౌంట్లు

### -బయటపడ్డ బడా హోటళ్ల బండారం .. -హైదరాబాద్‌లో రెండో రోజు కొనసాగిన ఐటి సోదాలు -పలు ప్రాంతాల్లో మూతపడ్డ హోటళ్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బడా హోటళ్ల బండారాన్ని ఐటి అధికారులు బద్దలు కొట్టారు. బుధవారం రెండో రోజు హైదరాబాద్‌లో బడా హోటళ్ల యజమానులు, కార్యాలయాలు, హోటళ్లపై ఐటి అధికారులు సోదాలు కొనసాగించారు. పాతబస్తీలో జరిగిన సోదాల సందర్భంగా భారీ బందోబస్తు మధ్య కొనసాగించారు. ఆయా హోటల్ యజమానులు తమ వర్కర్ల పేరుపై బినామీ బ్యాంక్ అకౌంట్లు తెరిచి కోట్లాది రూపాయల లావాదేవీలు, వ్యాపారం నిర్వహించినట్లు ఐటి సోదాల్లో అధికారులకు కీలక డాక్యుమెంట్లు లభించాయి. రెండు రోజుల నుంచి కొనసాగుతున్న ఐటి దాడులతో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పిస్తా హౌస్, మెహిఫిల్, షా హౌస్ హోటళ్లు మూతపడ్డాయి.హైదరాబాద్ లో రెండో రోజు కూడా ఐటీ సోదాలు కొనసాగాయి. పిస్తా హౌస్, మెహ్ఫిల్, షా హౌస్ హోటళ్ల యజమానుల ఇళ్లలో ఐటి అధికారులు సోదాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం నుండి పలువురి ఇళ్లలో సోదాలు నిర్వహించగా ఐటి రిటరన్స్ లో అవకతవకలు జరిగినట్టుగా గుర్తించారు. దీంతో రాజేంద్రనగర్ లోని పిస్తాహౌస్ ఓన్ మహమ్మద్ మజీద్, మహమ్మద్ అబ్దుల్ మోషీ ఇళ్లలో తనిఖీలు కొనసాగించారు. వర్కర్ల నుండి కీలక డాక్యుమెంట్లు, కంప్యూటర్ హార్డ్ డిస్క్ లు సైతం ఐటి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ట్యాక్స్ చెల్లింపుల్లో తేడాలు ఉన్నట్టుగా గుర్తించారు. ఇదిలా ఉంటే ఈ హోటళ్లలో ఏటా వందల కోట్ల వ్యాపారం జరుగుతోంది. హైదరాబాద్ తో పాటు దేశవ్యాప్తంగా పలు నగరాల్లో బ్రాంచీలు ఉండటంతో పాటు విదేశాల్లోనూ ఈ హోటళ్ల బ్రాంచీలు ఉన్నాయి.

## గురుకుల హాస్టల్ నుండి పారిపోయిన విద్యార్థులు

### గంటలో పట్టుకున్న పోలీసులు

### తాండూరు డిఎస్పీ నర్సింగ్ యాదయ్య వెల్లడి



**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు పోలీసు స్టేషన్ పరిధి తెలంగాణ సాంఘీక సంక్షేమ పెద్దేముల్ గురుకుల పాఠశాల, కళాశాల నుండి ఇద్దరు విద్యార్థులు అదృశ్యమైన విషయం తెలిసిందే. గురుకుల పాఠశాల నుండి పారిపోయిన ఇద్దరు విద్యార్థులు మోమిన్‌పేట్‌లో ప్రత్యేక్షమయ్యారు. గురుకుల పాఠశాలకు చెందిన 9వ తరగతి చదవుతున్న విద్యార్థి హర్షవర్ధన్, 8వ తరగతి చదువుతున్న వినయ్‌లు బుధవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి బయటకు వెళ్ళిన సమయంలో గురుకుల పాఠశాల నుండి తప్పించుకోని పారిపోయ్యారు. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును అందుకున్న తాండూరు పోలీసులు గంటల వ్యవదిలోనే విద్యార్థుల ఆచూకిని కొనుగొన్నారు. ఇట్టి విషయాన్ని తాండూరు డిఎస్పీ నర్సింగ్ యాదయ్య ఓ ప్రకటనలో వెల్లడించారు.

## సత్యసాయి సేవలు వెలకట్టలేనివి

### ప్రధాని నరేంద్రమోదీ



**పుట్టపర్తి:** సత్యసాయిబాబా సేవలు వెలకట్టలేనివని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. బుధవారం హిల్ వ్యూ స్టేడియంలో సత్యసాయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రూ.100 విలువైన నాణెం, తపాలా బిళ్లను ప్రధానితో పాటు సీఎం చంద్రబాబు నాయుడు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ శ్రీసత్యసాయిబాబా అనుసరించిన సేవా తత్వం ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మందిని ప్రభావితం చేస్తోందన్నారు. భారతీయుల జీవన విధానమైన సేవ, భక్తి, జ్ఞానాన్ని బాబా బోధించారన్నారు. బాబా మన మధ్య భౌతికంగా లేనప్పటికీ ఆయన స్థాపించిన సంస్థలు గ్రామీణాభివద్ధి, ప్రజలకు వైద్యం, మంచినీటి సరఫరా వంటి సేవల్ని అందిస్తున్నాయన్నారు. కోట్ల మంది బాబా భక్తులు దేశవ్యాప్తంగా మానవ సేవే మాధవ సేవ అని భావించి సేవలు అందిస్తున్నారన్నారు.సమాజం, ప్రజలను నిరంతరం ఆదుకోవటానికి సత్యసాయి నిరంతరం తపించారని కొనియాడారు. .దేశవ్యాప్తంగా ఎక్కడ ప్రకతి వైపరీత్యం వచ్చినా శ్రీసత్యసాయి సేవా దళ్ సభ్యులు ప్రజలకు సేవలందిస్తున్నారని, గుజరాత్‌లో భుజ్ భూకంపం సమయంలో సేవాదళ్ చేసిన సేవలు తనకు బాగా గుర్తున్నాయన్నారు. తాగునీరు, వైద్యం, విద్య, విపత్తు నిర్వహణ,3 వేలకు కిలోమీటర్లకు పైగా తాగునీటి పైపుల్ని వేయించి ప్రజలకు దాహార్తి తీర్చారన్నారు. ఉచిత వైద్యం అందిస్తున్న ఘనత బాబా కే దక్కిందన్నారు. సుకన్య సమద్ధి యోజన కోసం వేల మంది బాలికలకు సత్య సాయి ట్రస్ట్ ఆర్థికసాయం అందిస్తోందన్నారు. వంద గిర్ జాతి గోవులను శ్రీసత్యసాయి ట్రస్టు తరపున పేదవారికి నా చేతుల మీదుగా అందించే అదృష్టం కలిగినందుకు సంతోషిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి రామ్మోహన్, కిషన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, మంత్రి సునీత, సత్య సాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, ఎమ్మెల్యే సింధూర రెడ్డి, భారతరత్న సచిన్ టెండూల్కర్, వైస్ ఛాన్సలర్ చక్రవర్తి, అంతర్జాతీయ సేవా సంస్థల అధ్యక్షుడు నిమిష్ పాండే, ఐశ్వర్యారాయ్ బచ్చన్ పాల్గొన్నారు.

**బాబా అడుగుజాడల్లో నడుద్దాం: చంద్రబాబు**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రేమ, సేవ, ప్రశాంతతకు బాబా ప్రతిరూపమనికొనియాడారు. ఈ భూమిపై మనకు తెలిసిన, మనం చూసిన దైవ స్వరూపం సత్యసాయి బాబా అన్నారు. విశ్వ శాంతి, విశ్వ సౌభాగ్యం, సకల జనుల సంతోషం అనే భావనతో ఆయన జీవించారని తెలిపారు. ఆయన నడిచిన ఈ పుణ్యభూమిలో శతజయంతి వేడుకలు జరుపుకోవడం సంతోషకరం అన్నారు. ఆయన చూపిన మార్గాన్ని భవిష్యత్ తరాలకు అందించాలన్నారు.

## హత్యాకాండను ఆపాలి

### ఎంతమంది మావోయిస్టులను అరెస్టు చేశారో ప్రకటించాలి

### వామపక్షపార్టీల నేతల డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్ల హత్యాకాండను ఆపాలని, అరెస్టు చేసిన మావోయిస్టులందరినీ బహిరంగంగా ప్రకటించాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆదివారం రాత్రి కూనంనేని సాంబశివరావు (సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే), జాన్ వెస్లీ (సిపి(ఐ)ఎం రాష్ట్ర కార్యదర్శి), పోటు రంగారావు (సిపిఐ (ఎంఎల్) మాస్లైన్ రాష్ట్ర కార్యదర్శి), సిహెచ్ మురహరి (ఎస్‌యుసిఐ(సి) రాష్ట్ర కార్యదర్శి), గాదగోని రవి (ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి), జానకి రాములు( రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి), పి సూర్యం (సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్రకార్యదర్శి), మామిండ్ల రమేష్ రాజా (సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి), ప్రసాదన్న (సిపిఐ (ఎం.ఎల్) రాష్ట్ర కార్యదర్శి) సంయుక్త ప్రకటను విడుదల చేశారు. అటవి ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడానికి ఆదివాసీలను నిర్వాసితులను చేసే విధానాలను రద్దు చేయాలని వామపక్ష నాయకులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. 2024 సంవత్సరం ప్రారంభం నుండి కగార్ పేరుతో మావోయిస్టు పార్టీ నాయకులను, కార్యకర్తలనను, ఆదివాసీలను సైతం కేంద్రంలోని ఫాసిస్ట్ ఆర్‌ఎస్‌ఎస్–బిజెపిల నాయకత్వంలో మోదీ ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్ల పేరిట హత్యాకాండను కొనసాగిస్తున్నదని విమర్శించారు. గత కొద్ది రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ప్రాంతంలో అరెస్టు చేసిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులతో సహా కొంతమందిని పట్టుకొని, రోజుకో బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపుతున్నారని మండిపడ్డారు. ఈనెల 18న ఉదయం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడైన హిడ్మాతో సహా, ఆరుగురిని తూర్పుగోదావరి జిల్లా మారేడుమిల్లి అడివిలో, 19న ఉదయం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతితో సహా ఏడుగురుని రంపచోడవరంలో కాల్చి చంపారని, ఈ విధంగా పట్టుకున్న వారందరిని అరెస్టు ప్రకటించకుండా, ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చి చంపడం రాజ్యాంగాన్ని, చట్టాలను అవహేళన చేయడమే అని, ప్రజల రాజ్యాంగ, చట్టబద్ధ హక్కులను కాలరాయడమే అని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం సాగిస్తున్న ఫాసిస్టు దమనకాండలో భాగమే ఈ బూటకపు ఎన్‌కౌంటర్లు అని విమర్శించారు. కగార్ పేరిట సాగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్ల హత్యాకాండను తీవ్రంగా వారు ఖండించారు. వెంటనే నిలిపి వేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీలను నిర్వాసితులను చేసే విధానాలను రద్దు చేయాలన్నారు.

## వ్యవసాయం, విద్యుత్తు, డిఫెన్స్, సహకార బ్యాంకు రంగాల్లో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం

### జిటిటిసిఐ, విటిబి రష్యా బృందంతో డిప్యూటీ సిఎం భట్టి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత్, రష్యా దేశాల మధ్య దశాబ్దాలుగా స్నేహబంధం కొనసాగుతుందని, తెలంగాణ రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు రష్యా బృందం ఆసక్తి చూపడాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానిస్తుందని, ఆసక్తిని కనబరుస్తుందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాభవన్‌లో బుధవారం సాయంత్రం గ్లోబల్ ట్రేడ్, టెక్నాలజీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (జిటిటిసిఐ), విటిబి రష్యన్ బ్యాంక్ ప్రతినిధులతో డిప్యూటీ సిఎం చర్చించారు. వ్యవసాయం, విద్యుత్తు, టెక్నాలజీ రంగాలలో దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని డిప్యూటీ సిఎం రష్యా ప్రతినిధి బృందానికి సూచించారు. తెలంగాణ 2047 విజన్ డాక్యుమెంట్, మూడు ట్రిలియం డాలర్ల ఎకానమీ లక్ష్యసాధన, రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం, మూసి పునర్జీవనం వంటి ప్రణాళికలను రష్యా బృందానికి డిప్యూటీ సిఎం వివరించారు.ప్రభుత్వ శాఖల అధికారులతో చర్చించి మెరుగైన ఒప్పందాలు జరిగేలా ముందుకు వెళ్లాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని వివరించారు. ఫార్మా, ఐటీ రంగాలకు హబ్ గా తెలంగాణ రాష్ట్రం నిలిచిన విషయాన్ని లెక్కలతో డిప్యూటీ సిఎం వివరించారు. మైనింగ్ రంగంలోనూ తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని 100 సంవత్సరాల పైబడిన చరిత్ర కలిగిన ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి, 45 వేల మంది ఉద్యోగులతో కొనసాగుతున్న విషయాన్ని వివరించారు. సింగరేణి సంస్థ విస్తరణ లో భాగంగా క్రిటికల్ మినరల్ మైనింగ్ దిశగా ముందుకు వెళుతున్న విషయాన్ని తెలిపారు. డిఫెన్స్ రంగంలోనూ హైదరాబాద్ దేశంలోనే ముందంజలో ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు స్వర్గధామం లాంటిది ఇక్కడ మంచి వాతావరణం, పరిశ్రమలు నెలకొల్పడానికి అవసరమైన భూమి, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, పెద్ద సంఖ్యలో ఇంజనీరింగ్ కళాశాలలు, మంచి నైపుణ్యం ఉన్న తక్కువ ధరకు లభించే మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని డిప్యూటీ సిఎం రష్యా బృందానికి తెలిపారు. 1940 నుంచి ప్రభుత్వ రంగ సంస్థలకు హైదరాబాద్ కేంద్రంగా కొనసాగుతుందని, వ్యూహాత్మకంగా హైదరాబాద్ సురక్షిత ప్రాంతమని తెలిపారు. దృఢమైన సహకార బ్యాంకు వ్యవస్థలో టెక్నాలజీ, పెట్టుబడులకు సాదరంగా ఆహ్వానిస్తున్నామని డిప్యూటీ సిఎం తెలిపారు. సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, ప్రతినిధి బృందంలో వోల్గా భాష, రష్మీ సలూజ, సంజయ్ కౌశిక్, మోనికా బానోత్ తదితరులు పాల్గొన్నారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## అవయవ దానంపై జాతీయ విధానం రూపొందించండి..: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** అవయవ దానం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాష్ట్రాలతో కలిసి జాతీయ విధానం, ఏకీకృత నియమావళిని రూపొందించాలని బుధవారం కేంద్రాన్ని సుప్రీంకోర్టు కోరింది. చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఇండియన్ సొసైటీ ఆఫ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ దాఖలు చేసిన పిల్‌పై ధర్మాసనం ఈ అభిప్రాయం వ్యక్తం చేసింది. అవయవ దానంకు చెందిన 1994 నాటి చట్టానికి సవరణలు జరిగాయని, 2011 చట్టాన్ని అమలు చేసే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరింది. కర్నాటక, తమిళనాడు, మణిపూర్ రాష్ట్రాలు కూడా కొత్త చట్టాన్ని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోర్టు సూచించింది. అవయవ దానాలకు చెందిన జాతీయ విధానాన్ని అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం ధర్మాసనం కోరింది. అవయవ దానం చేసిన వారికి న్యాయం దక్కే విధంగా చర్యలు ఉండాలని కోర్టు తెలిపింది. దాతల సంక్షేమం ముఖ్యమని పేర్కొన్నది.

## రక్తపాతం ముగిసిపోలే

### జమ్ముకశ్మీర్ భద్రతకు బాధ్యత వహించే వారిని జవాబుదారీ చేయాలి: సిఎం ఒమర్ అబ్దుల్లా



**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్ ప్రత్యేక హోదాను రద్దు చేయడం వల్ల కేంద్రపాలిత ప్రాంతంలో రక్తపాతం ముగియలేదని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నా రు. భద్రతకు బాధ్యత వహించే వారిని జవాబుదారీగా చేయాలన్నారు. 'ఈ హిం సాత్మక చక్రం ఆగిపోవాలని మేము కోరుకుంటున్నాము. జమ్ముకశ్మీర్, ముఖ్య ంగా కశ్మీర్, గత 30–35 సంవత్సరాలలో చాలా రక్తపాతాన్ని చూసింది. ఇది ఇ ప్పుడు జరగదని, 2019 తర్వాత ఈ చక్రం ముగిసిపోతుందని మాకు చెప్పారు. కానీ, అలా జరగలేదు' అని అబ్దుల్లా దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో బుధవా రం విలేకరులతో అన్నారు. 'ఇది (హింస) ఎందుకు ముగియలేదో మీరు మా భ ద్రతకు బాధ్యత వహించే వారిని అడగాలి. ఆ బాధ్యత మా చేతుల్లో లేదు' అని ఆయన అన్నారు. భద్రతా సమస్యలను ఎత్తిచూపుతూ, ఎక్కడో ఒకచోట హింసాత్మక ఘటన జరుగుతోందని అబ్దుల్లా అన్నారు. ఢిల్లీలో బాంబు పేలకపోతే, అది ఇక్కడే పేలుతుందని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో ఇటీవల జరిగిన కారు పే లుడు, శుక్రవారం నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన ప్రమాదవశాత్తు జరిగిన పే లుడును ప్రస్తావిస్తూ ఆయన అన్నారు. ఇటువంటి ఘటనలలో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని విచారం వ్యక్తం చేశారు. మంగళవారం సంతాప సభ కోసం ఐదు ప్రదేశాలకు వెళ్లానని, బుధవారం మరో రెండు ప్రదేశాలను సందర్శించానని ముఖ్యమంత్రి చెప్పారు. శుక్రవారం నౌగామ్ పేలుడులో ప్రాణాలు కోల్పోయిన ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ బృందంలోని సభ్యులు హెచ్‌ఎంటి జైనాకోట్‌లో ఐజాజ్ అష్ఫల్ మీర్, బెమినాలో మహ్మద్ అమీన్ మీర్, కమర్వారీలో షోకత్ అహ్మద్ భట్ కుటుంబాలను అబ్దుల్లా పరామర్శించారు. వీరందరూ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ బృందం సభ్యులు్య శాఖ చౌకీదార్) సుహైల్ అహ్మద్ రాథర్, వనబాల్‌లో (దర్జీ) మొహమ్మద్ షఫీ పరాయ్ కుటుంబాలను కూడా ఆయన పరామర్శించారు.

## భరించలేని ఒత్తిడితోనే బిఎల్‌ఒలు మృతి

### 'సర్'ను వెంటనే నిలిపివేయాలి : సిఎం మమత



**కోల్‌కతా:** ఎన్నికల కమిషన్ 12 రాష్ట్రాలు, యుటిల్లో ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)ను చేపట్టిన విషయం తెలిసిందే. అయితే పని ఒత్తిడికి గురై బూత్ స్థా యి అధికారులతో (బిఎల్‌ఒ) పాటు ఓటరు జాబితాలో పేర్లు గల్లంతకావడంతో కలత చెందిన పలువురు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. గత రెండు రోజుల క్రితం కేరళలో ఓ బిఎల్‌ఓ ఆత్మహత్య చేసుకోగా, బెంగాల్‌లో 28 మంది మృతి చెందారు. ఈ నేపథ్యంలో జల్‌పైరిలోని మా ల్ బ్లాక్‌లో బూత్ లెవల్ ఆఫీసర్ మరణంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ది గ్భ్రాంతి వ్యక్తం చేశారు. సర్ క్షేత్రస్థాయి కార్యకర్తలపై 'అమానవీయ' ఒత్తిడిని పెంచిందని ఆరోపించారు. సర్ ప్రక్రియను భరించలేని ఒత్తిడి కారణంగా మరణించిన బిఎల్ఒగా పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్య చేసుకున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బెనర్జీ 2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందు సర్‌ను చేపట్టడం 'ప్రణాళిక లేని, అవిశ్రాంతమైన పనిభారం'గా అభివర్ణించారు. ఈచర్యపై ఎన్నికల సంఘాన్ని విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆమె ఎక్స్‌లో పోస్టు చేశారు. కొందరు భయం, అనిశ్చితి కారణంగా, మరికొందరు ఒత్తిడి, ఓవర్ లోడ్ కారణంగా మృత్యువాత పడుతున్నారన్నారు.గతంలో మూడు సంవత్సరాలు చేపట్టిన ప్రక్రియను ఇప్పుడు రాజకీయ యజమానులను సంతోషపెట్టడానికి ఎన్నికల ముందు రెండు నెలలుగా బలవంతంగా సర్‌ను చేస్తున్నారని, దీంతో బిఎల్‌ఒలపై అమానవీయ ఒత్తిడిని పెంచుతున్నారని మండిపడ్డారు. ఈ ప్రక్రియ ఇలాగే కొనసాగితే మరికొన్ని ప్రాణాలు పోవచ్చని హెచ్చరిస్తూ, ఎన్నికల కమిషన్ మనస్సాక్షితో వ్యవహరించి డ్రైవ్‌ను నిలిపివేయాలని కోరారు.

**సర్‌తో కలత చెంది వ్యక్తి ఆత్మహత్య ...** పశ్చిమ బెంగాల్‌లోని నార్త్ 24 పరగణాస్ జిల్లాలో 58 ఏళ్ల వ్యక్తి పురుగుమందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఓటర్ల జాబితాకు సంబంధించిన సమస్యలపై అతని తీవ్రంగా కలత చెందిటన్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బదురియా పోలీస్ స్టేషన్ పరిధిలోని జాదుర్హతి పుర్బా నివాసి సోఫికుల్ మండల్ సర్ ప్రారంభమైన తర్వాత 2002 ఓటర్ల జాబితాను తనిఖీ చేసినట్లు వారు తెలిపారు. ఓటర్ల జాబితాలో మోండల్ పేరు కనిపించినప్పటికీ, అనేక మంది కుటుంబ సభ్యుల పేర్లు తప్పిపోయాయి. దీంతో స్థానభ్రంశం చెందే అవకాశం ఉందనే భయం ఏర్పడిందని బసిర్హాట్ పోలీస్ జిల్లాకు చెందిన సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. మంగళవారం మోండల్ పురుగు మందు సేవించి మరణించాడని ఆరోపించారు. అతను అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించిన తర్వాత కుటుంబ సభ్యులు అతన్ని స్థానిక ఆసుపత్రికి తరలించారని ఆయన చెప్పారు. ఆ తరువాత కోల్‌కతాలోని కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు తరలించగా, అక్కడ ఆయన మరణించినట్లు ప్రకటించారు. అయితే ఇటీవల కూడా నార్త్ 24 పరగణాలు, ముర్షిదాబాద్, బిర్భూమ్, నాడియాతో సహా అనేక జిల్లాల నుండి సర్ ప్రక్రియపై ఆందోళనతో సంబంధం ఉన్న మరణాలు జరిగినట్లు వార్తలు వచ్చాయి.

## విదేశీ చదువు ఎంపికలో...

# 97శాతం భారతీయ విద్యార్థులే

### కెరీర్‌కు దోహదపడే విద్య వైపే ఆసక్తి 'ఆర్లింగ్టన్ రీసెర్చ్' వెల్లడి అంతర్జాతీయ ఉన్నత విద్యనుంచి శక్తివంతమైన మార్పును ఆశిస్తున్నారని నివేదిక స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** భారతీయ విద్యార్థులు విదేశాలలో చదువుకునే సమయంలో వివేకవంతమైన, సృజనాత్మక, ముందుచూపు నిర్ణయాలను తీసుకుంటూ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నారు. లండన్‌కు చెందిన ఓ విశ్వవిద్యాలయం చేసిన ఒక కొత్త అధ్యయనం ప్రకారం...97శాతం మంది భారతీయ విద్యార్థులు నేరుగా కెరీర్‌కు దారితీసే విద్యను కోరుకుంటున్నారని, విదేశాలలో ఎక్కడ చ దువుకోవాలనేది ఎంచుకునేటప్పుడు ఉపాధి, పని అనుభవం, వాస్తవ ప్రపంచ నైపుణ్యాలు అ వసరమని నమ్ముతున్నారని వెల్లడించింది. సిటీ సెయింట్ జార్జి యూనివర్సిటీ ఆఫ్ లండన్ నియమించిన ఆర్లింగ్టన్ రీసెర్చ్ నిర్వహించిన పరిశోధనలో భారతీయ కాబోయే విద్యార్థులకు ఉన్నత విద్య విలువ లెక్చరర్లు, పాఠ్య పుస్తకాలకు మించి ఉంటుందని అధ్యయనం తేల్చింది. 'విదేశాలలో చదుకోవడం యొక్క విలువ' అనే కొత్త నివేదిక ప్రకారం 97 శాతం మంది భారతీయ విద్యార్థులు విదేశాలలో ఎక్కడ చదువుకోవాలో ఎంచుకునేటప్పుడు ఉపాధి పని అనుభవం, వాస్తవ ప్రపంచ నైపుణ్యాలు అవసరమని అంటున్నారు. 'అంతర్జాతీయ ఉన్నత విద్య నుండి భారతీయ విద్యార్థులు ఇప్పుడు పొందుతున్న దానిలో శక్తివంతమైన మార్పు ఉంది. ఇది తరగతి అభ్యాసానికి మించి చాలా ఎక్కువగా ఉంటుంది. సర్వే చేయబడిన అన్ని కోర్సులలో అనువర్తిత అభ్యాసం, సాంకేతిక నైపుణ్యాలు, వృత్తిపరమైన ప్రవర్తనను వారి విద్యా అనుభవంలో ప్రధాన భాగాలకు విలువ ఇచ్చే అవకాశం భారతీయ అభ్యాసకులే ఎక్కువగా ఉన్నారు' అని నివేదిక తెలిపింది. యూనివర్సిటీ ఆఫ్ లండన్‌లోని ఎంప్లాయబిలిటీ సిటీ సెయింట్ జార్జి డైరెక్టర్ గెమ్మ కెన్యన్ ప్రకారం భారతీయ విద్యార్థులకు ఏ తరహా విద్య అందించాలి అంటే కేవలం జ్ఞానం మాత్రమే కాదు, నైపుణ్యాలు, విశ్వాసం, నెట్‌వర్క్‌లు నిజమైన కెరీర్ విజయానికి దారితీసే అంశాలపై నిశిత దృష్టిని సారిస్తున్నారని పేర్కొన్నారు. విద్యా నైపుణ్యాన్ని ఆచరణాత్మక అనుభవంతో కలిపే కార్యక్రమాలను రూపొందించడం విశ్వవిద్యాలయాలకు ఎంత ము ఖ్యమో ఈ పరిశోధన హైలెట్ చేస్తుంది' అని కెన్యన్ అన్నా రు. ప్రపంచ వ్యాప్తంగా 56 శాతం మంది విద్యార్థులు ఉపాధి సామర్థ్యాన్ని వారి ఉన్నతస్థా యి మూడు నిర్ణయం తీసుకు నే అంశాలను ర్యాంక్ చేశారు. అగ్రనిర్ణయ కారకాలను పరిశీలించినప్పుడు ఇది 87శాతానికి పెరిగింది. భారతీయ ప్రతివాదులలో ఈ డిజైన్ అభ్యాసాన్ని ఉపాధి ఫలితాలతో నేరుగా అనుసంధానించాలనే బలమైన నమ్మకాన్ని కలిగి ఉన్నారు. 3,000మంది ప్రతివాదులతో నిర్వహించిన ప్రపంచ సర్వే ప్రకారం, విద్యార్థులు సహా తల్లిదండ్రులలో అన్ని సర్వేలలో భారతీయ విద్యార్థులే ఎక్కువగా ఉన్నారు. వారు అంతా అనువర్తిత అభ్యాసం, ఉద్యోగ సంసిద్ధతను నొక్కిచెబుతున్నారు. 60శాతం మంది ప్రతివాదులు అభ్యాసంలో సాంకేతికతను వర్తింపజేయడం అవసరమని చెప్పారు. కాగా 56శాతం మంది సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోడానికి ప్రా ధాన్యతను ఇచ్చారు. అలాగే దాదాపు 56 శాతం మంది భారతీయ విద్యార్థులు వృత్తిపరమైన ప్రవర్తనలను నిర్మించడమే ముఖ్యమని రేట్ చేశా రుచేశారు.

# జవాద్‌కు 13రోజుల ఇడి కస్టడీ

### విద్యార్థుల నుంచి రూ.415.10 కోట్లు వసూలు చేసిన అల్ ఫలాహ గ్రూప్ చైర్మన్



**న్యూఢిల్లీ:** ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనపై ముమ్మర దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అరెస్ట్ చేసిన హర్యానాలోని అల్ ఫలాహ యూనివర్శిటీ చైర్మన్ జవాద్ అహ్మద్ సిద్ధిఖీ ని ఢిల్లీ న్యాయస్థానం 13 రోజుల ఇడి కస్టడీకి అప్పగించింది. ఇక యూనివర్సిటీపై ఇడి నిర్వహించిన సోదాల్లో విద్యార్థుల నుంచి రూ .415 10 కోట్లు వసూలు చేసినట్లు తేలింది. ఢిల్లీ పేలుడు నిందితులకు ఉన్న సంబంధాల నేపథ్య ంలో విశ్వవిద్యాలయం ఆర్థిక వ్యవహారాలపై మ ంగళవారం ఇడి అధికారులు సోదాలు నిర్వహించారు. ఉదయం 5.15 గంటలకు మొదలైన దాడులు, వర్సిటీకి చెందిన ప్రధాన కార్యాలయంతో పాటు సంస్థ ట్రస్టీలు, ప్రమోటర్ల ప్రాంగణాల్లో రోజంతా కొనసాగాయి. జవాద్ అహ్మద్ సిద్ధిఖీ ఇంట్లో కూడా అధికారులు సోదాలు నిర్వహించారు. ఆయనను ప్రశ్నించారు. అనంతరం నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం కింద అరెస్టు చేశారు. అనంతరం ఢిల్లీలోని న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. యూనివర్శిటిలో తీవ్రమైన ఆర్థిక అక్రమాలు జరిగాయని కస్టడీకి ఇవ్వాలని న్యాయమూర్తిని కోరారు. తప్పుడు అక్రిడిటేషన్, తప్పుడు గుర్తింపులు చూపించి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి అల్ ఫలాహ విశ్వవిద్యాలయం, దాని పరిపాలన ట్రస్ట్ రూ.415.10 కోట్ల ఆర్జించినట్లు రిమాండ్ రిపోర్టులో ఇడి ఆరోపించింది. రూ.48 లక్షలకు పైగా నగదు, డిజిటల్ పరికరాలు, డాక్యుమెంటరీ ఆధారాలు లభ్యమైనట్లు ఇడి అధికారులు తెలిపింది. 2014–15 నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరాల వరకు ఉన్న విశ్వవిద్యాలయ ఆదాయ పన్ను రిటర్న్‌లలో ఫీజుల రూపంలో వచ్చిన ఆదాయాన్ని స్వచ్ఛంద విరాళంగా చూపిస్తున్నట్లు గుర్తించింది. అల్ ఫలాహ విశ్వవిద్యాలయంపై సిద్ధిఖీ పూర్తి నియంత్రణను కలిగి ఉన్నారని వర్సిటీ ఆదాయంలో కొంత భాగాన్ని మాత్రమే తాము గుర్తించామని కోర్టుకు తెలిపింది. కస్టడీకి తీసుకుని విచారణ జరిపితేనే పూర్తి వివరాలు తెలుస్తాయని వివరించింది. ఇడి అభ్యర్థనను అంగీకరించిన కోర్టు 13 రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చింది. ఇటీవల ఫరీదాబాద్‌లో ఉగ్ర మాడ్యూల్‌ను అధికారులు చేధించారు. మాడ్యూల్‌లోని వ్యక్తులకు ఈ యూనివర్సిటీతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. దీంతో యూనివర్శిటీ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. మాడ్యూల్‌తో సంబంధాలు బయటపడిన తర్వాత ఇండియన్ యూనివర్సిటీల సంఘం (ఎఐయు) అల్‌ఫలాహ విశ్వవిద్యాలయం సభ్యత్వాన్ని రద్దు చేసింది. ఈక్రమంలో ఢిల్లీ పోలీసులు యూనివర్సిటీలపై రెండు వేర్వేరు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. ఫోర్జరీ, మోసం పేరిట కేసు నమోదయ్యాయి. మరోవైపు విశ్వవిద్యాలయానికి న్యాక్ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. విద్యాసంస్థ వెబ్‌సైట్‌లో గుర్తింపు గురించి తప్పుడు సమాచారం ప్రచురించినందుకు గానూ ఇవి జారీ చేసినట్లు తెలిపింది. సోమవారం విశ్వవిద్యాలయం చైర్మన్ జావెద్‌కు రెండు సమన్లు జారీ చేశారు.

## గ్యాంగ్‌స్టర్ అన్మోల్ బిష్ణోయ్‌ను భారత్‌కు తీసుకొచ్చిన ఎన్ఐఎ



**న్యూఢిల్లీ:** ఎన్‌సిపి నేత బాబా సిద్ధిఖీ హత్య కేసులో కీలక నిందితుడైన అన్మోల్ బిష్ణోయ్‌ను అమెరికా డిపోర్ట్ చేయగా, అతనిని ఎన్ఐఎ అధికారులు భారత్‌కు తీసుకొచ్చారు. అతనితోపాటు మ రో 199 మందిని కూడా అమెరికా డిపోర్ట్ చేసింది. వారిలో ఇద్దరు పంజాబ్ మోస్ట్ వాంటెడ్ జా బితా ఉండగా, మరో 197 మంది అమెరికాలో అ క్రమంగా నివసిస్తున్నవారు కావడం గమనార్హం. బుధవారం మధ్యాహ్నం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో వీరిని తీసుకొచ్చిన విమానం ల్యాండ్ అయ్యిందని అధికారులు తెలిపారు. అమెరికా నుంచి తీసుకొచ్చిన గ్యాంగ్‌స్టర్ అన్మోల్ బిష్ణోయ్‌ను ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టులో హాజరుపరుస్తారని సమాచారం. వాస్తవానికి గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ తమ్ముడే ఈ అన్మోల్ బిష్ణోయ్. గతేడాది ఏప్రిల్ నెలలో బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఇంటివద్ద కాల్పులకు బాధ్యత వహిస్తూ స్వయంగా ఇతనే సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం గమనార్హం. దీనితో ముంబయి పోలీసులు ఇతనిపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. అన్మోల్ బి ష్ణోయ్ చాలా కేసుల్లో కీలక నిందితుడిగా ఉ న్నాడు. 2022లో ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య కేసులో కూడా ఇతను అభియోగాలు ఎదుర్కొంటున్నాడు. అయితే మూ సేవాలా హత్యకు కొన్ని రోజుల ముందు అన్మోల్ నకిలీ పత్రాలు ఉపయోగించి దేశం దాటి వెళ్లాడని నిఘా వర్గాలు గుర్తించాయి. అతనిపై వివిధ ప్రాంతాల్లో దాదాపు 20 వరకు కేసులు నమోదు అయ్యాయి. అతని గురించి సమాచారం ఇచ్చిన వారికి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రూ. 10 లక్షల రివార్డు కూడా ప్రకటించడం గమనార్హం. అన్మోల్ బిష్ణోయ్ విదేశాల్లోనూ క్రిమినల్ కార్యకలాపాలు నిర్వహించేవాడు. అక్కడ నుంచే ఆజ్ఞలు ఇస్తూ, తన అనుచరులతో భారత్‌లో పలు క్రైమ్స్ చేయించినట్లు పోలీసులు గుర్తించారు. అందుకే అతడిని భారత్‌కు రప్పించేందుకు ముం బయి పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలోనే గతేడాది అన్మోల్ అమెరికా పోలీసులకు చిక్కాడు. దీనితో అతనిని అప్పగించాలని ఎన్ఐఏ అధికారులు అమెరికాలోని ఎఫ్‌బిఐ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ సెక్యూరిటీలతో సంప్రదింపులు జరిపారు. దీనితో అమెరికా అన్మోల్ బిష్ణోయ్‌ను డిపోర్ట్ చేసింది.

## పిసిసి అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాల్సి రావచ్చు : డికె



**బెంగళూరు:** రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాల్సి రావచ్చని క ర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ సంకేతాలిచ్చారు. అయితే తాను ఎప్పుడూ ముందు వరుసలోనే ఉంటానని పార్టీ కార్యకర్తలకు హామీ ఇచ్చా రు. మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా జరిగిన పార్టీ కార్యక్రమంలో శివకుమార్ మాట్లాడుతూ 'నేను ఉన్నానా లేదా అనేది ము ఖ్యం కాదు. కానీ నా పదవీకాలంలో 100 పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేయాలనుకుంటున్నాను' అని అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్‌గా తన అనిశ్చిత పదవీకాలంపై కొంతమంది పార్టీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేయడంపై స్పందిస్తూ తాను ఆ పదవిని శాశ్వతంగా నిర్వహించలేనని, ఇప్పటికే 5.5 సంవత్సరాలు గడిచాయని, మార్చి ఆటికి ఆరు సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఇతరులకు అవకాశం ఇవ్వాలని, అయితే నాయకత్వంలో ముందు వరుసలోనే ఉంటానని చెప్పారు. 2020 మేలో కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కెపిసిసి) అధ్యక్షుడిగా శివకుమార్ నియమితులయ్యారు. 2023 మేలో ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని అనుకున్నానని, కానీ ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ మరికొంత కాలం కొనసాగాలని కోరారన్నారు. కాగా, కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ కోసం ఆశతో పనిచేయడం కొనసాగించాలని శివకుమార్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెలలో తన ఐదేళ్ల పదవీకాలం సగం దాటుతున్నందున ముఖ్యమంత్రి పదవిలో మార్పు గురించి ఊహాగానాల మధ్య శివకుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కాలాన్ని కొందరు 'నవంబర్ విప్లవం' అని పిలుస్తారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య అధికార పంపిణీ ఒప్పందం గురించి కొన్ని రోజుల నుంచి పుకార్లు వినిపిస్తూనే ఉన్నాయి. తాను బాధ్యత నుండి తప్పించుకోవడం లేదని, పార్టీ అధ్యక్షుడిగా ఒక ఉదాహరణగా నిలిచేందుకు ప్రయత్నిస్తున్నానన్నారు. 'ఇక్కడ ఎవరూ శాశ్వతంగా ఉండలేరు. వారి పదవీకాలంలో ఓ ముద్ర వేసుకోవాలి. నేను కొనసాగాలని చెప్పే వరకు పార్టీ అధ్యక్షుడిగా పని చేస్తాను. ఒక అధ్యక్షుడు ఎలా పని చేయాలో, క్రమశిక్షణను ఎలా పాటించాలో ఒక ఉదాహరణగా చూపించడానికి ప్రయత్నిస్తున్నాను' అని ఆయన అన్నారు.

## ఢిల్లీలో పేలుడు భద్రతా తప్పిదం

### పార్లమెంటుకు ప్రధానమంత్రి జవాబివ్వాలి కాంగ్రెస్‌నేత సల్మాన్ ఖుర్షీద్ డిమాండ్



**న్యూఢిల్లీ:** ఢిల్లీలో పేలుడు ఘటన తప్పిదంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ పార్లమెంటుకు త్వరలో సమాధానం చెప్పాలని కాంగ్రెస్‌పార్టీ నాయకుడు,విదేశీ వ్యవహారాల మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ డిమాండ్ చేశారు. ఈ పేలుడు ఘటన కేంద్ర ప్రభుత్వ భద్రతా విధానంపై తీవ్రమైన ప్రశ్నార్థకంగా మారిందని పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఈ పేలుడు ఘటన కేంద్ర ప్రభుత్వ భద్రతా తప్పిదమని విమర్శించారు. మోదీ ప్రభుత్వం ఆందోళన చెందుతున్నకొద్దీ ఇప్పుడు వ్యూహాత్మకమైన తప్పిదాలు ఇంకా ఇంకా పెరుగుతున్నాయని విమర్శించారు. వ్యక్తిగతీకరించిన, అప్పుడప్పుడు, అక్కడక్కడ జరుగుతున్న ఒకే విధమైన విషయాలను గుండుగుత్తగా ఏకరువు పెడుతూ ప్రస్తుతం కొనసాగిస్తున్న ఆరోపణల విధాన తతంగానికి బదులుగా విదేశీ విధానంపై అధ్యయనం చేయాలని ఆయన పిలుపు ఇచ్చారు. ''మనం విదేశీ విధానాన్ని అధ్యయనం చేయాలి, విదేశీ విధానాన్ని అధ్యయనం చేయడం లేదని నేను అనుకోవడంలేదు, మనకు అస్వాభావికమైన విదేశాంగ విధానం ఉంది, వ్యక్తిగతీకరించిన విదేశీ విధానం ఉంది, అడపాదడపా చేసే విదేశీ విధానం, ఒకే విధమైన ఘటనలు అప్పుడప్పుడు అక్కడక్కడ జరుగుతుంటే వాటిపై ఆరోపణలు చేస్తూ స్పందించే విదేశీ విధానం ఉంది, ఇలాకాదు, ఇదంతా వద్దు, దీనిని అసలు విదేశీ విధానం అనరు'' అని చెప్పారు. ''ప్రపంచంతో ముడిపడిన భారత భవితవ్యం' ఒక విదేశీ విధాన ప్రణాళిక'' అనే పేరుతో ఇటీవల విడుదలైన ఒక పుస్తకం గురించి ఆయన మాట్లాడుతూ, ఎర్రకోట వద్ద ఇటీవల జరిగిన ఘటన, దేశంలో అక్కడక్కడ జరుగుతున్న ఘటనలను, వీటిమధ్య ఉన్న సంబంధాలను పరిశీలించాలని, ఈ ఘటనలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం నుండి ఇన్ని రోజులుగా ఒక స్పష్టమైన ప్రకటన వెలువడలేదని ఆయన విమర్శించారు. ఈ విధమైన గూఢచారి వైఫల్యం ఎలా జరిగింది? ఇందులో ఉన్న చిక్కులు ఏమిటి? ప్రనత్యేకించి గతంలో చేసిన ప్రకటనల నేపథ్యంలో జరుగుతున్నది ఏమిటి? అని ఆయన ప్రశ్నించారు. మన చుట్టూ ఉన్నవాళ్ళంతా ప్రభుత్వం ఏం చేస్తోందో మీరు చూడం లేదని అంటున్నారు. కానీ ఈ సంక్షోభ పరిస్థితుల్లో ప్రభుత్వం మంచి నిర్ణయాలు తీసుకుంటుందని, వాటితో ప్రజల ముందుకు వస్తుందని, ఆ నిర్ణయాలపై ప్రభుత్వానికి స్పష్టమైన మద్దతు ఇవ్వాలని అనుకున్నప్పటికీ ప్రజలకు, ప్రతిపక్షానికి నమ్మకం కలిగించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. ఢిల్లీల పేలుడు ఘటన చాలా తీవ్రమైన ప్రశ్నార్థకమని, ప్రభుత్వ భద్రతా విధానంపై మచ్చ అన్నారు. వెంటనే ప్రధానమంత్రి పార్లమెంటుకు రావాలని, పార్లమెంటుకు దీనిపై సమాధానం చెప్పాలని కోరారు.

## 'సర్' రెండో విడతలో 99శాతం ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ : ఇసి

**న్యూఢిల్లీ :** ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ రెండో విడతలో 99శాతం ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ చేసినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. 9రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 51కోట్ల ఓటర్లలో సుమారు 50.35 కోట్ల మందికి పైగా ఓటర్లు ఈ పత్రాలను అందుకున్నట్లు ఇసి బుధవారం వివరించింది. ఈ ఎన్యూమరేషన్ ప్రక్రియ డిసెంబర్ 4 వరకు నెల పాటు కొనసాగుతుందని, అక్టోబర్ 27 వరకు ఓటరు జాబితాలో ఉన్న ప్రతి ఓటరుకు సంబంధించి పాక్షిక వివరాలు ఎన్యూమరేషన్ ఫారంలో (ఇఎఫ్) ఉంటాయని తెలిపింది. ఎస్ఐఆర్ రెండో దశలో భాగంగా ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, బంగాల్ రాష్ట్రాలు సహా అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరిలు ఉన్నాయని ఇసి వెల్లడించింది. ఇందులోని 321 జిల్లాలు, 1843 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 51 కోట్ల ఓటర్లను కవర్ చేయనున్నట్లు వివరించింది. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు దాదాపు 5.3లక్షల మంది బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఒలు), 7.64లక్షల బూత్ స్థాయి ఏజెంట్లు (బిఎల్‌ఎలు), 10,448 ఇఆర్‌ఒ/ఎఇఆర్‌ఒలు, 321 మంది డిఇఒలు విధుల్లో నిమగ్నమయ్యారని ఇసి తెలిపింది.

## 'సురక్షిత నెలల్లో' పాఠశాలల క్రీడా పోటీల వాయిదా ఆదేశాన్ని పరిశీలించాలని...

# సిఎక్యూఎంకు 'సుప్రీం' దిశానిర్దేశం



**న్యూఢిల్లీ :** వాయు కాలుష్య స్థాయిలను దృష్టిలో ఉంచుకుని నవంబరు, డిసెంబరులలో జరగాల్సిన బహిరంగ క్రీడా పోటీలను 'సురక్షిత నెలలకు' వాయిదా వేయాలని ఢిల్లీ ఎన్‌సిఆర్ పరిధిలోని పాఠశాలలను ఆదేశించడాన్ని పరిశీలించాలని బుధవారం సుప్రీంకోర్టు కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సిఎక్యూఎం)ను కోరింది. ఢిల్లీజాతీయ రాజధాని ప్రాంతంలోని తీవ్రమైన వాయుకాలుష్య సంక్షోభానికి ముందస్తు చురుకైన విధానం అవసరమని, నెలవారీగా అభివృద్ధిని పర్యవేక్షించడానికి అత్యున్నత న్యాయస్థానం ఈ కేసును తప్పకుండా విచారించాలని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. పెద్దలు ఎయిర్ ప్యూరిఫైయర్లతో మూసివేసిన ప్రదేశాలలో కూర్చున్నప్పుడు పిల్లలు బహిరంగ 'గ్యాస్‌ఛాంబర్'లో క్రీడలు, ఆటల పోటీలకు శిక్షణ పొందుతున్నారని అమికస్‌క్యూరీగా ధర్మాసనానికి సహాయం చేస్తున్న సీనియర్ న్యాయవాది అప్రాజిత సింగ్ చెప్పిన తర్వాత సిఎక్యూఎంకి దిశానిర్దేశం చేయబడింది. 'పిల్లలు చాలా దుర్బలంగా ఉన్నారు. ఇప్పుడు క్రీడలను నిర్వహించడం వారిని గ్యాస్ ఛాంబర్లలో ఉంచడం లాంటిది' అని ఆమె చెప్పారు. దీనిని పరిగణనలోనికి తీసుకుని, అటువంటి క్రీడా పోటీలను సురక్షితమైన నెలలకు మార్చడానికి అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని మేం సిఎక్యూఎంని అభ్యర్థిస్తున్నామని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ అన్నారు. ప్రారంభంలో, కేంద్రం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి మాట్లాడుతూ మంగళవారం నాడు ఎంఓఇఎఫ్‌సిసి ( పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ) కార్యదర్శి ఢిల్లీఎన్‌సిఆర్ రాష్ట్రాల ఉన్నత అధికారులతో నిర్వహించిన ఒక ఉన్నత స్థాయి సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో కాలుష్య నియంత్రణకు చేపట్టాల్సిన దీర్ఘకాలిక, స్వల్పకాలిక చర్యల గురించి చర్చించారు. '2018 నుండి ఇప్పటికే దీర్ఘకాలిక విధానం, 2015నుండి గ్రేడెడ్ రెస్పాన్స్ ప్లాన్ ఉంది. ఇదంతా కోర్టు ఆధారితమైనది. చూసేందుకు అంతా చాలా బాగుంది. కానీ క్షేత్రస్థాయిలో కాలుష్య నియంత్రణ బోర్డుకు ఎలాంటి మానవ శక్తి లేదు' అని అమికస్ క్యూరీ చెప్పారు. కాలుష్యం గరిష్ఠస్థాయికి చేరుకున్నప్పుడు మాత్రమే ప్రతిస్పందిత చర్యలు తీసుకోవడం తగదని, ప్రధాన వాదనను ప్రతీ నెలా ఒకసారి జాబితా చేయమని, తద్వారా కాలుష్య నిరోధక వ్యూహాలను అమలు చేయవచ్చని ధర్మాసనం చెప్పింది. ఉద్భవిస్తున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిఆర్‌పిఎ పాలన కింద కఠినమైన ఆంక్షలను విధించడానికి సిఎక్యూఎం మరియు సిపిసిబిలకు ధర్మాసనం అనుమతించింది. జిఆర్‌ఎపి ఆంక్షల కారణంగా నిర్మాణకార్మికులు నిరుద్యోగులుగా ఉన్నారనే అంశంపై ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ మాట్లాడుతూ 'నిషేధించబడిన కార్యకలాపాలపై కార్మికులు ఆధారపడతారని, తద్వారా వారు బాధపడతారని మేం ఇప్పటికే నిర్ధారించాం' అని అన్నారు. కాలుష్య సంబంధిత ఆంక్షలు రోజువారీ కార్మికుల వేతనాలపై, ముఖ్యంగా నిర్మాణ, అనుబంధ రంగాలలోని కార్మికులపై చూపే ప్రభావాన్ని కూడా ధర్మాసనం ఈ సందర్భంగా ప్రస్తావించింది. కార్మికులకు జీవనాధార భత్యాల చెల్లింపునకు సంబంధించిదుపరి విచారణలో ఆదేశాలను పొంది కోర్టుకు తెలియజేయాలని ఎన్‌సిఆర్ రాష్ట్రాలు ఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, హర్యానా, రాజస్థాన్‌లను ఆదేశించింది. మంగళవారం నాడు ఢిల్లీ ఎన్‌సిఆర్‌లో గాలి కాలుష్యానికి దీర్ఘకాలిక పరిష్కారం కోసం ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. కాలుష్యాన్ని నియంత్రించడానికి అత్యవసర చర్యల గ్రేడెడ్ యాక్షన్ రెస్పాన్స్ ప్లాన్ (జిఆర్‌ఎపి) కింద నిషేధించబడిన కార్యకలాపాలపై ఏడాది పొడవునా ఆంక్షలు విధించడానికి ఇది నిరాకరించింది. పంజాబ్, హర్యానా రెండు రాష్ట్రాలలో పంట వ్యర్థాలను తగలబెట్టడంపై కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సిఎక్యూఎం) ఆదేశాలను కచ్చితంగా పాటించాలని అత్యున్నత న్యాయస్థానం కోరింది. పంజాబ్, హర్యానాలకు సిఎక్యూఎం సూచనలు అమలుచేయబడితే పంట వ్యర్థాలను తగలబెట్టడాన్ని తగినంతగా పరిష్కరించవచ్చు. అందువల్ల రెండు రాష్ట్రాలు సంయుక్తంగా సమావేశం నిర్వహించి సిఎక్యూ చర్యలు జాగ్రత్తగా అమలుచేయబడతాయని నిర్ధారించుకోవాలని మేం ఆదేశిస్తున్నాం అని ధర్మాసనం పేర్కొంది.

GYANA JYOTHI COLLEGE OF PHARMACY
( Approved by AICTE, PCI & Affiliated to JNTU - Hyderabad )
Uppal Bus Depot, hyderabad - 500 039, Ph: 9393144412/15/18,
E-mail: gyanajyothicollege@gmail.com, Web: www.gjcp.ac.in.
SPOT ADMISSIONS
* Spot Admissions will be made on 22/11/2025 to 26/11/2025 in College Premises.
* Interested Candidates can Report before 5.00 PM along with the original Certificates
* Tuition Fee in form of DD/Challan.
* Admissions will be made as per guidelines issued by the TGPGECET - 2025
Sd/- Principal

ప్రజాపక్షం
గురువారం, 20 నవంబరు

# చట్టం 'కార్పొరేట్' చుట్టం!

'చట్టం తన పని తాను చేసుకుపోతుంది', 'చట్టం ఎవరికీ చుట్టం కాదు' వంటి పడికట్టు ప్రకటనల వల్ల సామాన్యులకు ఒరిగేదీ లేదు. చట్టం కార్పొరేట్ శక్తుల చుట్టంగా మారిందన్న వైనం అనేకానేక సందర్భాల్లో బయటపడుతునే ఉంది. 'అంబానీ' కుటుంబానికి చెందిన అనీల్ అంబానీని దశాబ్దాలుగా ఏ శక్తులు రక్షిస్తున్నాయన్నది బహిరంగ రహస్యం. భారీ స్థాయి బ్యాంకింగ్, కార్పొరేట్ మోసాల ఆరోపణలపై అనీల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ (ఎడిఎజి)తో పాటు కేంద్ర ప్రభుత్వం, సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)లకు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేయడం... మూడు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించడం శుభ పరిణామం. 2007–08 నుంచే మోసాలు కొనసాగుతున్నప్పటికీ, ఈ ఏడాదే ఎఫ్ఐఆర్ నమోదైంది. సామాన్యుల విషయంలో కూడా ప్రభుత్వ వ్యవస్థలు ఇదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తాయా? చిన్నమొత్తాలను చెల్లించలేదని సగటు జీవిని నోటీసులతో వేధించి.. బెదిరింపులకు పాల్పడి.. వడ్డీతోసహా వసూలు చేసుకునే బ్యాంకులకు అనీల్ అంబానీ పట్ల ఎనలేని ప్రేమ ఉన్నట్టా లేక మితిమీరి భయపడుతున్నట్టా? లేదా కార్పొరేట్ రంగాల ఆర్థిక అవతవకలు బయటపడకుండా చేతులు మారే కోట్లాది రూపాయలు అన్ని వ్యవస్థల నోర్లు మూయించాయా? పెద్ద ఎత్తున జరిగిన ఈ మోసంలో బ్యాంకులు, వాటి అధికారుల పాత్రను దర్యాప్తు సంస్థలు ఎందుకు నిర్లక్ష్యం చేశాయి? 'భారత చరిత్రలో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద కార్పొరేట్ మోసం' కేసులో అధికారులపై జరిపిన దర్యాప్తు నివేదికలను ఎందుకు బహిర్గతం చేయడం లేదు? సిబిఐ, ఇడి జరిపిన దర్యాప్తు.. తేల్చిన వాస్తవాలపై సమగ్ర నివేదిక ఏదైనా ఉందా? ఇలాంటి ప్రశ్నలు కోకొల్లలు.

అనీల్ అంబానీ అప్పులన్నీ ఆయన అన్న ముఖేష్ అంబానీ తీర్చేశారంటూ గతంలో వార్తలు తెగ ప్రచారమయ్యాయి. అవన్నీ నేతిబీరకాయ చందమేనని సుప్రీం కోర్టులో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం స్పష్టం చేస్తున్నది. అనీల్ అంబానీ ఆధ్వర్యంలోని ఎడిఎజి అనుబంధ సంస్థల్లోకి ప్రభుత్వ నిధులను మళ్లించడం ఆర్థిక ఉగ్రవాదమే. చిన్నచిన్న లావాదేవీలకు కూడా సవాలక్ష ప్రశ్నలు వేసి, ఆధారాలు పరిశీలించి, సమీక్ష పేరుతో కాలయాపన చేసే బ్యాంకులు అనీల్ అంబానీ వంటి దివాలాకోరు వ్యాపారవేత్తకు వేల కోట్ల రూపాయలు ఎలా ఇచ్చాయన్నది సమాధానం రాని.. సమాధానం లేని భేతాళ ప్రశ్న. ఎడిఎజి గ్రూపు, దాని అనుబంధ సంస్థల నకిలీ ఆర్థిక నివేదికలను ఎందుకు పరిశీలించలేదన్నది చిదంబర రహస్యం. ఈ భారీ ఆర్థిక కుంభకోణంపై వివరణాత్మ ఫోరెన్సిక్ ఆడిట్లు ఉన్నప్పటికీ బ్యాంకు అధికారులు... ఆడిటర్లు పట్టించుకోని వైనం అనుమానాలకు తావిస్తున్నది. ఇంత జరుగుతున్నా... అనీల్ అంబానీ బృందం కోట్లకు కోట్లు మింగేస్తున్నా.. సిబిఐ, ఇడి సరైన దర్యాప్తు చేయకపోవడం వ్యూహాత్మక కుట్ర కోణాన్ని తెరపైకి తెస్తున్నది. రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్), రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిలయన్స్ టెలికాం తదితర కంపెనీలు 2013–2017మధ్యకాలంలో రూ.31,580కోట్ల రుణాలు తీసుకున్నాయి. తిరిగి చెల్లించకపోవడం షరామామూలు. ఇప్పుడు కేసు కోర్టుకు చేరడంతో, గతంలో ఎన్నో మోసకారి కార్పొరేట్ సంస్థలు అనుసరించిన వ్యూహమే మరోసారి అమలయ్యే ప్రమాదం లేకపోలేదు. అంటే.. అనీల్ అంబానీ కంపెనీలకు రుణాలిచ్చిన కంపెనీలన్నీ ఇప్పటికీ ఒక కన్సార్టియంగా ఏర్పడ్డాయి. ఆ బ్యాంకుల అధికారులు సమావేశమవుతారు.. సంవత్సరాల తరబడి చర్చిస్తారు.. సాధ్యమైనంత వరకూ సమస్యను పక్కదారి పట్టిస్తారు. చివరికి తీసుకున్న మొత్తంలో పదోపరకో ఇచ్చి సెటిల్ చేసుకోవాలని సూచిస్తారు. ఆ వెంటనే, వేల కోట్ల రూపాయలు రాని బాకీల భారాన్ని కేంద్ర ప్రభుత్వం భుజాన వేసుకుంటుంది. లక్షల కోట్ల రూపాయల రుణాలు రద్దు చేస్తుంది. ఒత్తిళ్లకు లొంగి లేదా అధికారానికి భయపడి లేదా లంచాలకు మరిగి రుణాలు ఇచ్చేవి బ్యాంకులు... తీసుకొని, తిరిగి చెల్లించకుండా ముఖం చాటేస్తున్నవి కార్పొరేట్ కంపెనీలు. వీలైతే విదేశాలకు పారిపోయి దాక్కుంటున్నది ఆ కంపెనీల యజమానులు. నిరర్థక ఆస్తుల కింద ప్రకటిస్తూ, కోట్లకు కోట్ల రూపాయల రుణాలను రద్దు చేస్తున్నది కేంద్ర ప్రభుత్వం. ఆ భారం మోస్తున్నది మాత్రం దేశ ప్రజలు. ఇదెక్కడి న్యాయం? ప్రజల సొమ్ముతో వ్యాపారం చేస్తూ, అదే ప్రజలను నట్టేట ముంచుతున్న కార్పొరేట్ 'తెల్ల ఏనుగుల'ను కేంద్రం ఎందుకు మేపుతున్నది? ఇప్పటికైనా, 'కార్పొరేట్ ఆర్థిక దోపిడీ'కి తెరదించే ప్రయత్నం తప్పక జరగాలి. కట్టుదిట్టమైన చట్టాలు రావాలి..పటిష్టంగా అమలు కావాలి. కార్పొరేట్ రుణమాఫీలు కాదు.. మోసం చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టి శిక్షించే వ్యవస్థ రూపుదిద్దుకోవాలి. ఇప్పటికే గత పదేళ్ల కాలంలో ధనిక, పేద వర్గాల మధ్య వ్యత్యాసం విపరీతంగా పెరిగింది. కార్పొరేట్ శక్తుల దోపిడీకి సుప్రీం కోర్టు ఇవ్వబోయే తీర్పు తెరదించుతుందో, లేదో చూదాం!

# నేలవిడిచి సాముచేస్తున్న కొత్త కార్మిక విధానం

**హుస్సేన్ ఇండోర్‌వాలా, మధులిక**
**టి.గాయత్రీసింగ్, అఖిల్ సూర్య**

కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ 'శ్రమశక్తి నీతి – 2025' పేరుతో ఇటీవల కార్మిక విధానం ముసాయిదా విడుదల చేసింది. అది చాలా గందరగోళంగా ఉంది. ఈ విధానం భారత రాజ్యాంగం నుండి, అందులో హామీయిచ్చిన హక్కులు, రక్షణల నుండి న్యాయబద్ధతను, నైతిక అథారిటీ పొందుతుందని ఒక సెక్షన్ చెప్పింది. తదుపరి సెక్షన్‌లో అది శ్రమపట్ల 'ఇండిక్ ప్రపంచ దృక్పథాన్ని' ప్రత్యేకించి చెప్పింది – శ్రమ అనేది ''సామాజిక సామరస్యం, ఆర్థిక సంక్షేమం, సమష్టి సౌభాగ్యం'' మనుగడను కొనసాగించే ''ఒక పవిత్రమైన, నైతిక విధి'' అని చెప్పింది.

శ్రమశక్తి నీతి – 2025 శ్రమ ప్రపంచాన్ని రాజ్యం, పరిశ్రమ, కార్మికుల మధ్య నైతిక బంధంగా తలపోసినట్లు, అది ధర్మం (విధి), న్యాయం, సామాజిక సామరస్యంలో వేళ్లూని ఉందని, శ్రమ పట్ల గౌరవం జీవితం పట్ల గౌరవం నుంచి విడదీయలేనిదన్న భారతదేశ నాగరికత విశ్వాసాన్ని అది పునరుద్ఘాటిస్తున్నదని ఆ పత్రం వివరించింది. ''మనుస్మృతి, యాజ్ఞవల్క్య స్మృతి, నారద స్మృతి, శుక్రనీతి, అర్థశాస్త్రం వంటి ప్రాచీన గ్రంథాలు రాజధర్మ భావన ద్వారా అభివ్యక్తీకరించిన ఈ నీతిసూత్రాలు న్యాయ ం, సబబైన వేతనాలు, దోపిడీ నుంచి కార్మికులకు రక్షణ చేకూర్చటం అనే రాజ్యవిధిని వక్కాణిస్తున్నాయని పేర్కొన్నది. శ్రమ నిర్వహణకు నైతిక ప్రాతిపదికతో కూడిన ఈ ఆది కాలపు సూత్రీకరణలు ఆధునిక కార్మిక చట్టం రావటానికి శతాబ్దాల మునుపే భారతీయ నాగరికతలో ఉన్నట్లు ప్రస్తావించింది.



దురదృష్టవశాత్తు, ఈ రెండు ప్రాపంచిక దృక్పథాలు – పునర్నిర్మాణం చేసిన ''ప్రాచీన ఆదర్శాలు'', ''ఆధునిక కార్మిక చట్టం'' ఒక దానితో మరొకటి పొసగనివి. ఎందుకంటే, ఒకటి శ్రమ ప్రతిపత్తిని సాంప్రదాయం, ప్రాచీన గ్రంథాల ద్వారా నిర్ణయించింది. రెండవది, పోరాటం ద్వారా బేరసారాల ద్వారా నిర్ణయమవుతుంది. ఒకదానికి కార్మికుడు సమాజ సేవకుడు, రెండో దానిలో తాను సృష్టించే సంపదలో భాగానికి అర్హుడు. ఒకదానిలో అధికార సంబంధాలు సామాజిక దొంతర్లతో కూడినవి, దైవనిర్ణయం కూడా, రెండో దానిలో అవి పోటీపడటానికి, బదిలీకి అర్హమైనవి. ఒకదానిలో సామాజిక సామరస్యం పేరుతో కార్మికుని గొంతు అణచివేయబడుతుంది. రెండో దానిలో అది ప్రజాస్వామ్యానికి, న్యాయానికీ కేంద్ర బిందువుగా గుర్తించబడుతున్నది.

పనిచేయటం విధి అనే దృక్పథాన్ని తిరస్కరించిన ప్రాతిపదికపై ఆధునిక కార్మికచట్టం రూపొందిందన్న వాస్తవాన్ని గుర్తించటాన్ని శ్రమశక్తి నీతి తిరస్కరిస్తున్నది. రాజ్యాంగ సూత్రాలను, అంతర్జాతీయ హామీలను, కార్మికుల జీవన వాస్తవికతను పక్కనపెట్టేదిగా భారతదేశ కార్మిక విధానాన్ని తిరగరాసే ప్రయత్నం జరిగింది. పనిని ''పవిత్రమైన, నైతిక విధి''గా వర్ణించటం ద్వారా ఈ విధానం మతం, ప్రాచీన మతగ్రంథాల భావనలను (శ్రమలో కులాన్ని, లింగ ప్రాతిపదిక నిమ్నోన్నత విభజన) ప్రవేశపెట్టటానికి ప్రయత్నిస్తున్నది. దారుణమైన దోపిడీని మరుగుపరచటానికి, సమర్థించటానికీ, శ్రమజీవుల జీవన పరిస్థితులను క్షీణింపజేయటానికి ప్రయత్నిస్తున్నది.

మన పూర్వీకుల ''కాలాతీత విలువలను'' ఇటీవల లేబర్ కోడ్‌లతో, ముఖ్యంగా కోడ్ ఆన్ వేజెస్, 2019, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్, 2020లతో సమాధానపరచటానికి ఈ విధానం ఉద్దేశించబడింది. ''డిజిటలైజేషన్, గ్రీన్ పరివర్తనలతో, గిగ్, ప్లాట్‌ఫాం వర్క్ వంటి కొత్త ఉపాధి రూపాలతో'' భారత లేబర్ మార్కెట్‌లో వచ్చిన ''నిర్మాణాత్మక మలుపులను'' దృష్టిలోకి తీసుకుని ''సామాజిక భద్రత, నిపుణత, వృత్తి సంబంధమైన భద్రత, టెక్నాలజీ నడుపుతున్న యాజమాన్య నిర్వహణ''కు ఒక ఏకరూప చట్రాన్ని ఏర్పాటు చేయటం ఈ విధానం ఉద్దేశ్యం అని ఆ డాక్యుమెంట్ చెప్పుకుంది.

ఈ నమూనాలో, కార్మిక–ఉపాధి మంత్రిత్వశాఖ ''విశ్వసనీయమైన, కృత్రిమ మేధతో నడిచే వ్యవస్థల ద్వారా కార్మికులు, యజమానులు, శిక్షణా సంస్థల మేళవింపు ద్వారా ఎంప్లాయిమెంట్‌కు దోహదకారి అవుతుంది. ఉపాధి కల్పనకు భారతదేశ డిజిటల్ ప్రభుత్వ మౌలిక వసతులుగా జాతీయ కెరీర్ సర్వీసు (ఎన్‌సిఎస్) నెలకొల్పబడుతుంది. సమ్మిళిత ఉపాధులను సరిపోల్చటం, అర్హతల తనిఖీ, నైపుణ్య ఏకీకరణకు ఇది టెక్నాలాజికల్ వెన్నెముకగా పనిచేస్తుంది.

ఈ విధానం ఏడు ''అంతర్ సంబంధం కలిగిన వ్యూహాత్మక ధ్యేయాలను'' తన మిషన్ ప్రాధాన్యాలుగా వక్కాణించింది. అవి (1) సార్వజనీన సామాజిక భద్రత, (2)వృత్తి సంబంధ భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులు (3) ఉపాధి–భవిష్యత్, (4) మహిళా, యువత సాధికారత, (5) సంధానం సులభతరం, అధీకృత పాలనమొనర్చటం, (6) టెక్నాలాజికల్ అండ్ గ్రీన్ పరివర్తనం, (7) మమేకత, సుపరిపాలన. ఒక్కొక్కదాన్ని సూక్ష్మంగా తెలుసుకుందాం.

(1) సార్వజనీన సామాజిక భద్రత : సామాజిక భద్రత అంటే ఏమిటో అది వివరించలేదు. దాన్ని అందరికీ వర్తింపజేసే మార్గాలను పేర్కొనలేదు. తన పరిధినుంచి పెద్ద సంఖ్యలో ఉన్న అనియత కార్మికులను మినహాయించిన సోషల్ సెక్యూరిటీ కోడ్, 2020పై అది ఆధారపడింది. ఎస్ఎస్‌కోడ్ అమలుకు ఒక సంస్థలో కార్మికుల కనీస సంఖ్యను ఆ కోడ్ నిర్ణయించింది. అసంఘటిత కార్మికులకు పథకాలను ప్రకటించే అధికారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చింది.

(2) వృత్తి సంబంధ భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులు : పని ప్రదేశంలో భద్రత, ఆరోగ్యం ఎలా మెరుగుపరుస్తారో శ్రమశక్తి విధానం వివరించలేదు. అది ఒఎస్‌హెచ్ కోడ్‌పై ఆధారపడింది. ఆ కోడ్ నిర్దిష్టరంగాలకు వర్తింపజేసే సవివరమైన భద్రత చర్యలతో కూడిన ఆయా రంగాలవారీ చట్టాలన్నిటినీ రద్దు చేసింది. అదే సమయంలో కార్మికులందరికీ వర్తించే ఆరోగ్యం, భద్రత చర్యలను చేర్చటంలో విఫలమైంది. ఐఎల్‌ఓ తన 'ప్రాథమిక సూత్రాలు , పని ప్రదేశంలో హక్కులు' డిక్లరేషన్‌లో ఆరోగ్యం, భద్రతను కార్మికుల ప్రాథమిక హక్కుగా ప్రకటించినందున ఒఎస్‌హెచ్ కోడ్ వాటిని దాటవేయటం మహాదారుణం.

(3) ఉపాధి–భవిష్యత్ : భారతదేశంలో గౌరవప్రదమైన పనికి రెండు ప్రమాదాలు ఏర్పడ్డాయి. ఒకటి, నిరుద్యోగం, రెండు, పర్మినెంట్ లేదా రెగ్యులర్ ఉపాధి స్థానంలోకి క్యాజువల్, కాంట్రాక్ట్, నిర్దిష్టమైన కాలం ఉపాధి, గిగ్ వర్క్ ప్రవేశం. భారతదేశంలోని శ్రామికశక్తికి, ముఖ్యంగా యువతకు, భావి తరాలకు అర్థవంతమైన, భద్రతతో కూడిన ఉపాధి కల్పనకు ఎటువంటి ఆచరణాత్మక కార్యాచరణను ఈ విధానం చూపలేదు.

(4) మహిళా, యువత సాధికారతఃఉపాధిలో మహిళలు వివక్షకు గురవుతున్నారు. వేతనాల్లో చిన్న చూపేగాక వారికి 'సంరక్షణ' వంటి అల్పమైన పనులు కల్పిస్తున్నారు. భారతదేశంలో అనియత రంగంలో పురుషులకన్నా మహిళలు ఎక్కువ. నియత రంగంలో కూడా మహిళలు అప్రధానంగా ఉంటున్నారు. వేతనాల్లో వ్యత్యాసం నిషేధం అయినప్పటికీ, మధ్యతరహా నైపుణ్య ఉద్యోగాల్లో పురుషులు ఉద్యోగినులకన్నా 21 శాతం ఎక్కువ వేతనం పొందుతున్నారు. ఈ స్థితిని ఎలా మెరుగుపరుస్తారో, సాంప్రదాయకంగా ''మహిళలను తీసుకోని'' ఉద్యోగ రంగాల్లో గౌరవప్రదమైన, మంచి వేతనంతో కూడిన, నిపుణ ఉద్యోగాలు ఎలా కల్పిస్తారో వివరించలేదు.

(5) సంధానం సులభతరం, అధీకృత పాలనమొనర్చటం, ః బిగ్–టెక్, ఎఐ రంగం యజమానులకు ఎర్ర తివాచీ పరచటం ఈ విధానం ఉద్దేశ్యంగా కనబడుతున్నది. ఇక్కడ రెగ్యులేటరీ బాధ్యతలు అతికనీసంగా ఉంటాయి. యజమానులకు సులభంగా వ్యాపారం చేసుకోవటాన్ని అనుమతిస్తూ కార్మికులకు ఆరోగ్యం, భద్రత ప్రమాణాలను అందించటం సాధ్యం కాదు.

(6) టెక్నొలాజికల్ అండ్ గ్రీన్ పరివర్తనః అత్యంత బలహీనమైన రంగాలకు డిజిటల్ సంబంధం పెంపుచేయకుండా లేబర్ పని పద్ధతులను డిజిటలైజ్ చేయటం వల్ల అనియత కార్మికులు మెజారిటీ పనులు కోల్పోతారు. డిజిటల్ హాజరు, మానిటరింగ్ ఏర్పాట్ల వల్ల పెద్దసంఖ్యలో వేతనాలు అందని, రిజిస్ట్రేషన్‌కు నోచుకోని నారేగా శ్రామికులు ఇందుకు ఉదాహరణ.

(7) మమేకత, సుపరిపాలనః టెక్నాలజీతో ప్రతి కార్మికుణ్ణీ డిజిటల్ వర్కర్‌గా తయారు చేటయం ఈ విధాన ధ్యేయం. ధ్యేయం గొప్పదైనప్పటికీ భారతదేశంలో ఉన్న డిజిటల్ విభజన కారణంగా నెరవేరటం కష్టం. ఉదాహరణకు, మన దేశంలో 15 ఏళ్లు పైబడిన మహిళల్లో 50 శాతానికే మొబైల్ ఫోన్‌లున్నాయి, డిజిటల్ పరిజ్ఞానం కూడా బహు తక్కువ.

నూతన కార్మిక విధానం ''సమ్మిళితం'', ''న్యాయమైన పని పరిస్థితులు'', ''సంబంధీకుల మధ్య సామరస్యం'', ''వ్యాపారం సులభతరం'', ''శిక్షణ, నైపుణ్యం'' వంటి పడికట్టు పదాలు, నినాదాలతో కూడి ఉంది. ఒక పద్ధతి ప్రకారం దాటవేయబడిన రాజ్యాంగ హామీలు, అంతర్జాతీయ హామీలకు ఇవి చౌకబారు ప్రత్యామ్నాయాలు. కార్మిక విధానం అనేది కార్మిక యూనియన్‌లతో, గ్రూపులతో, పౌర సమాజంతో సంప్రదించి రూపొందించాలి. అమలు చేయగలిగిన చర్యలను వాగ్దానం చేయాలి. శ్రమశక్తి నీతి అటువంటి విధానం కాదు.

*('లీఫ్‌లెట్' సౌజన్యంతో)*

# ప్రతి గింజ వెనుక కోటి కుటుంబాల చెమట!

ధనవంతుడు తినే ప్రతి అన్నపు ముద్దలో కనిపించేది బియ్యం సువాసనే కావొచ్చు కానీ, ఆ గింజ గింజలో దాగి ఉన్న అసలు సువాసన రైతు చెమట చుక్క. ఈ ఒక్క వాక్యంతోనే భారత ఆర్థిక నిర్మాణం ఆహార భద్రత వ్యవసాయ ఆధారిత జీవన విధానం అంతా రైతు భుజాలపై ఎంత భారంగా ఉందో అర్థమవుతుంది. భారతదేశంలో నిజంగా ఎంతమంది రైతులు ఉన్నారు అన్న ప్రశ్నకు ఒక్క సరైన సంఖ్య చెప్పడం సులువు కాదు ఎందుకంటే రైతు అనే నిర్వచనమే విభిన్న కోణాల్లో మారిపోతుంది. ప్రభుత్వం దగ్గర ఉన్న గణాంకాల్లో మూడు ప్రధాన ప్రమాణాలు కనిపిస్తాయి: పొలం చేసేవారు వ్యవసాయ కూలీలు వ్యవసాయంపై ఆధారపడే కుటుంబాలు సాగు హక్కు ఉన్న కమతాలు.



2011 జనగణనలో సాగు భూమి పై పంటలు పండించే కల్టివేటర్లు ఇతరుల భూమిపై కూలీ పనిచేసే వ్యవసాయ కార్మికులు కలిపి దేశం లో 26.31 కోట్లు. వీరిలో 11.88 కోట్లు కల్టివేటర్లు 14.43కోట్లు కూలీలు. ఆ సమయంలో మొత్తం వర్క్‌ఫోర్స్‌లో 54.6 శాతం అంటే ప్రతి పది మంది పనిచేసేవారిలో అయిదుగురికి జీవనాధారం వ్యవసాయం.

ఇక తాజా పని జనాభా సర్వేల ప్రకారం వ్యవసాయంలో పనిచేసేవారి శాతం తగ్గినా మొత్తం సంఖ్య మాత్రం ఇంకా పెద్దగానే ఉంది. పిఎల్‌ఎఫ్ఎస్ 2020–21లో వ్యవసాయ రంగ వర్కర్లు 46.5 శాతం, 2021–22లో 45.5 శాతం, 2022–23లో 45.8 శాతం. భారత జనాభా 146 కోట్లకు పెరిగిన నేపథ్యంలో పని వయస్సు గలవారు దాదాపు రెండు మూడవ వంతు. వీరిలో 45 శాతం వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నారు అనుకున్నా సుమారుగా 25నుంచి 27 కోట్ల మధ్య రైతులు వ్యవసాయ కూలీలు నేరుగా వ్యవసాయంతో ముడిపడి ఉన్నారని అంచనా.

నాబార్డ్ సర్వే ప్రకారం 2016–17లో గ్రామీణ గృహాల్లో 48 శాతం వ్యవసాయ కుటుంబాలు కాగా 2021–22లో ఇది 56.7శాతానికి పెరిగింది. అంటే గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు ప్రతి రెండింటిలో ఒకింటికంటే ఎక్కువ ఇంటి జీవనాధారం వ్యవసాయమే అని స్పష్టమవుతుంది. అగ్రికల్చర్ సెన్సస్ 2015–16 ప్రకారం దేశం లో 14.6 కోట్లు కమతాల్లో వ్యవసాయం జరుపుతున్నది. వీటిలో 86.21శాతం చిన్నతరహా, సన్నతర హా హోల్డింగ్‌లు భూమిలో 47.34 శాతం వారి చేతు ల్లోనే ఉంది. సంఖ్యాపరంగా చూసినా పది మందిలో తొమ్మిది మంది చిన్న రైతులే సాగు భూమి మాత్రం సగానికి తగ్గిపోయే స్థాయిలో.

ఇప్పటి జనాభా లెక్కలతో చూసుకుంటే దేశ మొత్తం జనాభాలో నేరుగా పొలంలో కష్టపడే రైతుల శాతం 18 నుంచి 20 శాతం మధ్యలోనే ఉంటుంది. కానీ వ్యవసాయంపై ఆధారపడే కుటుంబ సభ్యులను కలుపుకుంటే దేశ జనాభాలో దాదాపు సగానికి పైగా ఏదో రూపంలో రైతు కుటుంబానికే చెందుతుంది. అందుకే మొదటి వాక్యంలో చెప్పిన అన్నపు ముద్ద వెనకాల రైతు చెమట సువాసన మాత్రమే కాదు రైతు బాధ అసమానతల దుర్వాసన కూడా దాగి ఉంటుంది. దేశానికి అన్నం పెట్టే 25–27 కోట్ల రైతు కుటుంబాలకు ఉన్న భూమి చిన్న చిన్న ముక్కలుగా విభజించబడడంతో పెట్టుబడి సామర్థ్యం తగ్గుతోంది. నీటి వనరులపై ఆధారపడుతున్న పరిస్థితి పెరుగుతోంది. మార్కెట్ ఉత్కంఠల ప్రభావం నేరుగా వారి జీవితం మీద పడుతోంది.

అంతిమంగా భారతదేశంలో ఎంతమంది రైతులు ఉన్నారు అన్న ప్రశ్నకు గణాంకాల ఆధారంగా చెప్పాల్సి వస్తే ఇలా: 2011 జనగణన ప్రకారం 26.31 కోట్లు వ్యవసాయ కార్మికులు. మొత్తం వర్క్‌ఫోర్స్‌లో 54.6శాతం. తాజా పిఎల్ ఎఫ్ఎస్ ప్రకారం ఇప్పటికీ వర్క్‌ఫోర్స్‌లో 46 శాతం వ్యవసాయం అనుబంధరం గాల్లోనే పని. అగ్రికల్చర్ సెన్సస్ ప్రకారం 14.6 కోట్లు రైతు హోల్డింగ్‌లు వాటిలో 86 శాతం చిన్న సన్న రైతుల చేతుల్లో. గ్రామీణ ఇండ్లలో 56.7 శాతం వ్యవసాయ కుటుంబాలు. ఈ అన్ని సంఖ్యలు కలిపి చూసినా భారతదేశంలోని ప్రతి అన్నపు గింజ వెనక కోట్లాది రైతుల చెమట చరిత్ర జీవనగాథ స్పష్టంగా కనిపిస్తుంది. భారతదేశం ఆహార భద్రత రైతుపై నిలిచి ఉంది. దేశంలో 14.6 కోట్లు రైతు హోల్డింగ్‌లు ఉన్నాయి. వీటిలో 86 శాతం చిన్నసన్న రైతులవి చిన్న భూములు పెట్టుబడి అవకాశాలను తగ్గిస్తున్నాయి. రైతు సమస్యలు సంఖ్యల్లో ఎంత స్పష్టంగా కనిపిస్తున్నాయో జీవితాల్లో అంతకన్నా గాఢంగా కనిపిస్తున్నాయి. ధనవంతుడి ప్లేట్‌లో ఉన్న అన్నం వెనక రైతు చెమట చరిత్ర నిలిచిఉంది. ఇదే భారత సామాజిక ఆర్థిక వాస్తవం.

**డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

# ప్రభుత్వరంగ సంస్థల క్షీణత.. ప్రభుత్వ నిర్లక్ష్యం కాదా?

భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు ఒక సంక్రమణ దశలో ఉంది. దేశ అభివృద్ధి కి పునాది వేసిన ప్రభుత్వరంగ సంస్థలు నేడు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నా యి. ఈ పరిస్థితి యాదృచ్ఛికం కాదు; గత దశాబ్దంలో అమలైన కొన్ని తొందరపాటు నిర్ణయాలు, ఆలోచనలేని సంస్కరణలు, మరియు జాతీయ ఆస్తుల పరిరక్షణలో ప్రభుత్వ వైఫల్యమే దీనికి కారణం. ఒక దశాబ్దపు ఆర్థిక పొరపాట్లు ఒకసారి పరిశీలిస్తే భయమేస్తుంది. 2016 నవంబర్ 8 రాత్రి జరిగిన నోట్లరద్దు నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థను పెద్ద దెబ్బతీసింది. డాక్టర్ మన్మోహన్ సింగ్ హెచ్చరించినట్టు జిడిపిలో 2% పడిపోవడం ఒక్కటే కాదు, దేశపు అనధికారిక రంగం పూర్తిగా కుదేలైంది. లక్షలాది చిన్న, మధ్య తరహా వ్యాపారాలు మూతబడ్డాయి. ఆ దెబ్బ నుంచి కోలుకునే లోపే, ప్రభుత్వం తయారీ సరిగా లేని జిఎస్‌టి ను అమలు చేసింది.

పలుస్థాయిల పన్నులు, క్లిష్టమైన రిటర్నులు, చిన్న వ్యాపారులకు తీవ్రమైన భారమయ్యాయి. ఈ రెండు నిర్ణయాలు కలిసి ఆర్థిక వ్యవస్థను దీర్ఘకాలిక మాంద్యంలోకి నెట్టాయి. ప్రజలపై భారమయ్యే పన్నులు కార్పొరేట్లకు పెద్దలాభాలు తెచ్చిపెట్టాయి. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు తగ్గిన సందర్భంలో, సాధారణంగా ప్రభుత్వాలు ప్రజలకు ఆ ప్రయోజనాలు అందిస్తాయి. కానీ ఇక్కడ ధరలు తగ్గినా, పన్నులు మాత్రం పెరిగాయి. కుటుంబ ఖర్చు పెరిగాయి. అదే సమయానికి, 2019లో ప్రభుత్వం కార్పొరేట్లకు భారీ పన్ను రాయితీ ఇచ్చింది. దేశ ఖజానాకు ₹1.45 లక్షల కోట్ల నష్టం జరిగినా, పెట్టుబడులు పెరగలేదు. ప్రజారంగ సంస్థల 'ఫైర్ సేల్'. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం చేపట్టిన మార్గం, అతివేగంగా ప్రైవేటీకరణ. ఇది సంప్రదాయ 'డిస్‌ఇన్వెస్ట్మెంట్' కాదు. ఇది జాతీయ ఆస్తుల 'అమ్మకం' అది కూడా తొందరపాటు, అత్యవసర సమయా ల్లో చేసే ఫైర్ సేల్ విధానంలో. ప్రభుత్వ వాదన ఏంటంటే ప్రైవేటీకరణ వల్ల సామర్థ్యం పెరుగుతుంది, సంక్షేమ పథకాలకు నిధులు లభిస్తాయి. కానీ నిజంగా జరుగుతోందేమిటంటే లాభాలు ప్రైవేట్ రంగానికి, నష్టాలు ప్రజల భుజాలపై. అవమానకరమైన చరిత్ర పాఠాలు తెలుసుకున్నా ప్రభుత్వ తీరు మారలేదు. గత ఎన్డీయే ప్రభుత్వకాలంలో విఎస్‌ఎన్‌ఎల్ విక్రయం తక్కువ విలువలో జరిగినట్లు అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. నేడు కూడా ఎల్ఐసి, ఐడిబిఐ, ఒఎన్‌జిసి, హెచ్‌పిసిఎల్ వంటి లావాదేవీలు నిజమైన డిస్‌ఇన్వెస్ట్మెంట్ కావు; అవి ప్రభుత్వం ఒక జేబులోంచి మరొక జేబులో డబ్బు మార్చినట్టు. దీర్ఘకాల ప్రమాదాలు గురించి ప్రభుత్వం దగ్గర సమాధానాలు లేవు. బ్యాంకింగ్ స్థిరత్వం: ప్రభుత్వ బ్యాంకులు 2008 గ్లోబల్ సంక్షోభాన్ని భారత్‌ను ఎలా రక్షించాయో దేశం మరిచిపోలేదు. ఇప్పుడు ఇవే ప్రైవేటీకరణ గురిపెట్టబడుతున్నాయి. ఎల్ఐసి భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంది. ఎల్ఐసి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రధాన ఆర్థిక ఆధారం. దానిని ప్రైవేట్ హస్తాల్లోకి ఇవ్వడం అంటే దీర్ఘకాల పెట్టుబడుల భవిష్యత్తును ప్రమాదంలో పెట్టినట్టే. సామాజిక న్యాయం పూర్తిగా తుడిచి పెట్టినట్టే. దళితులు, ఆదివాసీలు, ఒబిసిలకు ఉన్న రిజర్వేషన్లు ప్రభుత్వ వాటా 50% కంటే తక్కువైతే సహజంగానే రద్దవుతాయి. ప్రాంతీయ అభివృద్ధి కుంటుపడింది. లాభం రాకపోతే గ్రామీణ బ్యాంకు శాఖలను ప్రైవేట్ సంస్థలు కొనసాగిస్తాయా? అనుమానమే. ఇప్పటికే నిరుద్యోగం అత్యధిక స్థాయిలో ఉండగా, ప్రజారంగ ఉద్యోగాలకు ముప్పువస్తే దాని ప్రభావం ఘోరంగా ఉంటుంది. ఎక్కడ స్పష్టత లేదు. ఆస్తులకు విలువ ఎలా నిర్ణయించారు? రిజర్వ్ ప్రైస్ ఎలా లెక్కించా రు? బిడ్డర్లను ఎలా ఎంచుకున్నారు? ప్రభుత్వం ఈ ప్రశ్నలకు సమాధానమివ్వకుండా ముందుకు సాగుతుండటం అనుమానాలు మరింత పెంచుతుంది.

ముఖ్యంగా ఎలక్షన్ బాండ్స్ వివాదం వెలుగులోకి వచ్చిన తర్వాత. నిదానమైన, సంస్థ నిర్దిష్ట వ్యూహం అవసరం. అన్ని ప్రభుత్వరంగ సంస్థలు ఒకేలా ఉండవు. కొన్ని లాభాల్లోనే ఉన్నాయి. కొన్ని పునర్వ్యవస్థీకరణ చేస్తే లాభదాయకమవుతాయి.కొన్ని మాత్రమే అమ్మకానికి అనర్హం. ప్రతి సంస్థకు విడిగా వ్యూహం అవసరం. దీర్ఘకాలిక దృష్టి అవసరం. జాతీయ ఆస్తులు కాపాడే బాధ్యత అవసరం. ప్రభుత్వం తరచూ చెప్పేది 'వాణిజ్యం చేయడం ప్రభుత్వం చేయాల్సిన పని కాదు'. అయితే సత్యం ఏమిటంటే, దేశ ఆర్థిక వ్యవస్థను సరిగా నడపలేని ప్రభుత్వం, ఉద్యోగాలు సృష్టించలేని ప్రభుత్వం, సామాజిక న్యాయాన్ని కాపాడలేని ప్రభుత్వం జాతీయ ఆస్తులు అమ్మే హక్కు లేదు. భారత ప్రజారంగం దేశ స్వావలంబనకు, సామాజిక సమానతకు, మౌలిక అభివృద్ధికి పునాది. దానిని తొందరపాటు నిర్ణయాలతో అడ్డగోలుగా విక్రయించడం భవిష్యత్తు తరాల పట్ల ఘోర అన్యాయం.

**డా. ముచ్చుకోట సురేష్ బాబు**

# బాలల హక్కుల హననం

జాతికి నిజమైన సంపద బాలలే. వారిపై ఖర్చు పెట్టుబడిగా భావించాలి. బాలల అభివృద్ధి వారికి లభించే నాణ్యమైన ఆహారం, ఆరోగ్యం, విద్య, వినోదం, కుటుంబ జీవనంపై ఆధారపడి ఉంటుంది. అప్పుడే ఉత్తమ పౌర సమాజం నిర్మితమవుతుంది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 1959, నవంబర్ 20 న బాలల హక్కుల ప్రకటనను ఆమోదించినది. ఈ తేదీన ప్రతి సంవత్సరం ప్రపంచ బాలల దినోత్సవం నిర్వహిస్తుంటారు. ప్రపంచ పిల్లల దినోత్స వం ద్వారా ప్రతి బిడ్డకు సురక్షితమైన, సహాయక వాతావరణాన్ని కల్పించడం, బాలల హక్కుల పరిరక్షణ, విద్య , సమానత్వానికి సంబంధించిన అవగాహన పెంచడం ముఖ్య లక్ష్యాలు. పిల్లల సంక్షేమం, హక్కుల దుర్వినియోగం నుంచి రక్షణ వంటి అంశాలను ప్రపంచ వేదికలలో చర్చించడం జరుగుతుంది.

అభివృద్ధిలో ప్రపంచ దేశాలు దూసుకు వెళుతున్నప్పటికీ... బాలల విద్య, ఆరోగ్యం, భద్రత హక్కులు వంటి అంశాల్లో ఇంకా వివక్షత కొనసాగుతుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 6.2కోట్లకు పైగా బాలికలు ఇంకా విద్యకు దూరంగానే ఉన్నారు. 15–19 సం.ల వయస్సు గల బాలికలు, అబ్బాయిల కంటే రెండు రెట్లు ఎక్కువ విద్యా లేదా ఉద్యోగ అవకాశాలకు దూరంగా ఉన్నారు. నలుగురు బాలికల్లో ఒక్కరికి 18 ఏళ్ళు వచ్చేలోపు పెళ్లి జరుగుతోంది. భారతదేశంలో పితృస్వామ్య భావజాలంతో లింగపరమైన వివక్షత కనబడుతుంది. బాలికలను ఆరోగ్య సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (NFHS)5 ప్రకారం, 15–49 సంవత్సరాల వయస్సు గల స్త్రీలలో 57 శాతం రక్తహీనతతో బాధపడుతున్నారు. దాదాపు 5గురు స్త్రీలలో ఒకరు తక్కువ బరువుతో ఉన్నారు. భారతదేశంలో ప్రతి ఏటా నవంబర్ 14 జాతీయ బాలల దినోత్సవం జరుపుకుంటారు. బాలల అభివృద్ధికి మూలం విద్య. వాస్తవంగా భారతదేశంలో మొట్టమొదట విద్యాభివృద్ధికి కృషి చేసిన ఆదిదంపతులు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేలు. వారి కృషివల్లనే నేడు బడుగు బలహీన వర్గాల పిల్ల లు చదువుకునే అవకాశం లభించింది. ఆ చదువు ను భారత రాజ్యాంగం ద్వారా డాక్టర్ బాబాసాహెబ్ చట్టబద్ధం చేశారు. భారత రాజ్యాంగం, చట్టాల ద్వారా బాలలకు ప్రత్యేక రక్షణలు కల్పించారు. ఉన్నత వర్గాల బాలలతో పోలిస్తే...అట్టడు గు వర్గాల బాలల ఎదుగుదల నేటికి సవాల్‌గానే నిలిచింది. బాలల విద్యకోసం విద్యహక్కు చట్టా న్ని తీసుకొచ్చారు. అయినా సంపన్న, పేద విద్యార్థుల మధ్య విద్య అంతరం కూడా పెరుగుతుంది. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 92శాతం బిసి ఎస్సీ ఎస్టీ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదవగా... సంపన్న శ్రేణి నుంచి కేవలం 8 శాతం మాత్రమే ప్రభుత్వ బడుల్లో చదువుతున్నారు. ప్రపంచ ఆకలి సూచిక–2024 ప్రకారం ఇప్పటికి మన




దేశంలో 13.7 శాతం పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. మరోవైపు 5ఏళ్ళలోపు పిల్లలు 35.5 శాతం మంది వయస్సుకు తగ్గ ఎత్తు లేకపోగా ....18.7శాతం ఎత్తుకు తగిన బరువు లేరు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 5 ప్రకారం ఇప్పటికీ భారతదేశంలో 23శాతం బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తేలింది. పశ్చిబెంగాల్, బీహార్ రాష్ట్రాలలో 41 శాతం బాల్య వివాహాలు జరగడం ఆందోళనకరం. బాల్యదశలో ఎదుర్కొని అనేక సామాజిక రుగ్మతలకు అట్టడుగు వర్గాల పిల్లలే బాధితులవుతున్నారని క్షేత్రస్థాయి అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఇది ఆందోళన కలిగించే అంశం.

భారతదేశ జనాభాలో 37 శాతం బాలలున్నా రు. పిల్లలను పేదరికం నుండి విముక్తి చేయడానికి కుటుంబ సామాజిక భద్రత కార్యక్రమాలపై దృష్టి పెట్టాలి. ఆడపిల్లల అభివృద్ధికి సుకన్య సమృద్ధి, మిషన్ వాత్సల్య వంటి ఆర్థిక సాధికారక కార్యక్రమాలు అమలుచేయాలి. పిల్లల్లో ఒత్తిడి, భయం, అభద్రత తదితర ప్రతికూల ప్రభావాలు తొలగించడానికి ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించడానికి మంచి నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలి. బాలల అభివృద్ధి శిశుదశలోనే మొదలవ్వాలి. ఇందుకోసం ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలను బలోపేతం చేయాలి. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం సమీకృత గురుకులాలు, మండలానికొక ఇంటర్నేషనల్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నది. వీటిలో మౌలిక సదుపాయాలు కల్పించినపుడే వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, నైపుణ్యాన్ని పెంపొందించవచ్చు. అధిక జనాభా గల భారతదేశం పిల్లల హక్కుల సంరక్షణకు చట్టాలను పటిష్టంగా అమలు పరచాలి. బాలల సహాయ కేంద్రానికి(1098) ప్రాచుర్యం కల్పించాలి.

బాలల సంరక్షణ కోసం పోక్సో చట్టం 2012, బాలల న్యాయ చట్టం 2015, బాల హక్కుల పరిరక్షణ కమిషన్ 2005 లాంటివి ఉన్నాయి. ఇవి బాలల పట్ల కొనసాగుతున్న దుర్వివక్షణను అంతమొందించడానికి గట్టి కృషిచేయాలి. బాలల అభివృద్ధికీ బడ్జెట్ కేటాయింపుల్లో తగిన ప్రాధాన్యతనివ్వాలి. పేద బడుగు బలహీన వర్గాలు చదివే ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక భవనాలు, ప్రయోగశాలలు, బస్ సౌకర్యం, కంప్యూటర్ విద్య, సరిపడా ఉపాధ్యాయులు కొరత వేధిస్తుంది. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల బిసి, ఎస్‌సి, ఎస్‌టి, జెఎసి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, మౌలిక సదుపాయాలు కల్పనకు డిమాండ్ చేశారు. అట్టడుగు వర్గాలు చదివే ఈ పాఠశాలలో గౌరవప్రదమైన విద్యలో భాగమివి. ఇప్పుడు తల్లిదండ్రులు కోరుకునేది కూడా గౌరవప్రదమైన విద్యనే. పిల్లలకు బాల్య దశ నుంచి ప్రశ్నించేతత్వం పెంపొందే విద్యనందించాలి. వారి హక్కుల పట్ల ప్రభుత్వం, పౌర సమాజం విస్తృతంగా ప్రచారం చేయాలి. అప్పుడే బాలల సర్వతోముఖాభివృద్ధికి బాటలు పడతాయి.

**(ప్రపంచ బాలల దినోత్సవం (నవంబర్20))**

## బాల్య వివాహాల నివారణపై కళాజాత ప్రదర్శన



**ప్రజాపక్షం/బంట్వారం :** బాల్య వివాహాలను అరికట్టేందుకు బంట్వారం మండల పరిధిలో ఉన్న తోర్‌మామిడి గ్రామంలో బుధవారం మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన నిర్వహించడం జరిగిందని ఐసీడిఎస్ సూపర్ వైజర్ ధనలక్ష్మి పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా చిన్నతనంలోనే బాలికలకు బాల్య వివాహాలు చేయడం ద్వారా జరగబోయే అనర్థాలు ఎలా ఉంటాయో ...కళా బృందంచే ఆట పాటలతో ప్రజలకు వివరంగా వివరిస్తూ బాల్య వివాహాలను నిర్మూలిస్తే వారి జీవితం ఆనందమయంగా ఉంటుందని, కళాబృందం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడిఎస్ సూపర్ వైజర్, కళాకారులు, తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో 'నశా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమం



**ప్రజాపక్షం/నాగారం:** మాదక ద్రవ్య రహిత సమాజంకోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మాదక ద్రవ్యాల నివారణపై నశా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం కమిషనర్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేసి ఆయన మాట్లాడుతూ మత్తుమందు రహిత సమాజ నిర్మాణం వైపు ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ బి నారాయణరెడ్డి, వార్డు ఆఫీసర్లు, యుఎల్‌బి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## అందెశ్రీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు

### మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** అందెశ్రీ పాటలు ఎప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలో అవుషాపూర్ ఓ ఫంక్షన్‌హాల్లో బుధవారం అందెశ్రీ సంతాప సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్, మల్కాజ్గిరి ఎంపి ఈటల రాజేందర్, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుదీర్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, మున్సిపల్ అధ్యక్షులు మామిండ్ల ముతాలు యాదవ్‌లు పాల్గొని అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి, బండారి శ్రీనివాస్ గౌడ్, హెల్త్ యూనివర్సిటీ చైర్మన్ చామకూర భద్రరెడ్డి, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, నాగరాజ్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలని వినతి

**ప్రజాపక్షం/కాప్రా :** నాచారం డివిజన్‌లో ప్రజాభివృద్ధి కార్యక్రమాల కోసం నిధులు మంజూరు చేయాలని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ కోరారు. బుధవారం ఆమె జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌ను కల్సి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతు బజార్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాలు నిర్మాణం, అన్నపూర్ణ కాలనీకి ఆనుకొని ఉన్న హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువు బఫర్ జోన్‌లో థీమ్ పార్కు, ఎర్రకుంటలో హిందూ స్మశాన వాటికను వైకుంఠధామంగా తీర్చిదిద్దటం అవసరమని, దీంతోపాటు పటేల్ కుంట చెరువు పక్కన అసంపూర్తిగా మిగిలిన సివర్‌లైన్ డైవర్షన్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు.



## సిలిండర్ల అక్రమ రీఫిల్లింగ్ : ఇద్దరి అరెస్టు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** వంట గ్యాస్ సిలిండర్లను అక్రమంగా రీఫిల్లింగ్ చేస్తున్న వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకొంటామని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి హెచ్చరించారు. మేడ్చల్ మండల కేంద్రంలో బుధవారం రెండు ఎల్‌పిజి గ్యాస్ రిఫిల్లింగ్ కేంద్రాలపై పౌరసరఫరా అధికారులు ఆకస్మికదాడులు నిర్వహించారు. సబ్సిడీపై వినియోగదారులకు సరఫరా చేసే గ్యాస్ సిలిండర్లను రీఫిల్లింగ్ చేసి విక్రయించే వారిపై నిత్యావసరాల చట్టం 1955 కింద 6ఏ కేసుతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు. మేడ్చల్ పోలీసులు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## బిఆర్‌ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు వద్దు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** బిఆర్‌ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేయకుండా ప్రొటోకాల్ ఉల్లంఘనకు సంబంధించిన కేసులో నిష్పాక్షపాత విచారణ చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి కోరారు. బుధవారం ఆయన బిఆర్‌ఎస్ నేతలు మేకల రాము యాదవ్, అనిల్ కిషోర్ గౌడ్‌లతో కల్సి రాష్ట్ర డిజిపి శివధర్‌రెడ్డిని కల్సి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. గత జూలై 15న బోనాలు పండుగ చెక్కుల పంపిణీ సమయంలో తలెత్తిన ప్రొటోకాల్ ఉల్లంఘన వివాదం, కౌకూర్ ఫార్చ్యూన్ ఎంక్లేవ్ కాలనీ వాసులపై నమోదైన కేసులను తిరిగి పరిశీలించాలని, శాంతి భద్రతా చర్యల పురోగతికి సంబంధించి ఎమ్మెల్యే డిజిపిని కోరారు.

## మాజీ ఉప సర్పంచ్ హబీబ్ మృతి



**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సూరారం మాజీ ఉపసర్పంచ్ మహమ్మద్ హబీబ్ (75) బుధవారం తన స్వగృహంలో మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా షుగర్, రక్తపోటు వ్యాధితో బాధపడుతున్నాడు.1981–1985 వరకు ఆయన నాటి సూరారం గ్రామపంచాయతీలో ఉప సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆనాటి సర్పంచి ముత్తయ్య ముదిరాజ్‌తో కలిసి సూరారం గ్రామానికి విశిష్ట సేవలను అందించారు. ఆదాయం కోసం ఆయన ఏనాడు వెంపర్లాడకుండా షాపూర్ నగర్ లోని ఆర్ జి ఫౌండ్రీ పరిశ్రమలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ సూరారం గ్రామపంచాయతీకి ఉపసర్పంచిగా బాధ్యతలు నిర్వహించారు. సూరారం గ్రామస్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, స్థానికులు హాజరై స్వర్గీయ హబీపు మృతదేహానికి ఘన నివాళులు అర్పించారు.

## కుషాయిగూడ వ్యభిచార గృహంపై దాడి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** వ్యభిచారం గృహంపై దాడిచేసి ఇద్దరిని అరెస్టు చేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కుషాయిగూడ పిఎస్ పరిధిలోని శ్రీ రామ్ నగర్ కాలనీరోడ్ నంబర్ 3లో ఓ ఇంటిలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై విశ్వసనీయ సమాచారం మేరకు దాడిచేసి ఒక బాధితురాలితో పాటు నిర్వహకురాలు ఈస్ట్ గోదావరికి చెందిన గుత్తుల సత్యవతి, విటుడు అల్వాల్‌కు చెందిన సంతోష్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా చంద్రశేఖర్ సహాయంతో గత మూడు నెలలుగా రెండు తెలుగు రాష్ట్రాల నుండి మహిళలకు డబ్బులు ఆశచూపి బలవంతంగా హైదరాబాద్‌లో పలు ప్రాంతాలలో రూములు అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నట్లుఒప్పుకున్నారు. వారిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామని, బాధితురాలిని రెస్క్యూ హోమ్‌కు తరలించి చంద్రశేఖర్‌ను గాలిస్తున్నామన్నా రు.

### బిసి రిజర్వేషన్లకు

# రాజ్యాంగ రక్షణ లేకుంటే అగ్గిపుట్టిస్తాం

* సిఎం రేవంత్‌రెడ్డి అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి
* లోయర్‌ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నాలో జాజుల



**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్థానిక సంస్థల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలని, లేనిపక్షంలో రాష్ట్రంలో అగ్గిపుట్టిస్తామని బిసి జెఏసి వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. డిసెంబర్ మొదటివారంలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో పార్టీలకతీతంగా బిసి రిజర్వేషన్ల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బిసి రిజర్వేషన్లపై రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బిసి జెఏసి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ లోయర్‌ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ హాజరుకాగా, బిఆర్‌ఎస్ మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి సంఘీభావం తెలిపారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఇప్పటికైనా సిఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానితో చర్చించి, ఒత్తిడి పెంచాలని కోరారు. ఎవరి వాటా వారికి దక్కాలన్న రాహుల్ గాంధీ మాటలు తెలంగాణలో నీటిమూటలయ్యాయని విమర్శించారు.

బిసి రిజర్వేషన్లకు రాజ్యాం గ రక్షణ కల్పించాల్సినకేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావులే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేయడం సిగ్గుచేటున్నారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలు బిసిలను నమ్మించి, మోసం చేశాయని మండిపడ్డారు. బిసి లు బిచ్చగాళ్లు కాదని, రాజ్యాంగబద్ధం గా రావాల్సిన వాటా అడుగుతున్నారనే విష యాన్ని రాజకీయ పార్టీల నేతలు గ్రహించుకోవాలని సూచించారు. మధుసూదనాచారి మాట్లాడుతూ కాంగ్రెస్, బిజెపిలు లోపాయికారంగా బిసి రిజర్వేషన్లను అటకెక్కించి బిసిలను పచ్చి మోసం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాల మెడలు వంచి బిసి రిజర్వేషన్లు సాధించేవరకు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

ఈ ధర్నాలో బిసి జెఏసి చీఫ్ కో–ఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, బిసి కుల సంఘాల జెఏసి చైర్మన్ కుందారం గణేశ్‌చారి, బిసి జెఏసి కో–ఆర్డినేటర్ కులకచర్ల శ్రీనివాస్, నేతలు విక్రమ్‌గౌడ్, శ్యాం, దిటి మల్లయ్య, వీరస్వామి, నందగోపాల్, తారకేశ్వరి, కె.గౌతమి తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ మనుచౌదరిని కలిసిన ఎమ్మెల్యే కృష్ణారావు

**కూకట్‌పల్లి/ప్రజాపక్షం :** కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కెపిహెచ్‌బి డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావులు బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరిని కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెపిహెచ్‌బి డివిజన్‌లోని రమ్య గ్రౌండ్‌లో పాఠశాల నిర్మాణానికి సంబంధించి పనులు ప్రారంభమయ్యేలా చూడాలన్నారు.

ఆ స్థలాన్ని జిహెచ్‌ఎంసికి కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నిరుపేదలకు ఉపయోగపడే పాఠశాల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు. పాఠశాల నిర్మాణం పూర్తయితే ఎంతో మంది నిరుపేదలకు ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే వసంత్ నగర్, సర్దార్ పటేల్ నగర్, ఎన్‌ఆర్‌ఎస్‌ఏ కాలనీలకు సంబంధించిన నిర్మాణ పనులకు అడ్డంకి లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్లాపూర్ కార్పొరేటర్ సబియా గౌసుద్దీన్, కెపిహెచ్‌బి డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్, యర్ర నాగేశ్వరరావు, హనుమంతరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## 1,42,383 మంది లబ్ధిదారులకు చేయూత

### అదనపు కలెక్టర్ రాధికా గుప్తా




**ప్రజాపక్షం/మేడ్చల్‌మల్కాజిగిరి:** వితంతు, వృద్ధాప్య, దివ్యాంగ, ఒంటరి మహిళలాలంటి వివిధ రకాల పెన్షన్‌దారులు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డులకు లింక్ చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా సూచించారు. బుధవారం చేయూత పెన్షన్లపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, చేనేత, కల్లు, కార్మికులు, బీడి, ఎయిడ్స్, డయాలసిస్, ఫైలేరియా వ్యాధిగ్రస్తు లు తదితరులకు చేయూత పథకం కింద జిల్లావ్యాప్తంగా లక్షా 42వేల 383 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా రూ.34 కోట్ల 40 లక్షల 92 వేలు ఆర్థికసాయాన్ని అందిస్తున్నామన్నారు. ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా పెన్షన్ల పంపిణీ జరుగుతోందన్నారు. దీంతో పాటు నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ కింద కుటుంబ పెద్ద యజమాని మృతి చెందితే ఆ కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నారని, దీనికోసం జనవరి 2022 వరకు ఇప్పటి వరకు ఎవరైనా ఉంటే తమ ప్రాంత తహసీల్దార్, మున్సిపాలిటి కార్యాలయాల్లో ధరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. గ్రీవెన్స్ సంబంధించి ప్రజావాణిలో ఏవైనా సమస్యలుంటే అర్జీ పెట్టుకోవచ్చన్నారు. ఫేషియల్ విధానాన్ని ప్రతి కార్యాలయంలో సక్రమంగా పని చేసేలా అధికారులు చూసుకోవాలన్నారు. సెర్ఫ్ ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్, డిఆర్డీఓ సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, పోస్టల్ విభాగ అధికారులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

## మాజీ సైనికుల పిల్లలకు డిగ్రీ కోర్సుల్లో స్కాలర్‌షిప్‌లు


**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** వృత్తి విద్యా కోర్సుల్లో చేరిన మాజీ సైనికుల పిల్లలకు ప్రధాన మంత్రి స్కాలర్‌షిప్ కోసం కేంద్రీయ సైనిక్ బోర్డు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, హైదరాబాద్ జిల్లా ల ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి శ్రీనేష్ కుమార్ నోరి పేర్కొన్నారు. ఈ పథకం కింద అబ్బాయిలకు రూ.30వేలు, అమ్మాయిలకు రూ.36వేలు ప్రతి ఏటా లభిస్తుందన్నారు. తమ దరఖాస్తులను www. ksb.gov.in ద్వారా చేసుకోవాలన్నారు.

అదే విధంగా డిగ్రీలో చేరిన మాజీ సైనికుల పిల్లలకు సాయుధ దళాల పథాకం దినోత్సవ నిధి నుండి కంప్యూటర్ గ్రాంట్‌ను మంజూరు చేసేందుకు దరఖాస్తులను www.sainik. telangana.gov.in ద్వారా చేసుకోవాలని తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో సాధారణ డిగ్రీ వృత్తి విద్యా కోర్సుల్లో చేరిన మాజీ సైనికుల పిల్లలు అర్హులన్నారు.

## తాండూరులో బిఆర్‌ఎస్‌కు భారీ షాక్

### కాంగ్రెస్‌లో చేరిన పార్టీ మాజీ అధ్యక్షుడు అప్పు

### ఆహ్వానించిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు పట్టణంలో బిఆర్‌ఎస్ పార్టీకి భారీ షాక్ తగలింది. తాండూరు పట్టణ పార్టీ మాజీ అధ్యక్షులు నయ్యిమ్(అప్పు) తిరిగి కాంగ్రెస్ పార్టీ గూటికి చేరారు. ఆయనతో పాటు మాజీ కౌన్సిల్ ముక్తర్ నవాజ్ సైతం బిఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బిఆర్‌ఎస్ పార్టీని వీడిన మాజీ పట్టణ పార్టీ అధ్యక్షులు నయ్యిమ్( అప్పు) తాండూరు ఎంఎల్‌ఏ బుయ్యా ని మనోహర్‌రెడ్డి సక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన అప్పుకు,మాజీ కౌన్సిలర్ ముక్తర్ నవాజ్‌లకు ఎంఎల్‌ఏ మనోహర్‌రెడ్డి పార్టీ పార్టీ కండువ కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కాగా గతంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నయ్యిమ్ (అప్పు) పనిచేసిన విషయం తెలిసిందే. 2018ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుండి గెలుపొంది మాజీ ఎంఎల్‌ఏ పైలెట్ రోహిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ వీడి బిఆర్‌ఎస్ పార్టీలోచేరడడంతో ఆయనతో పాటు పట్టణ పార్టీ అధ్యక్షులుగా పనిచేస్తున్న అప్పు కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. బిఆర్‌ఎస్ పార్టీలో చేరిన అప్పుకు తిరిగి బిఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్ష పదవిని కట్టబెట్టారు. 2023 ఎన్నికలకు ఆయన పట్టణ పార్టీ అధ్యక్షులు కొనసాగిన విషయం తెలిసిందే. గత కొంత కాలంగా బిఆర్‌ఎస్ పార్టీకి దూరంగా ఉంటున్న అప్పు బిఆర్‌ఎస్ పార్టీ వీడి తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో పాటు పట్టణలో బిఆర్‌ఎస్ పార్టీకి భారి షాక్ తగిలింది. మాజీ ఎంఎల్‌ఏ పైలెట్ రోహిత్‌రెడ్డికి ముఖ్యఅనుచరుడిగా కొనసాగిన ఆయన పార్టీని వీడడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఆయనతో పాటు మాజీ కౌన్సిలర్ ముక్తర్ నవాజ్ సైతం పార్టీ మారడంతో తాండూరు పట్టణంలో బిఆర్‌ఎస్ పార్టీకి గట్టి ఎదురు దెగ్గ తగిలింది.

## కాంగ్రెస్ గూటికి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సాజిద్



**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరులో ఎంఐఎం పార్టీకి భారీ షాక్ తగిలింది. గత కొంతకాలంగా ఆ పార్టీకి దూరంగా ఉంటున్న తాండూరు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సాజిద్ అలీ కాంగ్రెస్ గూటికి చేశారు. మంగళవారం తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, స్థానిక నాయకులతో కలసి సాజిద్ అలీ ఎంఎల్‌ఏ మనోహర్‌రెడ్డిని కలసిశారు. అనంతరం ఎంఎల్‌ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి సాజిద్‌కు పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా వైస్ చైర్మన్ సాజిద్ అలీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి పనులను, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేస్తున్న కృషికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. తాండూరులో కాంగ్రెస్ పార్టీ పటిష్టానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు హబీబ్‌లాల, నాయకులు మహిపాల్ రెడ్డి, ఉపరి మల్లేశం, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



## పేదల వైద్యానికి సిఎం రిలీఫ్ ఫండ్ వరం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న మల్కాజిగిరి డివిజన్ రాధాకృష్ణనగర్ నివాసి జయంతిలాల్‌కు సిఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి బుధవారం అందచేసారు. సిఎం సంక్షేమ సహాయ నిధి పేదల వైద్యానికి ఆపన్న హస్తంలా ఉపయోగపడుతుందని, అవసరమైన వారు తమను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ శ్రేణులు మధుసుధన్, చిన్నయాదవ్, వెంకన్న, శివగౌడ్, సుమన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్రూమ్ సముదాయంలో ఏర్పాటు చేసిన ప్రాథమిక పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో, ఉమ్మడి ఖుత్బుల్లాపూర్ మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు, దుందిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ జిల్లా గ్రంథాలయం చైర్మెన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రారంభోత్సవం చేసారు. ఈ సందర్భం గా కావలి గణేష్ మాట్లాడుతూ, నేటి బాలలే రేపటి పౌరులు. డబుల్ బెడ్రూమ్ కాలనీ బెనిఫిషరీల పిల్లలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో అమరం ముత్యంరెడ్డి, పిఏసిఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, జక్కుల మల్లేష్, నాగార్జున, ముత్యం రెడ్డి, దొంతి మహేష్ ముదిరాజ్, పండుగ శ్రీశైలం ముదిరాజ్, శశికుమార్‌లు పాల్గొన్నారు.

## ప్రమాద బాధితులకు చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/తాండూరు:** ప్రమాద బాధితులు ఎవ్వరు అధైర్య పడవద్దని మీకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి బరోసా ఇచ్చారు. చేవెళ్ళ మీర్జగూడ వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తాండూరు నియోజకవర్గానికి చెందిన 10మంది క్షతగాత్రులకు ఒక్కోక్కరికి రూ.2లక్షల విలువగల చెక్కులను ఎంఎల్‌ఏ మనోహర్‌రెడ్డి అందజేశారు. బుధవారం తాండూరు ఎంఆర్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణిలో ఎమ్మెల్యే పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాద బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ ఉమశంకర్ ప్రసాద్, తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, తదితరులు ఉన్నా రు.

# ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/షామీర్‌పేట్:** అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంకి రమేష్ అధ్వర్యంలో అలియాబాద్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, మూడుచింతలపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, ఎఎంసి డైరెక్టర్ తుంకి భిక్షపతి, మాజీ సర్పంచులు ఏళ్ల మల్లేష్, కంతం కృష్ణ రెడ్డి, పట్టా బాలనర్సింహ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కోడూరి నర్మద, అబ్బగౌని భాస్కర్ గౌడ్, చట్లపల్లి నర్సింగ్, బాలేశ్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





**ఘట్‌కేసర్‌లో :** భారత దేశ మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ 108వ జయంతిని మున్సిపల్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలు యాదవ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఇందిరాగాంధీ చిత్ర పటానికి మేడ్చల్ నియోజకవర్గం బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిలుకూరి మచ్చంధర్ రెడ్డి, మాజీ రైతు సమన్వయ అధ్యక్షులు కొంతం అంజిరెడ్డిలు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్, మాజీ బ్యాంక్ డైరెక్టర్ బొక్క ప్రభాకర్ రెడ్డి, బొక్క సంజీవ రెడ్డి, నాగరాజ్ ముదిరాజ్, మాజీ వార్డు సభ్యులు రహీముద్దీన్, ఉల్లి ఆంజనేయులు యాదవ్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ ఆశయాల మేరకు ముందుకు వెళుతాం

**మల్కాజిగిరిలో:** దేశ ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా పెంచటంతో పాటు దీర్ఘకాల మహిళా ప్రధానిగా పేద ప్రజల సంక్షేమానికి పాటుపడిన ఇందిరాగాంధీ ఆశయాల మేరకు ముందుకు వెళుతామని కాంగ్రెస్ నేతలు ముక్తకంఠంతో అన్నారు. నేరేడ్‌మెట్ చౌరాస్తాలో నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్‌కట్ చేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు చంద్రశేఖర్, గోకుల్, శీను, రాఘవన్, రాజు మహేష్, తదితరులు పాల్గొన్నారు.



**కూకట్‌పల్లిలో:** భారతదేశపు ఏకైక మహిళా ప్రధాన మంత్రి, భారత రత్న, ఉక్కు మహిళా ఇందిరా గాంధీ అని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంచార్జీ శేరి సతీష్‌రెడ్డి అన్నారు. ఎస్‌ఎస్‌ఆర్ క్యాంప్ ఆఫీస్‌లో శేరి సతీష్‌రెడ్డి ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరీభి హటావో అనే నినాదంతో దేశంలో పేదరిక నిర్మూలన కోసం పాటుపడిన ఇందిరమ్మ, శత్రు దేశాలను గడగలాడించారని అన్నారు. దేశ అభివృద్ధికి ఆమె చేసిన కృషి ఎంతో అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని ప్రవీణ్ కుమార్, దేవసహాయం రవి, ఏఎంసి డైరెక్టర్ ఫణీంద్ర, కొమ్ము బాబు, రామక్రిష్ణ రెడ్డి, శ్రీధర్ చారి, గిరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



**పరిగిలో:** ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు పరిగి పట్టణ కేంద్రంలో పరిగి ఎమ్మెలే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశపు మొట్టమొదటి మహిళా ప్రధాని, భారతరత్న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఇందిరమ్మ ఇండ్లు పేదలకు ఇవ్వడంలో అండగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సక్రమంగా గ్రామపంచాయతీ రికార్డుల నిర్వహణ

**ప్రజాపక్షం/యాచారం :** గ్రామ పంచాయతీ రికార్డులను పంచాయతీ కార్యదర్శులు సక్రమంగా నిర్వహించాలని మండల ఎంపిడిఒ రాధారాణి అన్నారు. మంగళవారం యాచారం మండల పరిధిలోని తాడిపర్తి గ్రామంలో గ్రామ పంచాయతీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామ పంచాయతీ రికార్డులను ఎప్పటి కప్పుడు రాయలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు ఇండ్లనిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



## నిధులు మంజూరు చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు వినతి

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బియన్ రెడ్డి నగర్ డివిజన్‌లో సమస్యలు పరిష్కారం కోసం, అభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్‌ను బుధవారం డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాలనీలకు అంతర్గత రోడ్ల నిర్మాణం, మరమ్మత్తులు, సిసి రోడ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. ఈ మేరకు కమిషనర్ సానుకులంగా స్పందించినట్లు కార్పొరేటర్ లచ్చిరెడ్డి తెలిపారు. డివిజన్‌లో ప్రతి సమస్యను పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు.



## 22న గీత పనివారల రాష్ట్ర సదస్సు

### బొమ్మగాని నాగభూషణం



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** గీత వృత్తి దారుల సమస్యల పరిష్కారానికి ఈనెల 22వ తేదీన బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించబోయే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని రాష్ట్ర గీత పనివారుల సంఘం సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం కోరారు. బుధవారం నాగోల్‌లో గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిర్వహించబోయే కార్యక్రమంలో ప్రతి గీత కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగోల్ సొసైటీ అధ్యక్షుడు రాజుగౌడ్, సీనియర్ నాయకులు కట్ట ఈశ్వరయ్యగౌడ్, వృత్తి సంఘాల రాష్ట్ర నాయకులు బొడ్డుపల్లి కృష్ణ, ఉడతల మల్లేష్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, కె.యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## అవసరాలకనుగుణంగా సౌకర్యాలు

### ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఆసుపత్రికి వచ్చే ప్రజలకు అవసరాలకు అనుగుణంగా మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా కృషి చేస్తామని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల అనారోగ్య పరంగా ఆసుపత్రికి ప్రతి నిత్యం దాదాపు 1200 మంది ఔట్ పేషంట్లు, ఈహెచ్‌ఎస్ 200 మంది, నెలకు దాదాపు 300 డెలివరీలలు చేయడం ఐతుందని అధికారులు గుర్తించినట్లు తన దృష్టికి రావడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు దామోదర్, జయమాల, రాజన్, అనిల్ కుమార్, వినయ్ కుమార్, బిఎన్‌రెడ్డి నగర్, వనస్థలిపురం డివిజన్ పార్టీఅధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, చింత రవికుమార్ గుప్తా, నాయకులు లగ్గొని శ్రీధర్ గౌడ్, మాధవరం నర్సింహారావు, ముద్దగోని సతీష్‌కుమార్ గౌడ్, పొగుల రాంబాబు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణీత సమయంలో చెరువుల సుందరీకరణ : ఎమ్మెల్యే గాంధీ



**ప్రజాపక్షం/మియాపూర్:** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న చెరువుల సుందరీకరణ,సంరక్షణ,అభివృద్ధి పనులపై బుధవారం వివేకానంద నగర్ లోని ఎమ్మెల్యే గాంధీ కార్యాలయంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్,,ఇరిగేషన్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే గాంధీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ చెరువుల సుందరీకరణ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, నిర్ణిత సమయంలో చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. పటేల్ చెరువు, గంగారాం పెద్ద చెరువుల సుందరీకరణ భాగంగా న్యాయ చిక్కులు ఉండడంతో కేసు కోర్టు పరిధిలో ఉండటం వల్ల, అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడిందన్నారు. టీడీఆర్ వంటి అంశాలు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూసి చెరువుల అభివృద్ధి పనులు త్వరితగతిన ప్రారంభించాలని అధికారులకు ఎమ్మెల్యే గాంధీ సూచించారు. చెరువులలో కలుషిత నీరు కలవకుండా చేపడుతున్న డ్రైనేజి వ్యవస్థ మళ్లింపు పనులు వేగం పెంచాలని, పనులు నాణ్యత ప్రమాణాల తో చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు ఈఈ మల్లేష్,డీఈ రాజశేఖర్, ఇఇ గులాం మహమ్మద్, ఏఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యరంగంలో మార్పులకు కృషి




**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** ఎస్ఐఎస్ సాఫ్ట్వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (సర్జికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్) ఎస్ఐఎస్ కు అను బంధ సంస్థ తనే 25వ వార్షికోత్స వేడుకలను మాదాపూర్ అయిలాబ్స్‌లోని కార్యలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐఎస్ సాఫ్ట్వేర్ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మెల్కియస్ మంగళం ఆంథోనీ విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో ఆవిష్కరణాత్మక సాఫ్ట్‌వేర్ పరిష్కారాలు అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నామని అంబులేటరీ సర్జరీ సెంటర్లు ఆసుపత్రులను మరింత స్మార్ట్‌గా చేయాడానికి సహాయపడుతున్నాయని తెలిపారు. భారతదేశంలోని నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణుల ప్రతిభను సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నాణ్యతలో వినియోగించిన తొలి ఆరోగ్య సాఫ్ట్‌వేర్‌సంస్థలో ఒకటిగా ఎస్ఐఎస్ సాఫ్ట్వేర్ ఇండియా ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా శస్త్రచికిత్స సేవలలో ముందజలో ఉన్న టెక్నాలజీ ప్రొవైడర్‌గా ఎదగడంలో ఎస్ఐఎస్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలోని 2,700 కు పైగా అంబులేటరీ సర్జరీ కేంద్రాలకు సేవలు అందిస్తున్నామని, 25 సంవత్సరాలు పూర్తి చేసుకొవడం అనేది మా బృందం నిబద్ధతకు నిదర్శనమన్నారు. హైద్రాబాద్ కార్యలయ సిబ్బంది నోయిడాలోని ఎస్ఐఎస్ రెవెన్యూ సైకిల్ సర్వీసెస్ కార్యలయ బృందం ఒకే వేదిక పైకి వచ్చాయని తెలిపారు. శస్త్రచికిత్స సేవలు అందించే మరింత సమర్థంగా అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

# ప్రజల మధ్య ఉంటూ పోరాడుతున్న సిపిఐ

### పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ

### మొయినాబాద్, గండిపేట, రాజేంద్రనగర్‌లలో బస్సుజాతా పర్యటన





**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సిపిఐ వందేళ్ల ఉత్సవాల ముగింపు సందర్భంగా ఖమ్మంలో ఈనెల 26న జరిగే భారి బహిరంగ సభకు భారీఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ పిలుపునిచ్చారు. చలో ఖమ్మం పేరుతో చేపట్టిన బస్సు జాత మంగళవారం ఉదయం మొయినాబాద్‌లో ప్రారంభమైజాత రాజేంద్ర నగర్ నియోజకవర్గంలోని గండీపేటలో చేరింది. గండిపేటలో బస్సు జాతాకు సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు, గండిపేట నాయకులు మల్లేష్, నరసింహారెడ్డి నాయకత్వంలో స్థానిక సిపిఐ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుండి నార్సింగి,బండ్లగూడ జాగీర్ మీదుగా రాజేంద్రనగర్ మండలానికి చేరింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో పశ్య పద్మ మాట్లాడుతూ అధికారం ఉన్నా లేకపోయినా ప్రజల కోసం, నిరంతరం ప్రజల మధ్య ఉండి పోరాడుతున్న ఏకైక పార్టీ సిపిఐ అని పేర్కొన్నారు. సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు, రాష్ట్ర నాయకుడు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ జిల్లాలో పేదలకు ఇండ్లు, స్థలాలు కావాలని చేవెళ్ల పట్టణంతోపాటు అబ్దుల్లాపూర్ మెట్టు ప్రాంతంలో రెండు చోట్ల గుడిసెలు వేయించి పేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించిన ఘనత సిపిఐది అని ఆయన తెలిపారు. జాతాకు నాయకత్వం వహిస్తున్న పశ్య పద్మతో పాటు ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లి ఖాదర్ వల్లి, రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి నరేందర్ ప్రసాద్, ప్రజానాట్యమండలి గాయకుడు ఉప్పలయ్యతోపాటు 15మంది పిఎన్‌ఎం కళాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మొయినాబాద్ మండల సిపిఐ కార్యదర్శి కె.శ్రీనివాస్, చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ కె.రామస్వామి, జిల్లా కార్యవర్గసభ్యుడు, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం, వడ్ల సత్యనారాయణ, మహిళా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, బికెఎం జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, రైతుసంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గీత, కార్మిక, నాయకుడు ఎం.సుధాకర్ గౌడ్, శంకర్పల్లి సిపిఐ కార్యదర్శి పి.సుధీర్‌తోపాటు గండిపేట, రాజేంద్ర నగర్ మండలాలకు సంబంధించిన నాయకులు,కార్యకర్తలు పాల్గొని బస్సు జాతకం రంగారెడ్డి జిల్లా నుండి ఘనంగా వీడ్కోలు పలికారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆర్‌కెపురం డివిజన్ రామకృష్ణాపురం కాలనీలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో కార్తీకమాస మహోత్సవాల్లో భాగం గా ఛైర్మన్ తల్లాటి రమేష్‌నేత ఆధ్వర్యంలో దుర్గామల్లేశ్వర స్వామి వార్ల శాంతి కళ్యాణోత్సవ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. వేడుకల్లో చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి ఉమా, కమిటీ సభ్యులు బొడ్డుపల్లి మహేందర్, సాయికుమార్, దుర్గప్రసాద్, మంచుకొండ శ్రీనివాస్, అన్నపూర్ణ, విజయలక్ష్మీ, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బాల్యవివాహాల నిర్మూలన మనందరి బాధ్యత

### అదనపు కలెక్టర్ శ్రీనివాస్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** బాల్యవివాహాలను నిర్మూలించడానికి అధికారులు బాధ్యతగా పనిచేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బాల్య వివాహల నిర్మూలన, జిల్లా శిశు సంరక్షణ సమితి సమావేశం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ నిర్వహించారు. జిల్లా శిశు సంరక్షణ సమితి బాల్య వివాహ ముక్త భారత్ సమావేశం విజయవంతంగా ముగిసింది. జిల్లా సంక్షేమ అధికారి ఎల్.శ్రీలత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా ప్రకటించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో గ్రామస్థాయి వరకు బాలల రక్షణ పటిష్ఠం చేయడం వంటి అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఆంగన్‌వాడీలు, ఆశలు, ఉపాధ్యాయులు, ఎస్‌హెచ్‌జిఎస్, మహిళా సమాఖ్యలు, ఎన్జీవోలు, చైల్డ్‌లైన్ (1098) వంటి సంఘాలు గ్రామస్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. సఖి, భరోసా, సిడబ్ల్యూసి, జెజెబి, లీడ్ బ్యాంక్, వికలాంగుల శాఖ, కార్మిక శాఖ, విద్యా శాఖ, ఆరోగ్య శాఖ వంటి అన్ని సదస్సుల్లో బాల్యవివాహ నిరోధం బాలల హక్కుల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ విలేజ్, మండల్ కార్యక్రమాన్ని అమలు చేసే ప్రతిపాదనపై చర్చించారు. బాల్యవివాహ రహిత జిల్లాగా రంగారెడ్డి జిల్లాను సాధించేందుకు అన్ని శాఖలు సమగ్రంగా పని చేసి, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, గ్రామస్థాయి కమిటీల నెలసరి సమీక్షలు, హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్స్, హై రిస్క్ కుటుంబాల నిరంతర పర్యవేక్షలాంటివి కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. పోలీస్, ఆరోగ్య, విద్య, కార్మిక, మహిళా సమాఖ్య, సఖి, భరోసా, చైల్డ్‌లైన్, ఎన్జీవోలు, మండల, గ్రామ శిశు రక్షణ కమిటీల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.




# సివిల్ రైట్స్ డేను తప్పనిసరిగా నిర్వహించాలి

### బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** పరువు హత్యలు జరగకుండా ఉండాలంటే సివిల్ రైట్స్ డేను ప్రతి నెల చివరి వారంలో తప్పనిసరి నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బికెఎంయు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిబుద్దుల జంగయ్య కోరారు. బుధవారం షాద్‌నగర్ ఆర్‌డిఓ సరితకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ 15ఏళ్ల క్రితం గ్రామాల్లో కుల వివక్షత, అంటరానితనం రూపుమాపడానికి మండల తహసీల్దార్, ఎస్‌ఐతోపాటు మిగత అధికారులు ప్రతినెల చివరి వారంలో ఒక గ్రామాన్ని ఎంచుకొని సందర్శించే వారని గుర్తు చేశారు. అంటరానితనంపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేవారని, ఆలయ ప్రవేశాలు చేయించడంతోపాటు సహా పంక్తి భోజనాలు జరిగేదని వివరించారు. అంటరాని తనంపై అవగాహన లేకపోవడంతోనే ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామంలో దళిత యువకుడు రాజశేఖర్‌ను హత్య చేశారన్నారు. ప్రజలకు కులమతాలపై, కుల వివక్ష, అంటరానితనంపై రాజ్యాంగంలో ఉన్న చట్టాలపై అవగాహన కల్పించి చైతన్య పరిచేందుకు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేసి సమగ్రమైన ఒక చట్టాన్ని తీసుకురావాలని, ప్రతి నెల చివరి వారంలో సివిల్ రైట్స్ డేను నిర్వహించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బికెఎంయు జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లేల వెంకటన్న, సహాయ కార్యదర్శి రమేష్ యాదవ్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.పవన్ చౌహాన్, సిపిఐ కొందుర్గు మండల కార్యదర్శి నర్సింహా, రాజు నాయక్, వీరేశం, పి.మాణెయ్య తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు హెల్త్, అక్రిడిటేషన్ కార్డులు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

### మంత్రి శ్రీధర్‌బాబుకు రంగారెడ్డి జర్నలిస్టుల వినతి

**ప్రజాపక్షం/శంకర్ పల్లి:** రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు హెల్త్ కార్డు, అక్రిడిటేషన్ కార్డు , ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని టియుడబ్ల్యుజె రంగారెడ్డి జిల్లా శాఖ డిమాండ్ చేసింది. రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా నేతృత్వంలో బుధవారం మణికొండలో మంత్రి శ్రీధర్‌బాబు, మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ లకు వినతిపత్రం అందజేశారు. జిల్లా పరిధిలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాలో ఎన్నో సంవత్సరాలుగా పని చేస్తున్న జర్నలిస్టులు సామాజిక సమస్యలు, ప్రభుత్వ పథకాలు,ప్రజల సమస్యలు,అభివృద్ధి కార్యక్రమాలు, అత్యవసర పరిస్థితులు వంటి అంశాలను ఎల్లప్పుడూ ముందుండి ప్రజలకు చేరవేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా జర్నలిస్టులకు హెల్త్ కార్డ్ అమలు అయ్యేలా చూడాలని విన్నపించారు. ఇటీవలే షాబాద్ మండలానికి చెందిన రిపోర్టర్ రాములు గుండె పోటుతో మృతి చెందారు. వారి కుటుంబానికి ప్రభుత్వం సహాయం అందించాలని కోరారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా దాడుల నివారణ కమిటీ సభ్యులు భీమయ్య, సీనియర్ నేతలు సూర్యనారాయణ, రాజేందర్‌రెడ్డి, రాజు, విష్ణుల, రాము, శేఖర్‌రెడ్డి, నరేందర్, బాలు, లక్ష్మినారాయణ, ఎం విజయ్, తదితరులు ఉన్నారు



## అయ్యప్పస్వాములు అన్నప్రసాద వితరణ

**ప్రజాపక్షం/కేశంపేట:** భక్తిశ్రద్దలతో అయ్యప్పస్వామికి మాజీ జడ్పిటిసి సభ్యుడు పల్లె నర్సింగ్‌రావు గిరిజ కుటుంబ సమేతంగా పూజలు చేశారు. బుధవారం కేశంపేట మండల కేంద్రంలోని దవళగిరి వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహించి స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కేశంపేట మాజీ జడ్పిటిసి సభ్యుడు పల్లె నర్సింగ్‌రావు జన్మదినం సందర్భంగా అయ్యప్ప స్వాములకు అన్నదాన వితరన కార్యక్రమాన్ని నిర్వహించి స్వామివారి అశీస్సులు తీసుకున్నారు. అయ్యప్పస్వామి నామస్మరణతో ఈ ప్రాంతం ఒక్కసారిగా మారుమ్రోగిపోయింది. అయ్యప్పస్వామిని స్మరించుకుంటే అంతా శుభం జరుగుతుందని భక్తుల ఫ్రగాడ విశ్వాసం. ఈ పూజా కార్యక్రమంలో పల్లె సాయిసుమంత్, అయ్యప్పస్వాములు తిరుమలయ్య గౌడ్, రమణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి, నక్క గోపాల్, యుగేందర్‌లు పాల్గొన్నారు.



# విప్లవాత్మకమైన మార్పుల ఘనత ఇందిరాగాంధీదే

### ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** దేశ తొలి మహిళా ప్రధానిగా ఇందిరాగాంధీ దేశంలో అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ వివరించారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కేశంపేట రోడ్డులో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరాగాంధీ బ్యాంకులను జాతీయకరణ, జమీందారీ వ్యవస్థను రద్దు, గరీబ్ హఠావో వంటి అనేక సంక్షేమ పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, రఘునాయక్, దంగు శ్రీనివాస్, బస్వం, బాల్‌రాజ్‌గౌడ్, బచ్చలి నరేష్, దిలీప్, లింగారెడ్డిగూడ అశోక్, లక్ష్మణ్, మాధవులు, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

**శంకర్‌పల్లి:** దేశం కోసం సర్వస్వం ధారపోసిన మహనీయురాలని మాజీ ప్రధాని ఇందిరా గాంధీ అని రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీ జ్యోతి భీమ్ భరత్ అన్నారు. బుధవారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా శంకర్‌పల్లి మండల ప్రైమరీ స్కూల్,జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్ పల్లి మండలం ప్రాథమిక పాఠశాల విద్యార్థినిలకు బ్లాంకెట్స్, హైస్కూల్ విద్యార్థినీలకు సానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, బద్దం చిన్న కృష్ణరెడ్డి, శివలింగం, నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రమ్య పాల్గొన్నారు.

**కేశంపేట:** ఇందిరాగాంధీ సేవలను ప్రతిఒక్కరు స్మరించుకోవాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం ముందు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు భాస్కర్‌గౌడ్, కరుణాకర్, తాలుకా అధ్యక్షుడు పిట్టల రజిత, అనసూయమ్మ, నాయకులు లక్ష్మయ్య, నర్సింలు, కోడూరి రాములు, తుమ్మల గోపాల్, గ్యార సురేష్, ప్రకాష్ గౌడ్, రావుల పెంటయ్య, ఎండి ఆమేర్, నాగిళ్ల భాస్కర్, కోడూరి నరసింహా పాల్గొన్నారు.

**సరూర్‌నగర్ :** పేదరిక నిర్మూలన కోసం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఎనలేని కృషి చేశారని గడ్డిఅన్నారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బద్దుల వేణుగోపాల్‌యాదవ్ కొనియాడారు. బుధవారం దిల్‌షుఖ్‌నగర్ రాజీవ్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఇందిరా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, శశిధర్‌రెడ్డి, సునీల్‌బాబు, వేణు, గణేష్ నాయక్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.








# క్రీడ

# వెస్టిండీస్ బ్యాటర్‌కు అరుదైన రికార్డు..

## క్రికెట్ చరిత్రలో తొలిసారి



వెస్టిండీస్ కెప్టెన్, వికెట్‌కీపర్ షైయ్ హోప్ క్రికెట్ చరిత్రలోనే సరికొత్త రికార్డు సృష్టించాడు. ప్రస్తుతం టెస్టు హోదా కలిగిన అన్ని జట్లపై అంతర్జాతీయ క్రికెట్‌లో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా అవతరించాడు. బుధవారం న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో హోప్ (109; 69 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ చేసి ఈ ఘనత సాధించాడు. కివీస్‌పై అతను శతకం చేయడం ఇదే తొలిసారి. 32 ఏళ్ల షైయ్ హోప్.. ఇప్పటివరకు టెస్టుల్లో ఇంగ్లాండ్‌పై రెండు, భారత్‌పై ఒక సెంచరీ చేశాడు. వన్డేల్లో అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్ భారత్, పాకిస్థాన్, సౌతాఫ్రికా, శ్రీలంక, జింబాబ్వే ఒక్కో సెంచరీ చేశాడు. టీ20ల్లో ఇదే ఏడాది ఆస్ట్రేలియాపై ఓ శతకం బాదాడు. తాజాగా వన్డేల్లో న్యూజిలాండ్‌పై మూడంకెల స్కోరు సాధించాడు.

ఇక, మ్యాచ్ విషయానికొస్తే వర్షం కారణంగా ఆటను 34 ఓవర్లకు కుదించగా.. న్యూజిలాండ్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత విండీస్ 9 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని కివీస్.. మూడు బంతులు మిగిలుండగానే ఛేదించింది. డేవాన్ కాన్వే (90; 84 బంతుల్లో); రచిన్ రవీంద్ర (56; 46 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపులు మెరిపించారు. టామ్ లాథమ్ (39*; 29 బంతుల్లో), మిచెల్ శాంట్నర్ (34*; 15 బంతుల్లో) చివర్లో దూకుడుగా ఆడి జట్టును గెలిపించారు.

## దక్షిణాఫ్రికా-'ఎ'తో మూడో వన్డే..

## ఇండియా-'ఎ' ఓటమి




దక్షిణాఫ్రికాఎతో మూడు అనధికార వన్డే మ్యాచ్‌ల సిరీస్‌ను ఇండియాఎ.. 21తో కైవసం చేసుకుంది. బుధవారం జరిగిన మూడో అనధికార వన్డేలో ఇండియాఎ 73 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికాఎ 6 వికెట్లు కోల్పోయి 325 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో ఇండియా–ఎ 252 పరుగులకు ఆలౌటైంది. ఆయుష్ బదోని (66; 66 బంతుల్లో 8 ఫోర్లు), ఇషాన్ కిషన్ (53; 67 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మాత్రమే రాణిచారు. రుతురాజ్ గైక్వాడ్ (25), అభిషేక్ శర్మ (11), తిలక్ వర్మ (11), రియాన్ పరాగ్ (17) నిరాశపర్చారు. చివర్లో టెయిలెండర్లు ప్రసిద్ధ్ కృష్ణ (23), మానవ్ సుతార్ (23) పోరాడినా ఫలితం లేకపోయింది. తొలుత సఫారీ జట్టు బ్యాటర్లలో ఓపెనర్లు లువాన్ డ్రే ప్రిటోరియస్ (123; 98 బంతుల్లో, 9 ఫోర్లు, 6 సిక్స్‌లు), రివాల్డో మూన్సామి (107; 130 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకాలు బాదారు. ఈ జోడీ తొలి వికెట్‌కు రికార్డుస్థాయిలో 241 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. డెలానో పాట్జీటర్ (30*) పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో ఖలీల్ అహ్మద్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణాతలో రెండు వికెట్లు తీశారు.

## ఐసిసి అండర్-19 వరల్డ్ కప్

# షెడ్యూల్ విడుదల

### వేర్వేరు గ్రూపుల్లో భారత్, -పాక్




అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ వచ్చే అండర్–19 ప్రపంచ కప్ షెడ్యూల్‌ను బుధవారం ప్రకటించింది. ఈ టోర్నమెంట్ జనవరి 15 నుంచి ఫిబ్రవరి 6 వరకు జింబాబ్వే–నమీబియా వేదికగా జరుగన్నది. ఈ టోర్నీలో 16 జట్లు పాల్గొంటాయి. ఫైనల్‌తో సహా మొత్తం 41 మ్యాచ్‌లు జరుగుతాయి. ఆసక్తికరమైన విషయం ఏంటంటే ఈ సారి భారత్–పాకిస్తాన్ మ్యాచ్‌ను చూడలేం. రెండు వేర్వురు గ్రూప్స్‌లో ఉన్నాయి. అండర్–19 ప్రపంచ కప్‌లో నాలుగు గ్రూపులు ఉంటాయి. ఇందులో నాలుగు జట్లు చొప్పున ఉంటాయి. గ్రూప్ దశ తర్వాత సూపర్ సిక్స్.. అందులో నుంచి నాలుగు జట్లు సెమీ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఫైనల్ మ్యాచ్ హరారేలో జరుగుతుంది. టోర్నీలో తొలి మ్యాచ్‌ను భారత్‌యూఎస్‌ఏ మధ్య జరుగుతుంది. రెండో మ్యాచ్ జింబాబ్వే–స్కాట్లాండ్‌తో తలపడుతుంది. టాంజానియా తొలిసారిగా వరల్డ్ కప్ ఆడబోతున్నది. మొదటి మ్యాచ్‌ను వెస్టిండిస్‌తో ఆడుతుంది. అండర్–19 ప్రపంచ కప్ మ్యాచ్‌లు హరారే స్పోర్ట్స్ క్లబ్, తకాషింగా స్పోర్ట్స్ క్లబ్, జింబాబ్వేలోని క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్‌తో సహా ఐదు వేదికల్లో జరుగుగుతాయి. నమీబియాలో నమీబియా క్రికెట్ గ్రౌండ్ హెచ్‌పీ ఓవల్‌లో వరల్ క్లబ్‌లో మ్యాచులు జరుగుతాయి. గ్రూప్–'ఏ'లో భారత్, యూఎస్ఏ, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ ఉన్నాయి. గ్రూప్–'బీ'లో జింబాబ్వే, పాక్తిస్తాన్, ఇంగ్లాండ్, స్కాట్లాండ్.. గ్రూప్–'సీ'లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా, ఐర్లాండ్, జపాన్, శ్రీలంక జట్లు ఉన్నాయి. గ్రూప్–'డీ'లో టాంజానియా, వెస్టిండిస్, ఆఫ్ఘనిస్తాన్, దక్షిణాఫ్రికా ఉన్నాయి. ఐసిసి వెబ్‌సైట్‌లో టోర్నమెంట్ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ టోర్నమెంట్‌లో టాంజానియా అరంగేట్రం చేస్తుండగా.. జపాన్ 2020 తర్వాత మళ్లీ టోర్నీలో అడుగుపడుతున్నది. భారత్ తొలి మ్యాచ్‌ను 15న అమెరికాతో, 17న బంగ్లాదేశ్‌తో, జనవరి 24న న్యూజిలాండ్‌తో తలపడుతుంది. భారత్ మ్యాచులన్నీ బులవాయో వేదికగా జరుగుతాయి. మొదటి రౌండ్‌లో గ్రూప్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ సిక్స్‌లో ఆడుతాయి. ఇందులో ఆరు జట్లను రెండు గ్రూపులుగా విడిపోతాయి.

# ఫోకస్ చరిత్ర





## 5వేల ఏళ్లకుపైగా..

# అదే కాలమానం!



ఆశ్చర్యం కలిగించినప్పటికీ, ఒకే కాలమాన్ని 5 వేల సంవత్సరాలకుపైగా మనం ఉపయోగిస్తునే ఉన్నాం. సుమేరియన్లు ఈ కాలమానాన్ని ఆవిష్కరించినప్పుడు వారి వద్ద ఎలాంటి గణన పరికరాలు లేవు. కేవలం ఆకాశం చూసి, అధ్యయనం చేసి అసాధారణ ఆవిష్కరణ చేశారు. దానినే మని ఇప్పటికీ అనుసరిస్తున్నాం. ఒక గంటను 60 నిమిషాలుగా, ఒక రోజును 24 గంటలుగా వారే విభజించారు. 10 గుణకాలు (దశాంశం) లేదా 12 గుణకాలు (ద్వాదశం) కాకుండా 60ని (సెక్సాజెసిమల్ విధానం) ప్రామాణికంగా తీసుకోవడానికి ఒక గొప్ప తర్కం ఉంది. 1, 2, 3, 4, 5, 6, 10, 12, 15, 20, 30లతో సమానంగా భాగాలుగా విభజించవచ్చు కాబట్టి, 60ని వారు సంపూర్ణ సంఖ్యగా భావించారు. అంతేకాక, అప్పటి ఖగోళ శాస్త్రవేత్తలు ఒక సంవత్సరంలో 360 రోజులు ఉంటాయని నమ్మేవారు. 360లో ఆరు 60లు ఉంటాయి. ఈ కారణంగానే, ఆకాశ చలనాలను లెక్కపెట్టే సమయంలో 60 ఆధారంగా విభజించడం వారికి సహజం అయింది. సుమేరియన్ల సామ్రాజ్యం నేడు చరిత్ర పుటల్లో మాత్రమే కనిపిస్తుంది. కానీ వారు ఏర్పరిచిన కాల విభజన విధానం మాత్రం 5,000 ఏళ్లకు పైగా మనం మార్చకుండా ఉపయోగిస్తున్నాం. వారి మేధా శక్తి అసాధారణం, అపూర్వం, అనన్య సామాన్యం.






# శతాబ్దాల నాటి కలప రథం

రోమ్ నిర్మాణానికి సుమారు ఆరు శతాబ్దాలకు ముందు... ట్రోజన్ యుద్ధానికి, హోమర్ రచించిన ఇలియడ్‌కు కూడా వందలాది ఏళ్ళ క్రితం... అథెన్స్‌లోని పార్తెనాన్ ఆలయం నిర్మించడానికి దాదాపు వెయ్యేళ్ల కంటే పూర్వం తయారు చేసిన ఒక పురాతన రథం అందరినీ దిగ్భ్రాంతికి గురి చేస్తున్నది. దీనిని కలపతో తయారు చేయడం గమనార్హం. ఈ వైవిధ్యమైన ఫారో తుత్మోస్ IV అధికారిక రథం 3,400 సంవత్సరాలకు పైగా ప్రాచీన చరిత్ర కలిగి ఉంది. ఇది యునైటెడ్ ఈజిప్ట్ ఆధునిక నాగరికతను సూచించే అత్యద్భుతమైన కలప కళాఖండాలలో ఒకటి. తుత్మోస్ IV అంటే ఈజిప్ట్ 18వ రాజవంశంలోని ఎనిమిదవ ఫారో. క్రీస్తు పూర్వం 1401–1388 కాలానికి చెందినవాడు. నిరంతరం రథంపై తిరిగే రాజుగా ప్రసిద్ధుడు. సాధారణంగా కలపతో చేసిన వస్తువులు శతాబ్దాల తరబడి ఉండవు. కానీ, తుత్మోస్ IV రథం మాత్రం ఇప్పటికీ కాంతులీనుతునే ఉంది. అప్పటి కాలంలోనే అత్యంత శాస్త్రీయ పద్ధతుల్లో దీనిని నిర్మించడం విశేషం. దీనిని అత్యంత అరుదైన మెచ్యూర్డ్ కలపతో నిర్మించారు. దీనిని కేవలం యుద్ధ సమయంలో మాత్రమే కాదు.. రాజు తన దైనందిన ప్రయాణాలు, మతపరమైన ప్రదర్శనల్లో కూడా ఉపయోగించేవారు. 1903లో హోవార్డ్ కార్టర్ ఈ రథాన్నిగుర్తించి, ప్రఖ్యాత వ్యాలీ ఆఫ్ ది కింగ్స్‌లోనిదని నిర్ధారించారు. ఈ ప్రాచీన కలప కళాఖండం శిల్పకళ, ఆభరణాల రూపకల్పనఅత్యద్భుతంగా ఉంది. ఈ కాలంలో కలప అంత దీర్ఘకాలం నిలబడడం అరుదు. అందుకే తుత్మోస్ IV అధికారిక రథం ప్రపంచంలోని మొట్టమొదటి, అత్యంత నిలకడైన కలపగా గుర్తింపు సంపాదించింది. అరుదైన అవశేషంగా కీర్తించబడుతున్నది.

# గత వైభవ చిహ్నాలు..



ప్రస్తుత గ్రీస్‌లోని డెల్ఫీ ప్రాంతం, థోలోస్‌లో కొలువు తీరిన గతకాల వైభవ చిహ్నాలు ఈ నిర్మాణాలు. ఇది పార్నాసస్ పర్వత శ్రేణులకు ఆనుకుని ఉన్న, క్రీస్తు పూర్వం 4వ శతాబ్దానికి చెందిన సుందరమైన నిర్మాణ వైభవం. ఈ వృత్తాకార ఆలయం 'అతీనా ప్రోనైయా'లోని భాగం. దీనిలో బయటకు ఇరవై డోరిక్ తీగలు, లోపల పది కోరింతియన్ తీగలు ఉండేవి. ఇవి గ్రీకు శిల్పశైలిలోని శైలీయ సమన్వయానికి ఉదాహరణ. ఈ నిర్మాణం ఖచ్చితంగా ఎందుకోసం జరిగిందనే విషయంపై ఇప్పటికీ స్పష్టత లేదు. ఐతే, ఇది భూదేవతకు (చోనిక్ దేవత) అర్పించిన ముఖ్యమైన ఆధ్యాత్మిక స్థలంగా భావిస్తారు. దీని పరిపూర్ణ సమమితులు, మృదువైన నిష్పత్తులు గ్రీకు శిల్పకళలో అత్యున్నత నైపుణ్యాలను ప్రతిబింబిస్తాయి. నేడు, అసలు శిలలలో కేవలం మూడే నిలిచి ఉన్నాయి. అయినప్పటికీ అవి పురాతన డెల్ఫీ సంప్రదాయాన్ని, ఆ నాటి ఆధ్యాత్మిక శక్తిని ఇప్పటికీ గుర్తు చేస్తూనే ఉన్నాయి. గ్రీసు గొప్ప సాంస్కృతిక, శిల్ప కలా వారసత్వానికి థోలోస్ ప్రతీక.

# కగార్ ఎన్‌కౌంటర్‌లపై న్యాయవిచారణ

### సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించాలి
### మావోయిస్టులు పంథా మార్చుకోవాలి
### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్



**ప్రజాపక్షం/హనుమకొండ :** కగార్ ఆపరేషన్ పేరుతో కేంద్రప్రభుత్వం జరుపుతున్న మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌ల అన్నింటిపైనా న్యాయ విచారణ జరిపించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్‌తో కలిసి తక్కళ్లపల్లి మాట్లాడారు. కగార్ ఎన్‌కౌంటర్‌లపై అనేక అనుమానాలు ఉన్నాయని, మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌లపై స్వయంగా సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. మావోయిస్టులను కోర్టుకు సరెండర్ చేయకుండా టెర్రరిస్టుల మాదిరిగా చంపడం సరికాదన్నారు. అలాగే మావోయిస్టులు కూడా పునరాలోచన చేయాలని, తమ పంథా మార్చుకోవాలని కోరారు. తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం సాధ్యం కాదని ఇప్పటికే కొందరు బయటికి వచ్చారని, మిగిలిన వారు కూడా తమ పంథా మార్చుకొని కమ్యూనిస్టులతో కలిసి రావాలని కోరారు. దేశంలో బిజెపి ప్రభుత్వం నరహంతక పాలన సాగిస్తున్నదని, కేవలం కార్పొరేట్, పెట్టుబడిదారీ శక్తుల కోసమే పనిచేస్తున్నదన్నారు. ఇటీవల ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసికి చెందిన రూ.33వేల కోట్లను ఆదానీ గ్రూపులో పెట్టుబడి పెట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పాలన చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా పోరాడేందుకు వామపక్ష ప్రజాతంత్ర శక్తులు బలపడాల న్నారు. అందుకు మావోయిస్టులు కలిసి రావాలని కోరారు. బిసి రిజర్వేషన్లపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అఖిలపక్షాలను ముఖ్యమంత్రి ఢిల్లీకి తీసుకెళ్లాలని సూచించారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్ ఇందుకు బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ మాట్లాడుతూ వచ్చే డిసెంబర్ 26 నాటికి సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ బస్సు జాతాలను నిర్వహిస్తున్నదన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరి వందేళ్ల సభకు వేలాదిగా తరలి రావాలని ప్రజలను కోరారు. మారిన కాలంలో బూర్జువా పార్టీ లు నోట్లతో ఓట్లు కొనుగోలు చేస్తూ గద్దె నెక్కుతున్నాయని, ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా చట్టసభలలో, బయటా సిపిఐ తన గొంతు వినిపి పేదల పక్షాన నిలుస్తుందన్నారు. ఎర్రజెండా పార్టీలన్నీ ఏకమై బూర్జువా పార్టీలకు వ్యతిరేకంగా నిలబడాలని, అందుకు ప్రజలు కమ్యూనిస్టులతో కలిసి నడువాలని కోరారు. సమావేశంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యదర్శి సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మారుపాక అనిల్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మ ణ్, ఎన్.అశోక్, స్టాలిన్, మునిగాల బిక్షపతి, జక్కు రాజుగౌడ్, ఎదునూరి వెంకట్రాజం, కొట్టెపాక రవి, మోతె లింగారెడ్డి, మాలోతు శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ గుమ్మంలో శతాబ్ది సంబురం

### 21న జిల్లాకు శతాబ్ది ఉత్సవ ప్రచార జాతా
### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు
### బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలని డిమాండ్



**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజా ఉద్యమాల గుమ్మం ఖమ్మంలో శతాబ్ది ఉత్సవ ముగింపు సంబురాలు జరుగుతున్నాయని, ఇవి కమ్యూనిస్టు పార్టీ పురోభివృద్ధికి, భవిష్యత్తు ప్రజా ఉద్యమాలకు దోహదం కానున్నాయని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. సభలకు సంబంధించి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఖమ్మం నగర సమితి సమావేశం బుధవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఎస్‌కె జానిమియా అధ్యక్షతన జరిగింది. సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ లక్షలాది మంది ప్రజలను కదిలించేందుకు శ్రేణులు పని చేస్తున్నాయని, ఇంటింటికి సభ సందేశాన్ని అందజేస్తున్నామన్నారు. దేశంలో జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లను వెంటనే నిలిపి వేయాలని ఆయన డిమాండ్ చేశారు. దశాబ్దాల పాటు ప్రజల కొరకు పని చేసిన వారిని పట్టుకొచ్చి కాల్చి చంపుతున్నారని హేమంతరావు ఆరోపించారు. మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్ర ప్రభుత్వం హింసా పూరిత చర్యలకు పాల్పడి మానవత్వాన్ని మంటగలుపుతుందన్నారు. ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారు దొరికితే విచారించి చట్టం ద్వారా శిక్షించాలి, కానీ అడవుల్లోకి తీసుకెళ్లి ఎన్‌కౌంటర్ల పేరుతో హతమార్చే హక్కు ఎవరిచ్చారని హేమంతరావు ప్రశ్నించారు. కార్పొరేట్ల కనుసన్నల్లో మోడీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రకృతి సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే నెపంతో అడవుల నుంచి మావోయిస్టులను తరిమేస్తున్నారన్నారు. మడివి హిడ్మా సహా ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లన్నింటిపైన న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అపరిపక్వతతో కొందరు బిజెపి నాయకులు రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారని, సమాజం పట్ల మావోయిస్టు ఉద్యమం పట్ల అవగాహన లేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. ఎర్రజెండాలను తుల నాడే ప్రయత్నం చేయడం మానుకోకపోతే ప్రజలే తగు రీతిలో బుద్ధి చెబుతారని ఆయన బాగం హెచ్చరించారు.

**21న ప్రచార జాతా :** ఈనెల 21న సిపిఐ ప్రచార జాతా ఖమ్మంకు రానుందని హేమంతరావు తెలిపారు. ఈనెల 15న మహబూబ్ నగర్ జిల్లా గద్వాల్‌లో ప్రారంభమైన రెండవ జాతా, నవంబర్ 21న ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోకి ప్రవేశించనుందన్నారు. నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం, వివి పాలెం, కొణిజర్ల, వైరా, తల్లాడ, ఏన్కూరు మీదుగా కొత్తగూడెం జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. దారి పొడవునా ప్రధాన కేంద్రాల్లో సభలు జరుగుతాయని హేమంతరావు తెలిపారు. ఈ జాతాకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనర్సింహా నేతృత్వం వహిస్తున్నారని ఆయన తెలిపారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, పోటు కళావతి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, వరదా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# 'మధ్యాహ్న' కార్మికుల సమ్మెకు మద్దతు

### సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** తమ డిమాండ్లను పరిష్కరించాలని గత నాలుగు రోజులు గా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు పెద్దపల్లి సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. బుధవారం స్థానిక అమరవీరుల స్థూపం వద్ద సమ్మె నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు ఆయన సంఘీభావం తెలిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన మధ్యాహ్న భోజన కార్మికుల బతుకులు మారడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం లోనైనా వారికి న్యాయం జరుగుతుందని ఆశపడ్డారన్నారు. పొద్దంతా కష్టపడిన మధ్యాహ్న భోజన కార్మికులకు తగినంత వేతనం రావడం లేదని, తద్వారా వారు ఆర్థికంగా చితికి పోతున్నారని, మార్కెట్లో పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూలో ధరలు చెల్లించడం లేదని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా బిల్లులు చెల్లించాలని, పాత బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, నెలకు గౌరవ వేతనం రూ.పదివేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పూసాల రమేష్, పాఠకులకు కళావతి, జక్కుల రాజేశ్వరి, ఎండి సాలేహా, మేకల యశోద, లంక విజయ మరియు మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.



# 22న భద్రాచలంలో బస్సు జాతా ముగింపు సభ



సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాచలం :** సిపిఐ శతాబ్ధి ఉత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా జోడ్‌ఘాట్‌లో ప్రారంభమైన బస్సు జాత ఈనెల 22న భద్రాచలంలో జరిగే బహిరంగ సభతో ముగుస్తుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతీ కార్యకర్తల సైనికుల్లా పనిచేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ బస్సు జాత ఈనెల 21న జిల్లాలోని ఇల్లెందు నియోజకవర్గంలోనికి ప్రవేశిస్తుందని, ఇల్లెందు పట్టణంలో భారీర్యాలీతోపాటు బహిరంగ సభ ఉంటుందన్నారు. టేకులపల్లి మీదుగా పాల్వంచలోనికి ప్రవేశిస్తుందని, పాల్వంచలో మోటార్‌సైకిల్ ర్యాలీ, సభ ఉంటుందన్నారు. అదే రోజు బూర్గంపాడు మండలంలోనికి ప్రవేశించి ఐటిసి పిఎస్‌పిడి అతిధి గృహంలో రాత్రిబస చేస్తారని తెలిపారు. 22న ఉదయం సారపాక సెంటర్‌లో సభ ఉంటుందని, గోదావరి బ్రిడ్జీ మీదుగా భద్రాచలం పట్టంలోకి ప్రవేశిస్తుందని చెప్పారు. భద్రాచలం పట్టణ ప్రవేశ ద్వారం వద్ద పెద్దఎత్తున బస్సు జాతాకు స్వాగతం పలుకుతారని, అక్కడ్నుంచి వందలాది మోటార్ సైకిళ్లతో పట్టణ పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహిస్తారని, అంబేద్కర్ సెంటర్‌లోని డా.బిఆర్ అంబేద్కర్, విప్లవ వీరుల విగ్రహాలకు పూల మాలలు వేసిన అనంతరం అక్కడే భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి పార్టీశ్రేణులు కృషి చేయాలన్నారు. ప్రచార జాతాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు, కలవేన శంకర్, కలకోట కాంతయ్య, మణికంఠ రెడ్డి, పల్లె నర్సింహా పాల్గొంటారన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, మువ్వా వెంకటేశ్వరరావు, జిల్లా సమితి సభ్యులు రామిరెడ్డి, సబ్కా నాగేశ్వరరావు, పేరాల శ్రీనివాస్, సాధనపల్లి సతీష్, నిమ్మల రాంబాబు, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# ఎఐటియుసి పోరాటంతో

# భూగర్భ గనుల జీవితకాలం పెంపు : వాసిరెడ్డి

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** కార్మికుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసిన ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఎఐటియుసి కృషి ఫలితంగానే మూసివేయాలని భావించిన భూగర్భ గనుల జీవిత కాలాన్ని పెంచడానికి యాజమాన్యాన్ని ఒప్పించగలిగామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. బుధవారం ఏరియాలోని ఎస్‌ఆర్‌పి 1 గనిలో ఏర్పాటు చేసిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం మార్చి నాటికి మూసివేయాలని యాజమాన్యం ప్రకటించిన ఎస్‌ఆర్‌పి 1 గనిలో 1వ సీమ్ ఓపెన్ చేయడం వల్ల గని జీవితకాలం మరో 5 సంవత్సరాలు పెరగబోతుందని తెలిపారు. అలాగే ఆర్‌కె న్యూటెక్ గని జీవిత కాలాన్ని కూడా పెంచడం జరిగిందన్నారు. ప్రమాదవశాత్తు కార్మికుడు చనిపోతే కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చేందుకు, హైదరాబాద్‌లో కార్పొరేట్ ఆసుపత్రి నిర్మాణానికి యాజమాన్యాన్ని ఒప్పించడం జరిగిందన్నారు. ఎటువంటి అవకతవకలు లేకుండా సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టులను ఇప్పించడం జరిగిందని చెప్పారు. పెర్క్స్‌పై పడే ఇన్కమ్ టాక్స్ సంస్థ చెల్లించే విషయంపై రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కొరకు లేఖ రాసినట్లు యాజమాన్యం తెలిపిందన్నారు. మెడికల్ బోర్డు ఏర్పాటుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రధానకార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, ముష్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె. బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## నిరుపేదల అభ్యున్నతికి పాటుపడిన ఉక్కు మహిళ ఇందిరాగాంధీ

**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్ :** భారతదేశపు మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ దేశ అభివృద్ధి కోసం ఎన్నో సంస్కరణలు చేపట్టి నిరుపేదల అభ్యున్నతికి వెన్ను దన్నుగా నిలిచి ఉక్కు మహిళగా పేరుగాంచారని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం వనపర్తి పట్టణం ఇందిరా పార్క్‌లో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఉదండాపూర్ నిర్వాసితులను ఆదుకోవాలని సిఎంను కలిసిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/జడ్చర్ల :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఉదండాపూర్ నిర్వాసితుల ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించిన ఫైల్‌ను రాబోయే కేబినెట్ మీటింగులో పెట్టి ఆమోదించాలని సిఎంను అనిరుధ్‌రెడ్డి కోరారు. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన తర్వాత కొంతమంది ఇంటి నిర్మాణానికి పునాదులు వేసుకోగా అవి ఇందిరమ్మ యాప్‌లో అప్‌లోడ్ కాకపోవడం వల్ల వారికి బిల్లులు ఆగిపోయాయని, ఈ సమస్యను ఎదుర్కొంటున్న వారి వివరాలను జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపడం జరిగిందని, ఇందిరమ్మ యాప్‌లో ఉన్న సాంకేతిక సమస్యలు తొలగించి ఆ బిల్లులను సత్వరమే క్లియర్ చేయాలని, రాజాపూర్ మండలం ఖానాపూర్ గ్రామంలో తన తాత దేశ్‌ముఖ్ పేరిట ఉన్న భూమిని రైతుల పేరిట మార్చడానికి ఇప్పటికే జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపారని, వాటిపై వెంటనే చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈ విషయంలో సిఎంతో పాటు రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందించారన్నారు.

## రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన బాల బాలికలు



**ప్రజాపక్షం/ మక్తల్ :** తెలంగాణ రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు బి. గోపాలం ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా టెన్నికాయిట్ (రింగ్ బాల్) అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న మక్తల్ శ్రీసత్యసాయి మందిరంలో బాల బాలికలకు జిల్లా స్థాయి టెన్నికాయిట్ ఎంపికలను నిర్వహించి క్రీడా ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి టెన్ని కాయిట్ పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. దీప తెలిపారు. నారాయణపేట జిల్లాలోని బాల బాలికలు వందమంది ఈ పోటీలలో పాల్గొన్నారని ఆమె తెలిపారు. ఈ ఎంపికలను టెనికైట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం ప్రారంభించారు. రాష్ట్రస్థాయి టెలికాయిట్ పోటీలకు ఎంపికైన బాల బాలికలు : సమత (కృష్ణవేణి) చరిత్ర, అశ్విని, పైజా, అనూష, వైష్ణవి, మంజుల, మాళవిక, (కేరళ స్కూల్) బిందు (ధన్వాడ), విశాల్, కార్తీక్, హరికృష్ణ ప్రసాద్, గౌతమ్, అజయ్, గురుచరణ్, ఎం.కార్తీక్ , శ్రీకాంత్, రామ్ చరణ్, రమేష్, వీరందరూ ఈనెల 20 నుండి 21 వరకు హనుమకొండలో జరుగు రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలలో పాల్గొనుటకు, ఈనెల 19 న తరలి వెళ్లినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.దీప తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవ సమితి నిర్వాహకులు బి. భాస్కర్, శుభోదయ రాములు, పీఈటీలు దామోదర్, వెంకటేష్, రాధమ్మ పాల్గొన్నారు.

## ఇసుక టిప్పర్ పట్టివేతలో బిగ్‌ట్విస్ట్

పలుశాఖల అధికారుల తీరుపై పలు విమర్శలు



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఇసుక టిప్పర్ పట్టివేతలో బిగ్‌ట్విస్ట్ చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బుధవారం నాగర్‌కర్నూల్ నుండి ఓ టిప్పర్ ఇసుక లోడుతో కల్వకుర్తి సమీపంలో గల తిరుపతి హైవే పక్క నుండి వెల్దండ వైపు వెళుతుంది. మార్గ మధ్యలో తిరుపతిహైవే బ్రిడ్జిపై టిప్పర్ రిపేరుకు గురైంది. సమాచారం తెలుసుకున్న స్థానిక విలేకరులు అక్కడికి చేరుకుని రెవెన్యూ, మైనింగ్, పోలీస్,ర వాణాశాఖల అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న అధికారులు ఇసుక టిప్పర్‌ను పరిశీలించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలించడమే కాకుండా రవాణా చేసేందుకు పూర్తి పత్రాలు కూడా సక్రమంగా లేవని అధికారులు నిర్ధారించినట్లు తెలిసింది. ఇంతవరకు బాగానే ఉన్నా అసలుకథ ఇక్కడే మలుపు తిరిగింది. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించాల్సిన అధికారులు ఆదిశగా ఆలోచించకుండా ఎవరికివారు అక్కడి నుండి మెల్లగా జారుకున్నారు. ఇదే అదునుగా భావించిన టిప్పర్ యజమాని మరమ్మతుల అనంతరం అక్కడి నుండి టిప్పర్‌ను తీసుకెళ్లడం గమనార్హం. అధికారులు టిప్పర్ యజమానితో కుమ్మక్కై గుట్టు చప్పుడు కాకుండా టిప్పర్‌ను అక్కడి నుండి వెళ్లిపోయేలా సహకరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై తహసీల్దార్‌కు ఫోన్‌లో సమాచారం అందిస్తే తమకు సంబంధం లేదన్నట్లు దాటవేసే ప్రయత్నం చేయడం కొసమెరుపు.ఇట్టి విషయంపై అధికారులను ఫోన్‌లో సంప్రదించగా అధికారులు అందుబాటులోకి రాలేదు.

## ఇందిరాగాంధీ దూరపు ఆలోచనతో నేడు మనం అభివృద్ధిలో ఉన్నాం



**ప్రజాపక్షం/అచ్చంపేట :** ఉక్కు మహిళ, స్వర్గీయ మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ దేశంపై భవిష్యత్తు ప్రణాళికలో ఉన్నందునే మనం సుఖశాంతులతో అభివృద్ధి పథంలో జీవిస్తున్నామని రాష్ట్ర టిపిసిసి అధ్యక్షుడు , ఎమ్మె ల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆయనకు స్వాగ తం పలికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. అనంత రం ఎంపిడిఓ కార్యాలయంలోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలువే సి నివాళులర్పించారు. అనంతరం మహేష్‌కమార్ గౌడ్ మాట్లాడుతూ స్వా తంత్ర్యం వచ్చినప్పుడు దేశ ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్న సమయంలో పంచశీల సిద్ధాంతాలు 20సూత్రాల పథకంతో దేశ అభివృద్ధికి కృషిచేసినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ నేడు అట్టడుగువర్గాల నుంచి పేద అగ్రవర్ణాలు సైతం స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నారంటే అది ఇందిరాగాంధీ చలువే అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, ఉమామహేశ్వర చైర్మన్ మాధవరెడ్డితోపాటు పలువురు కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి జూపల్లికృష్ణారావు





**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులతో కలిసి సచివాలయం నుండి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల కలెక్టర్లు, మహిళా సమాఖ్య ప్రతినిధులతో కోటిమంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ నుండి రాష్ట్ర ఎక్సైజ్‌పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లికృష్ణారావు, జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కోటిమంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీని ప్రారంభించుకున్నాం, ఆడబిడ్డలకు సారె, చీర పెట్టడం తెలంగాణ సాంప్రదాయం ఇందులో భాగంగా ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలను పంచాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియకు సంబంధించి ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలి. నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాల్లో విడతలవారిగా ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టాలన్నారు. ఈవీడియోకాన్ఫరెన్స్ అనంతరం మహిళా సంఘాలతో మంత్రి జూపల్లికృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళలను సుస్థిర ఆర్థిక వ్యాపారస్తులను తయారు చేయాలని ఉద్దేశ్యంతో స్వయం సహాయక సంఘాల సభ్యులకు అనేక రకాల పథకాలను సమర్థవంతంగా అమలుచేస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళలు రూపాయి రూపాయి కష్టపడి కూడబెట్టిన డబ్బును అనవసర ఖర్చులకు పెట్టకుండా, అవసరం ఉన్నప్పుడు మాత్రమే ఉపయోగించాలి, అలాచేస్తే అప్పుల భారంలో పడకుండా ఉంటారని చెప్పారు. మహిళలు కూడబెట్టుకున్న సంపదలను పిల్లల చదువులపేరిట ప్రైవేట్ పాఠశాలలకు తన పిల్లలను చదివిస్తూ సంవత్సరానికి లక్ష రూపాయలవరకు ఖర్చు చేస్తున్నారని గ్రామంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో నిష్ణాతులైన ఉపాధ్యాయుల సమక్షంలో విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాలు గ్రామీణ మహిళలను చైతన్యపర్చి ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లల్నిచేర్చే విధంగా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, పిడి డిఆర్‌డిఎ చిన్న ఓబులేసు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, నాగర్‌కర్నూల్ జిల్లాలోని 20మండలాలకు చెందిన స్వయం సహాయక సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

### రాష్ట్రంలో సజావుగా ధాన్యం కొనుగోళ్లు

**వీపనగండ్ల :** ధాన్యం కొనుగోళ్లు రాష్ట్రంలో వేగంగా, సజావుగా కొనసాగుతున్నాయని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఉమ్మడి వీపనగండ్ల మండలంలోని అయ్యవారిపల్లి, కొప్పునూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి జూపల్లి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని అన్నారు. రైతులకు న్యాయమైన మద్దతు ధర, సమయానికి కొనుగోలు, పారదర్శక వ్యవస్థ అందించేందుకు ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ.2389/ సాధరణ రకానికి రూ.2369/ మద్దతు ధర కల్పిస్తుందని, సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తుందని చెప్పారు. రైతులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని, మధ్య దళారులను నమ్మిమోసపోవద్దని సూచించారు. కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, ప్రణాళిక బద్ధంగా ధాన్యం కొనుగోలు జరగాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కొప్పునూరు సింగల్ విండో చైర్మన్ బగ్గారి నరసింహారెడ్డి, మహిళా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, కొల్లాపూర్ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి తదితలు పాల్గొన్నారు.

## 'మహిళల ఉన్నతి తెలంగాణ ప్రగతి' పేరున చీరల పంపిణీ

జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** రాష్ట్ర, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో మహిళల ఉన్నతి తెలంగాణ ప్రగతి పేరున ఇందిర మహిళశక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బో యి అన్నారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుండి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , సహచర మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్ర ధాన కార్యదర్శి రామకృష్ణ రావులతో కలిసి ఇందిర మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్సు అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు అన్ని రకాలుగా అవకాశాలు కల్పిస్తున్నదన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఇందిరా మహిళ శక్తి చీరలను పంపిణీ చేసేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలన్నారు. ప్రతి గ్రామంలోని మహిళలకు చీరలు పంపిణీ జరగాలని అన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో అందరూ ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించాలని అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఐక్యతతో ఉండి వాటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఇందిర మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్పిసిఈఓ వెంకటరెడ్డి, జిల్లా పంచాయితీ అధికారిని నిఖిల, ఇతర జిల్లా అధికారులు, జిల్లా సమాఖ్య బాధ్యులు, పలువురు స్వయం సహాయక మహిళా సంఘాల అధ్యక్షులు హాజరయ్యారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపనుల్లో వెనకబడిన మండలాల అధికారులపై జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ సమావేశమందిరంలో అదనపు కలెక్టర్ దేవసహాయంతోకలిసి ఎంపిడిఓలు, గృహనిర్మాణశాఖ, ఎంపిఓలతో ఇందిరమ్మ ఇండ్లనిర్మాణాలు గ్రౌండింగ్‌పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై కలెక్టర్ పలువురు ఎంపిడిఓలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా నిర్మాణ పనులలో వెనకబడిన అధికారులపై మండిపడ్డారు. మంజూరుచేసిన ఇళ్లలో ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయి, ఎన్ని నిర్మాణ దశలో ఉన్నాయి వంటివివరాలను మండలాలు గ్రామాలవారిగా అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయడానికి , గ్రౌండింగ్ కాని ఇళ్లలో పనులు నవంబర్ 30లోగా ప్రారంభించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓలను ఆదేశించారు. పనుల పురోగతిపై నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్హులైన లబ్దిదారులకు మంజూరైన ఇండ్లను వెంటనే గ్రౌండింగ్‌చేసి ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను వేగంగా నమోదుచేయాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనులను గడువులోగా పూర్తిచేయాలని పూర్తి అయిన ఇండ్లకు ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు అయ్యేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు పూర్తయిన ఇండ్ల వివరాలు ఈనెలలో ప్రారంభంకానున్న ఇండ్ల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈసమావేశంలో అదనపు జిల్లా పరిషత్ సిఇఓ గోపాల్‌నాయక్, గృహనిర్మాణశాఖ అధికారి సంగప్ప, పిడిడిఆర్‌డిఎ చిన్న ఓబులేసు, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలన సమిష్టి బాధ్యత



**ప్రజాపక్షం/నారాయణపేట్:** జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలనకు అందరూ సమిష్టిగా కృషి చేసి బాల్య వివాహ రహిత జిల్లాగా నారాయణపేటను మార్చాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యంగా బాలల రక్షణ పట్ల, వారి విద్య, సంరక్షణ, ఎదుగుదల, జిల్లా ఆకృతిని ప్రతిబింబిచేలా రూపొందించిన లోగోను కలెక్టర్ తన ఛాంబర్‌లో బుధవారం ఆవిష్కరించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు అందరూ సహకరించాలని, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను క్షేత్ర స్థాయిలో అందరికీ అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, శ్రీను, ఆర్డీ రామ్ చందర్, డిప్యేటీ కలెక్టర్లు శ్రీరామ్ ప్రణీత్, ఫణి కుమార్, డిపిఆర్‌ఒ రషీద్, భగీరథ ఈ ఈ రంగా రావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీధర్, కోస్గి తహసిల్దార్ బక్క శ్రీనివాస్, జిల్లా బాలల సంరక్షణ అధికారిని కరిష్మా పాల్గొన్నారు.

### బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

జిల్లాలోని బాలల బంగారు భవిస్యత్తుకు బాటలు వేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో సంతకాల సేకరణ కార్యక్రమంల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా స్థానిక సంస్థ హాజరై స్ఫూర్తిదాయక అభిప్రాయంతో సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. బాలల హక్కుల సంరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డిప్యూటీ కలెక్టర్లు శ్రీరామ్ ప్రణీత్, ఫణి కుమార్, ఎస్.డి.సీ రాజేందర్ గౌడ్, మిషన్ భగీరథ ఈఈ రంగారావు, డిపిఆర్‌వో ఎం.ఏ. రషీద్, ఇతర శాఖల జిల్లా అధికారులు, డిసిపివో కరిష్మా, చైల్డ్ హెల్ప్ లైన్ సమన్వకర్త నర్సింహులు, జిల్లా బాలల సంరక్షణ సిబ్బంది తదితరులు ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి , షాదిముబారక్ చెక్కులపంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కల్వకుర్తి, చారగొండ మండలానికి చెందిన 67మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి , షాదిముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుండి పేదప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషిచేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డును అందించామని గుర్తుచేశారు. కల్వకుర్తిలో ఎందుకు వందపడకల ఆస్పత్రి నిర్మించలేదో ప్రజలకు చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వందపడకల ఆస్పత్రిని 150 పడకల ఆస్పత్రిగా రూ.46 కోట్లు మంజూరు చేశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యవ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టారని, విద్యతోనే కుటుంబాలు బాగుపడతాయన్నారు. మాదకద్రవ్యాలకు యువత బానిసకాకూడదని, తల్లిదండ్రులు కూడా పిల్లలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. రానున్న ఎన్నికల్లో సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, కౌన్సిలర్లు కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ మోదుగు పూర్ణజనార్దన్‌రెడ్డి, తహసీల్దార్ ఇబ్రహీం, నాయకులు ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## అవినీతిపరుల పేర్లను బయటపెట్టిన కవిత

ఎమ్మెల్యే మేఘారెడ్డి



**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్ :** బిఆర్‌ఎస్ పార్టీలో పెద్దపెద్ద అవినీతి తిమింగలాలు ఉన్నాయని స్వయాన కెసిఆర్ కూతురు కల్వకుంట్ల కవిత పేర్లు బయటపెట్టిన ఇప్పటివరకు తేలు కుట్టిన దొంగల్లాగా ఏ ఒక్కరు కూడా నోరు మెదపలేదని అలాంటి అవినీతి తిమింగలాలు నేడు ప్రజల మధ్యన నీతులు వల్లించడం సిగ్గుచేటని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వనపర్తి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి , షాది ముబారక్, సిఎంఆర్‌ఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉక్కు, మహిళ, భారత దేశపు తొలి మహిళా ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ దేశ అభివృద్ధి కోసం ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని ఆమె జయంతి సందర్భంగా మనమందరం ఇందిరాగాంధీ ఆశయ సాధనాల కోసం పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయంలో నిర్మించిన ప్రాజెక్టులకు నేడు కొందరు నాయకులు అక్కడక్కడ బొక్కలు పెట్టి తామే సాగునీరు అందిచామని గొప్పలు చెప్పుకుంటూ వారి పేర్లను మార్చుకోవడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కళాకారులకు సముచిత స్థానం కల్పించి గౌరవించిన ఏకైక ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజాకవి గద్దర్, అందెశ్రీ లాంటి మహానుబావులకు ప్రభుత్వపరమైన గౌరవ మర్యాదలను అందిస్తూ వారి కీర్తిని నలు దిక్కుల చాటినా ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. నాటి నుంచి నేటి వరకు తెలంగాణ రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలకు ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి నిర్మించి ఇచ్చిన ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీ దేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పథకాల అమలులో అధికారులు గాని ప్రజాప్రతినిధులు గాని ఎక్కడైనా అవినితి అక్రమాలకు పాల్పడితే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత:ఎఎస్ఐ



**ప్రజాపక్షం/దామరగిద్ద:** దామరగిద్ద పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి పర్మిషన్ లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ యజమాని, డ్రైవర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎఎస్ఐ అరుణ్ తెలిపారు. టిప్పర్ డ్రైవర్ సవారి అశోక్ షేర్నపల్లి నుండి మొగల్మడకకు అక్రమంగా ఇసుక తరలిస్తుంటే లోకుర్తి వద్ద దామరగిద్ద పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కి తరలించి డ్రైవర్ సవారి అశోక్, ఓనర్ ఏం.శివకుమార్ గౌడ్, జాజాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎఎస్ఐ తెలిపారు.

## గోటూర్‌లో ట్రాక్టర్ పత్తివేత



**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండలం గోటూర్ గ్రామంలో పెద్దమంచల్ల వెంకట్ రాములు ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి సమయంలో వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుంటే ధన్వాడ శివారులో పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ధన్వాడ ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

## ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** మహిళల ఉన్నతి తెలంగాణ ప్రగతి పేరిట 'ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సహచర మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావులతో కలిసి ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు అన్ని రకాలుగా అవకాశాలు కల్పిస్తున్నదని అన్నారు. 18 సం॥ లు నిండిన ప్రతి మహిళకు ఇందిరా మహిళ శక్తి చీరలను పంపిణీ చేసేందుకు అనవరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. ప్రతి గ్రామంలోని మహిళలకు చీరల పంపిణీ జరగాలన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో అందరూ ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఐక్యతతో ఉండి వాటిని సద్వినియోగం చేసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని కోరారుజిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ కు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, శ్రీను, డిఆర్డిఏ మొగులప్ప, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, అన్ని మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



## పేదరిక నిర్మూలన కోసం కృషి చేసిన ఇందిరమ్మ

ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** దేశంలో పేదరిక నిర్మూలన కోసం మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఎంతో కృషి చేశారని డిసిసి అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అశోక్ టాకీస్ చౌరస్తాలో ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె విగ్రహాన్ని బుధవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం మధుసూదన్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఉక్కు మనిషి ఇందిరా గాంధీ అని అన్నారు. ఇందిరా గాంధీ ప్రధానిగా తన హయాంలో దేశభివృద్ధి కోసం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చినట్లు తెలిపారు. పేదల పెన్నిధి ఇందిరా గాంధీ అని ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

**ప్రజాపక్షం/అర్వపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల కేంద్రంలోని జాజిరెడ్డిగూడెం గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్‌కు బుధవారం శంకుస్థాపన చేసి ఆయన మాట్లాడారు. అంతకుముందు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి పెద్దపీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీకాంత్, ఎంపిడిఓ ఝాన్సీ, పిఆర్ డిఈ బాబురావు, డాక్టర్ భూక్యా నగేష్, ఎంపిఓ గోపి, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం పాల్గొన్నారు.





## సిపిఐలో మూడు కుటుంబాలు చేరిక

**ప్రజాపక్షం/మునుగోడు:** భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న సిపిఐ కి పలువురు నాయకులు ఆకర్షితులై సిపిఐ లో చేరుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో చోళ్ళేడు గ్రామానికి చెందిన మూడు కుటుంబాలు ఆ గ్రామ శాఖ కార్యదర్శి వనం వెంకన్నఆధ్వర్యంలో సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఎంఎల్‌సి సత్యం ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వంగూరి శంకర్ ,బుడియాపాక రాములు, గాదగోని సైదులు తదితరులు ఉన్నారు.

## వన పెంపకానికి 10 ఎకరాల భూమిని కేటాయించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** గీత వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో జరుగు రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిధులుగా రాష్ట్ర రోడ్డు రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, గౌరవ అతిధులుగా మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. రాజ్యాంగ సవరణ ద్వారా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి గీత పారిశ్రామిక ఆర్థిక సహకార కార్పోరేషన్ లకు నిధులు కేటాయించాలని కోరారు. గీత వృత్తి రక్షణ, వృత్తిదారులకు సంక్షేమ ఆధునీకరణ వన పెంపకానికి 10 ఎకరాల భూమిని కేటాయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, రాజారామ్, పాషా, దేశగాని హేమలత, వెంకటమ్మ, కోటమ్మ పాల్గొన్నారు.

## గ్రంథాలయాల సహకారంతో మహిళలు ఉద్యోగ సాధనలో విజయం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** గ్రంథాలయాల సహకారంతో మహిళలు ఉద్యోగ సాధనలో విజయం సాధించాలని అందుకు పట్టుదలతో కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా జిల్లా గ్రంథాలయంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రభుత్వం పురుషులతో సమానంగా మహిళలకు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. మహిళలు తాము ఎంచుకున్న రంగంలో ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలు విద్య, మహిళా సాధికారత, మహిళల హక్కులను ప్రతిబింబించే విధంగా ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి బాలమ్మ, స్ఫూర్తి క్లబ్ సభ్యులు అడ్వకేట్ రమాదేవి, ఆండాల్, ప్రమీల, లైబ్రేరియన్‌లు శ్యాంసుందర్ రెడ్డి, విజయభాస్కర్, రంగారావు, సృజన తదితరులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల అటానమస్‌లో 2025/26 విద్యా సంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న రసాయన శాస్త్ర ఇన్ ఆర్గానిక్ కెమిస్ట్రీ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. ఉపేందర్ తెలియజేసారు. పీజిలో 55 శాతం మార్కులు ఉన్న ఉన్నవారు అర్హులని అదేవిధంగా యస్.సి, యస్.టి వారికి పీ.జిలో 50 శాతం మార్కులు ఉన్నవారు అర్హులనీ తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో నెట్,సెట్,పిహెచ్‌డి, బోధనా అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుననీ ఆసక్తి కల అభ్యర్థులు త మ దరఖాస్తు ఫారాలను కళాశాల కార్యాలయములో అందజేయాలని సూచించారు. చివరి తేది ఈనె ల 22 వరకు దరఖాస్తుదారులు త మ విద్యార్హతల సర్టిఫికెట్లను ఎస్ఎస్‌సి మెమో,ఇంటర్మీడియట్ మెమో, డిగ్రీ మెమో,పీజీ మెమో, నెట్,సెట్, పిహెచ్ డి సర్టిఫికెట్ , ఆధార్ కార్డు జిరాక్స్ లు ఇవ్వాలనీ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 24న ఉదయం 10.30 గంట లకు కళాశాల లో ఇంటర్వ్యూకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.


## సుస్థిర పాలన ఘనత ఇందిరాగాంధీదే

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని సాగర్‌రోడ్డులోని ఆమె విగ్రహానికి బుధవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశానికి సుస్థిర పాలన అందించి దేశ ప్రజల కోసం అనేక సంస్కరణలు చేసి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత ఇందిరాగాంధీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నూకల వేణుగోపాల్‌రెడ్డి, చిరుమర్రి కృష్ణయ్య, స్కైలాబ్‌నాయక్, కాకునూరి బసవయ్యగౌడ్, పొదిల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# లబ్ధిదారులకు అలసత్వం తగదు

### త్వరితగతిన ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలి
### ఇందిరమ్మ ఇండ్ల పరిశీలనలో ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ మండలం ఉమ్మడి ముదిగొండ గ్రామపంచాయతీ పరిధిలోని ముదిగొండ, గుడిలచ్చ తండా, ముచ్చరాల జర్పుల తండా, వద్య తండాలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని బుధవారం దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ స్వయంగా పరిశీలించి, అభివృద్ధి పనులను సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల స్థితిగతులను ప్రత్యక్షంగా చూసిన ఎంఎల్‌ఏ బాలునాయక్ ప్రతి ఇంటి నిర్మాణ దశను, మెటీరియల్ నాణ్యతను, లబ్దిదారుల అవసరాలను అధికారులు, స్థానిక ప్రజలతో చర్చించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇంటి నిర్మాణంలో వివిధ స్థాయిలలో ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాలు లబ్దిదారులకు వేగంగా చేరేలా పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు చొరవ చూపాలని పేర్కొన్నారు. లబ్దిదారులు ఆలస్యం చేయకుండా త్వరితగతిన ఇంటి నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేసుకోవాలని సూచించారు. చీమలకుంట తండా నుండి గుడి లచ్చ తండా మీదుగా ముదిగొండ వరకు 1.6కిలో మీటర్లు నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో డానియల్, ఎంపివో సాగర్, డిఈ నిత్యానంద స్వామి, ఏఈఈ నవీన్, పంచాయతీరాజ్ ఏఈ శంకర్, హౌసింగ్ ఏఈ చందు, మధు, హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి కవిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు జీవన్‌రెడ్డి, నర్యానాయక్, సరోజ జగన్, బాలు, శంకర్, సత్యం, వెంకటయ్య,మల్లేష్, యాదయ్య, మధు, గిరి, లక్పతి, రాజు, జంగు, యువజన కాంగ్రెస్ నాయకులు రాంసింగ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్కరిపై తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం 2025కు ముఖ్య అతిధిగా జిల్లా కలెక్టర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వయో వృద్ధులకు సంబంధించిన చట్టాలు, పథకాలు అమలుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకొని ముందుకు వెళ్తున్నామని తెలిపారు. పెన్షన్‌కు సంబంధించిన అకౌంట్‌లోని డబ్బులను సైబర్ నేరగాలు ఫోన్ చేసి ఓటిపి ద్వారా డబ్బులు దొంగలిస్తున్నారని, సైబర్ మోసాల పట్ల సీనియర్ సిటిజన్స్ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సూర్యాపేట జిల్లాలో రూ.50లక్షలతో ఓల్డ్ ఏజ్ హోం త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని అలాగే మల్టీసర్వీస్ డే కేర్ సెంటర్‌ను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సీనియర్ సిటిజెన్స్‌ను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు, అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిడబ్ల్యు నరసింహారావు, డిపిఓ యాదగిరి, డిప్యుటి డిఎంహెచ్ఓ చంద్రశేఖర్, డిసిహెచ్ ఎస్ వెంకటేశ్వర్లు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆర్ సీతారామయ్య, బోల్ల రాంబాబు, విద్యాసాగర్, హమీద్‌ఖాన్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### పదవ తరగతి పరీక్షలకు సిద్ధం కావాలి : జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** పదవ తరగతి వార్షిక పరీక్షలో ప్రతి ఒక్కరు ప్రతి సబ్జెక్టులో 70 శాతం మార్కులు సాధించేలా పరీక్షలకు సిద్ధం అవ్వాలని విద్యార్థులకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. మంగళవారం పెన్‌పహాడ్ మండలం అనంతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పదవ తరగతి విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీష్ చదివించి నోట్‌బుక్స్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ చదువు ప్రాధాన్యత, పదవ తరగతి ప్రాముఖ్యతను ఆయన తెలియజేస్తూ పదవ తరగతిలో మంచి మార్కులు వచ్చేందుకు బాగా కష్టపడి చదువాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లాలు నాయక్, ఎంపిడిఓ జానయ్య, ఎంఈఓ రవి, ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొ





## చదువుతోనే అన్ని సాధ్యం

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** చదువుతోనే అన్ని సాధ్యమవుతాయని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.ఈనెల 14 నుండి 20 వరకు నిర్వహిస్తున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో" భాగంగా బుధవారం ఆమె జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ముందుగా జిల్లా కలెక్టర్ స్వర్గీయ భారత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం విద్యార్థినులనుద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో కష్టపడి ఇందిరా గాంధీ ప్రధాని అయ్యారని, పేద ప్రజల సంక్షేమానికి గరీబి హటావో నినాదాన్ని తీసుకువచ్చారని, ఆమెకు అనేక భాషలలో ప్రావీన్యరాలని, తండ్రి జవహర్లాల్ నెహ్రూ ప్రధాని అయినప్పటికీ ఆమె స్వయంగా కష్టపడి ప్రధాన మంత్రి అయ్యారని, ఇందిరాగాంధీ లాగా కష్టపడి చదివి సమాజంలో మంచి స్థానానికి రావాలని ఆమె విద్యార్థినిలకు పిలుపునిచ్చారు.జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు డాక్టర్ ఎం. ఆఫీస్ ఖాన్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందిస్తాయని, నల్గొండ జిల్లా కేంద్ర గ్రంథాలయ ప్రస్తుత భవనం సరిపోనందున కొత్త బిల్డింగ్ మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ బాలమ్మ,బాలుర, బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ సిబ్బంది, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు అందజేశారు.

## నూతన విత్తన చట్టంపై అవగాహన



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** నూతన విత్తన చట్టం 2025పై అవగాహన, సూచన, సలహాలు సేకరించినట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు చంద్రశేఖర్, డాక్టర్ శ్రీధర్, కంప సాగర్‌లు తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, విత్తన డీలర్లు సీడ్ ప్రొడక్షన్ ఆర్గనైజర్లు, డిస్ట్రిబ్యూటర్లు, వ్యవసాయ అధికారులు, ఉద్యాన శాఖ అధికారుల సమక్షంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విద్యాలయం, కంప సాగర్ కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నూతన విత్తన చట్ట విధివిధానాలను వివరించారు. అనంతరం అధికారులు, విత్తన డీలర్లు, విత్తన ఉత్పత్తిదారులు, రైతులు, నాణ్యమైన విత్తనము రైతులకు అందెందుకు కావల్సిన సలహాలు సూచనలు తెలియజేసినట్లు తెలిపారు. ఈ సలహాలను సూచనలను వ్యవసాయ యూనివర్సిటి ద్వారా భారత ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళడం జరుగుతుందన్నారు. డిఏఓ శ్రీధర్‌రెడ్డి, డిహెచ్ఎస్ఓ నాగయ్య, వ్యవసాయ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, ఎఫ్‌పిఓ చైర్మన్లు, విత్తన డీలర్లు, విత్తన ఉత్పత్తిదారులు, రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలోని పానగల్లు రోడ్డులో గల 3, 18, 19 వార్డు ల్లో విద్యుత్ సమస్య పరిష్కారానికై చీఫ్ ఇంజనీర్ 62 లక్షలు మంజూరు చేయడం జర్గిందని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కొండూరు సత్యనారాయణ వెల్లడించారు.బుధవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్న గాలికి,వానక ఓవర్ లోడ్ తో తరచూ కరెంట్ పోయి అంతరాయం జరుగుతుందని ఈ సందర్భంగా ఇప్పటికే శ్రీరామ్ నగర్ కాలనీలో 20 లక్షలతో 11 కేవీ విద్యుత్ లైన్ స్పెషల్ ఫీడర్ ఏర్పాటు చేయడం జరిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం 3,18,19 వార్డుల్లో ఉన్న విద్యుత్ సమస్య పరిష్కారానికై, లోవోల్టేజ్ సమస్య, త్రిఫేస్ వైర్ లేని సమస్య,ఆధనపుటాన్స్ఫార్మర్,ఇంటర్ మీడియట్ పోల్స్ ఏర్పాటు కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు కొరుకు 42 లక్షల రుపాయల తో పానగల్లు,సబ్ స్టేషన్ నుండి శ్రీనగర్ కాలనీ 19వ వార్డు వరకు 11 కేవీ విద్యుత్త్ పైన్ స్పెషల్ ఫీడర్ ఏర్పాటుకు కూడాల క్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. గత ఆరు నెలల క్రితం జిల్లా కలెక్టర్ సంబందిత శాఖ అధికారుకు విన్నవించుకోవడంతో శాఖ అధికారుల సహకారం తో ఈ నిధులు మంజూరైనాయని సహాకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# తేమశాతం ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

### ముల్కలపల్లిలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీ


**ప్రజాపక్షం/తుర్కపల్లి :** కొనుగోలు కేంద్రాలలో తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం పెద్ద తండా, ముల్కలపల్లి గ్రామంలోగల పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు సెంటర్‌లను బుధవారం జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఇప్పటివరకు ఎంత ధాన్యం వచ్చిందని, ఇప్పటి వరకు ఎంత కొనుగోలు చేశారని అడిగి తెలుసుకున్నారు. తేమశాతం వచ్చిన ధాన్యం ఇంకా ఎంత ఉందని అడిగి ఉదయం, సాయంత్రం తేమ శాతం చెక్ చేసి తేమశాతం వచ్చిన వెంటనే కొనుగోలు చేయాలన్నారు. తేమ శాతం వచ్చిన ధాన్యం కేంద్రంలో ఉండటానికి వీలు లేదన్నారు. లారీలు రాక కాంట వేయలేదని తెలపడంతో సంబంధిత కాంట్రాక్టర్ తో మాట్లాడి రోజు రెండు, మూడు లారీలు పంపించాలని లారీలు రాక పోతే ధాన్యం కుప్పలు కేంద్రాల్లో ఉంటే కాంట్రాక్టర్‌లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరంవివిధ దశలలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. గ్రామంలోఇప్పటి వరకు మంజూరీ అయిన ఇండ్ల నిర్మాణాలు అవి ఏఏ దశలలో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పూర్తి అయి ఉన్న ఇంటిని పరిశీలించారు. ఇప్పటి వరకు 3 బిల్లులు వచ్చాయా అని లబ్ధిదారులని అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులు ఎప్పటి లోగా పూర్తి చేస్తారు అని అడిగారు. త్వరగా పూర్తి చేస్తే మిగిలిన లక్ష రూపాయలు కూడా మీ అకౌంట్‌లలో వెంటనే జమ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఎమ్మార్వో జలకుమారి, ఎంపీడీవో గీతారెడ్డి, సెక్రటరీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# హెచ్‌ఎండిఏ నిధులతో దెబ్బతిన్న రోడ్లకు మోక్షం

### భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి వెల్లడి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** హెచ్‌ఎండిఏ నిధులతో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలకు దెబ్బతిన్న రోడ్లకు మోక్షం లభించనుందని నూతన రోడ్ల నిర్మాణం చేపడతామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన మండలంలోని దేశ్ముఖి పిల్లాయిపల్లి జూలూరు వయా పెద్దగూడెం గ్రామాల మధ్య గల నూతనంగా వేసిన తారు డబుల్ రోడ్డును ప్రారంభించి మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి రావటంతో ఇరు గ్రామాల ప్రజల 30 ఏళ్ల కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు.రూ.6.58కోట్ల నిధులతో ఎన్ హెచ్ 65 నుండి 12కిమీ మేర రోడ్డును ఆర్ అండ్ బి నిధులతో కాంట్రాక్టర్ సహకరించడంతో ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన రోడ్డు పూర్తి అయినందుకు సంతోషంగా ఉందని కాంట్రాక్టర్కు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల ఆశలు ఆకాంక్షల మేరకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రానున్న రోజుల్లో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి సుపరిపాలన అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన రోడ్డును కేవలం 9 నెలల్లో పూర్తిచేసి ప్రజలకు అంకితం ఇచ్చారని చెప్పారు.నాడు ప్రతిపక్ష నేతగా ఎన్నో సార్లు ధర్నాలు చేసిన అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదనీ ఏ రోడ్డు కోసమైతే ఆనాడు ధర్నా చేశారో అదే రోడ్ ను తన చేతుల మీదుగా ప్రారంభించడం గొప్ప విషయమని ప్రజలు హర్షిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు.గత ప్రభుత్వాలు చేయలేని పనిని కేవలం రెండున్నర ఏళ్లలో కాంట్రాక్టర్ తో మాట్లాడి అదనపు వ్యయ అంచనాతో నిధులు మంజూరి చేసి రోడ్డును పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రజా పాలనలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుని విశ్వాసం పెంచుతూ ప్రజల హృదయాలను గెలుస్తున్న ప్రభుత్వం తమదని పునరుద్ఘాటించారు. రేవలపల్లి గౌస్ కొండ, శివారెడ్డి గూడెం ఇంద్రియాల రామలింగంపల్లి గ్రామాలకు త్వరలో నూతనంగా రోడ్లను నిర్మించనున్నట్లు జూలూరు రుద్రవెల్లి హై లెవెల్ వంతెనను కూడా పూర్తి చేయనున్నట్లు చెప్పారు. క్రాఫ్ హాలిడే లేకుండానే మూసీ నది పరివాహక ప్రాంతంలోని కాలువల మరమ్మతులను చేపట్టి రైతులకు పంట నీరు అందించే పనులు వేగవంతంగా చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పిలాయిపల్లి గ్రామ రజకులు కోరిన వెంటనే దోబీ ఘాట్ నిర్మాణం మంజూరు చేశారు. ఆ గ్రామంలో ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని కోరారు. నిర్మాణంలో ఉన్న గౌడ సంఘ భవనాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. పెద్దగూడెం గ్రామంలో రూ.18 లక్షలతో నిర్మించిన గౌడ సంఘం భవనాన్ని ఆయన ప్రారంభించారు. దేశ్ముఖిలో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశ్వర్లు, జిల్లా సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు మర్రి నరసింహారెడ్డి, మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షులు పకీరు నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గీత వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/మోత్కూర్ :** కల్లు గీతా కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 22న హైదరాబాదు బషీర్‌బాగ్‌లో జరిగే గీత పనివారలసంఘం రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని చాపల అంజయ్య పిలుపునిచ్చారు. బుధవారం రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వేలాది మంది వెనుకబడిన గీత కార్మికులకు చెందిన ప్రజలు కల్లుగీత వృత్తిలో జీవిస్తున్నారని, ప్రమాదవశాత్తు గీత కార్మికుడు తాడిచెట్టు పై నుండి మరణిస్తే ప్రభుత్వం నుంచి ఇచ్చే ఎక్స్‌గ్రేషియా రూ.13 కోట్ల పెండింగ్‌లో ఉన్నదని తెలిపారు. తాడిచెట్టు పై నుండి పడి గాయాలైన గీత కార్మికులకు ఎలాంటి సహాయం ప్రభుత్వం నుండి సమయానికి అందడం లేదని విమర్శించారు. ప్రభుత్వం సేఫ్టీ కిట్స్ పంపిణీ చేయాలని, అర్హులైన గీతకార్మలకు మోపెడ్లు ఇవ్వాలని, గీత కార్మికులకు వృత్తి పెన్షన్ రూ.5000 ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మోత్కూర్ సొసైటీ అధ్యక్షులు బీసు సత్తయ్య, జిల్లా నాయకులు అనేపు వెంకట్, పులికరం మల్లేష్, గీతా పని వాళ్ల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బత్తిని శీను, ఎడ్ల నరేష్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బోయిన వెంకన్న, బీసు సత్యనారాయణ, గీత సంగం నాయకులు మడిపల్లి రంగయ్య, చాపల మల్లయ్య, మల్లె బోయిన బుచ్చయ్య, ఆరే సోమయ్య, గొడిశాల రాజయ్య, బత్తిని లింగయ్య పాల్గొన్నారు.






## ‘ఫైర్ అండ్ ఐస్’ పాట ఆవిష్కరణ



జ్యోతి పూర్వజ్, పూర్వజ్, మనీష్ గిలాడ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సినిమా ‘కిల్లర్’. చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను ధ్యానం నాన్నగారు ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్ పై పూర్వజ్, పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పూర్వజ్ దర్శకత్వం వహిస్తున్నారు.ఈ సినిమా నుంచి ఫైర్ అండ్ ఐస్ సాంగ్ ను ఈ రోజు హైదరాబాద్ లో లాంఛ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాక్షన్ కొరియోగ్రాఫర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ 15 మందితో అటాక్ చేసే ఒక యాక్షన్ సీక్వెన్స్ ప్లాన్ చేశాం. ఆ సీక్వెన్స్ రెడీ చేయడానికి మాకు 3 గంటలు టైమ్ పట్టింది. కానీ జ్యోతి వచ్చి అరగంటలో మొత్తం యాక్షన్ పార్ట్ చేశారు. మేము షాక్ అయ్యాం. ఈ సినిమాలో జ్యోతి చేసిన యాక్షన్ సీక్వెన్సులకు మంచి రెస్పాన్స్ వస్తుంది అన్నారు.

## కొన్ని సినిమాలు అనుకున్నంత రీచ్ కాలేదు

**చిట్ చాట్‌లో రాజ్ తరుణ్**

యంగ్ ట్యాలెంటెడ్ రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్ ‘పాంచ్ మినార్’. రాశి సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. నవంబర్ 21న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో రాజ్ తరుణ్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.సినిమాని ఈ ఏడాదిలోనే మొదలుపెట్టాం. ఇది ప్రాపర్ క్రైమ్ కామెడీ. కథ నుంచి బయటికి వెళ్లకుండా జానర్‌కి తగ్గట్టు ప్రతి సిచువేషన్ లోనూ మంచి ఫన్ ఉంటుంది. స్క్రీన్ ప్లే చాలా ప్రత్యేకంగా ఉంటుంది. నాకు కథ వినగానే చాలా నచ్చింది. నిర్మాతలు సినిమాకి కావలసిన ప్రతిదీ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సమకూర్చారు. మేము అడిగిన ఆర్టిస్టులని ఇచ్చారు. సినిమా మేము అనుకున్న దాని కంటే చాలా బెటర్‌గా వచ్చింది. ఈ సినిమాలో ఒక కీలక మలుపులో వినిపించే పదం అది. దాంతో కథ ఇంకో మలుపు తిరుగుతుంది. వినడానికి చాలా క్యాచిగా ఉండే పదం కావడంతో టైటిల్ గా పెట్టాం. అంతే గాని పాంచ్ మినార్ అనేది ఒక ఫిజికల్ ఎంటిటీ కాదు. ఉద్యోగం సంపాదించే క్రమంలో ఈజీగా డబ్బులు సంపాదించాలనుకునే ఓ కుర్రాడు ఎలాంటి సిచువేషన్‌లో ఇరుక్కున్నాడు అనేది కథ. ఈ సినిమాలో నా క్యారెక్టర్ ఎంత నలిగిపోతుంటే చూసే వాళ్ళకి అంత నవ్వొస్తుంది. ఇది కంప్లీట్‌గా ఫిక్షనల్ స్టోరీ. నా గత కొన్ని సినిమాల్లో అనుకున్నంత రీచ్ కాలేదు. అయితే దానికి చాలా కారణాలు ఉండొచ్చు. ఈ సినిమా మాత్రం తప్పకుండా ఆడియన్స్‌కి రీచ్ అవుతుంది. నాకు నా కెరియర్ విషయంలో ఎలాంటి తొందరపాటు లేదు. నేను గత ఏడాదిన్నరగా కొన్ని ప్రాజెక్ట్స్ చేశాను. అవి ఒక్కొక్కటిగా వస్తున్నాయి.రాశి తెలుగు అమ్మాయి కాదు కానీ కష్టపడి తెలుగు నేర్చుకుంది. తన ప్రతి డైలాగు చాలా చక్కగా పలుకుతుంది. ఈ క్యారెక్టర్‌లో తను అద్భుతంగా పెర్ఫామ్ చేసింది.నేను కచ్చితంగా డైరెక్షన్ చేస్తాను. అయితే అది ఇప్పుడే కాదు. డైరెక్షన్ చేయాలంటే ఒక రెండు సంవత్సరాలు గ్యాప్ తీసుకోవాలి. దానికి సంబంధించిన ప్రిపరేషన్ చేసుకోవాలి. ఇవన్నీ చేయడానికి కొంత టైం పడుతుంది.నిన్న ఓపెనింగ్ చేసిన సినిమా మంచి థ్రిల్లర్. రామ్ భజరంగ్ ఇప్పటివరకు నేను చేసిన సినిమాలో హై యాక్షన్ ఉంటుంది. తెలుగు తమిళ్ లో చేస్తున్న సినిమా కూడా డిఫరెంట్ జానర్ సినిమా.



## ‘ఆంధ్ర కింగ్ తాలూకా’ ట్రైలర్ విడుదల

రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహేశ్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా, కన్నడ సూపర్స్టార్ ఉపేంద్ర ఆన్ స్క్రీన్ సూపర్‌స్టార్ పాత్రను పోషిస్తున్నారు. వివేక్, మెర్విన్ స్వరపరిచిన ఈ సినిమా సంగీతం ఇప్పటికే అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కర్నూల్ లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ ఈవెంట్ కు భారీ సంఖ్యలో ప్రేక్షలులు హాజరయ్యారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో రామ్ పోతినేని మాట్లాడుతూ ఇది అభిమానుల సినిమా. భాగ్యశ్రీ అద్భుతంగా పెర్ఫార్మ్ చేసింది. గ్లామరస్ గా కనిపిస్తూ అద్భుతంగా పెర్ఫార్మ్ చేసే హీరోయిన్ తెలుగు సినిమాలో చాలా ఏళ్ల తర్వాత వచ్చిందని భావిస్తున్నాను. తనకి బ్రైట్ ఫ్యూచర్ ఉంటుందని నమ్ముతున్నాను. డైరెక్టర్ మహేష్ థియేటర్ కాదు మనలో సౌండ్ వచ్చే సినిమా చేశాడు. అద్భుతమైన సినిమా తీశాడు. తనతో కలిసి వర్క్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. మై డియర్ ఫ్యాన్.. తమ్ముడు.. నువ్వు వున్నావని నాకు తెలియకపోవచ్చు. కానీ నేనొక్కడినే ఉన్నానంటే కారణం నువ్వే. లవ్ యు కర్నూల్. 27న థియేటర్స్ లో కలుద్దాం. మిమ్మల్ని స్క్రీన్ మీద చూసుకోవడానికి రెడీగా ఉండండి అని అన్నారు. ఈనెల 27న ప్రతి ఒక్కరు ఈ సినిమాని థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను. నిర్మాత వై రవిశంకర్, సంగీత దర్శకులు వివేక్, మెర్విన్ పాల్గొన్నారు.



## టాలెంట్ ఉన్న వారిని ఎవరు ఆపలేరు

**12ఏ రైల్వే కాలనీ ప్రీరిలీజ్ ఈవెంట్‌లో అల్లరి నరేష్**



హీరో అల్లరి నరేష్ అప్ కమింగ్ థ్రిల్లర్ ‘12ఏ రైల్వే కాలనీ’ ఎక్సయిటింగ్ ప్రమోషనల్ కంటెంట్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. నూతన దర్శకుడు నాని కాసరగడ్డ దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. పవన్ కుమార్ సమర్పణలో పొలిమేర మూవీ సిరీస్ తో పాపులరైన డాక్టర్ అనిల్ విశ్వనాథ్ షోరన్నర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ రాశారు. కామాక్షి భాస్కర్ల హీరోయిన్ గా నటిస్తున్నారు. నవంబర్ 21న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. హీరో అల్లరి నరేష్ మాట్లాడుతూ 64 సినిమాలు చేశాను. రిలీజ్ డేట్ దగ్గర పడుతుంటే టాక్ ఏంటి, ఓపెనింగ్స్ ఏమిటి ? ఎలాంటి రివ్యూస్ వస్తాయనే టెన్షన్‌గా ఉంటుంది. కానీ నాని ఫస్ట్ సినిమా చేస్తున్నాడు. తనకి ఎక్కడ టెన్షన్ లేదు. టాలెంట్ ఉన్న వారిని ఎవరు ఆపలేరు. నేను 35 మంది కొత్త డైరెక్టర్స్‌తో పని చేశాను. దాంట్లో చాలా మంది సక్సెస్ అయ్యారు. నేను డైరెక్టర్ ఆర్టిస్ట్ ప్రొడ్యూసర్ ఆర్టిస్ట్‌గా ఉండాలనుకుంటున్నాను. నవంబర్ 21న ఈ సినిమా ప్రేక్షకులకు ముందుకు వస్తున్నామన్నారు.



నందమూరి బాలకృష్ణ, సంయుక్త, హీరో హీరోయిన్‌గా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన అఖండ–2: తాండవం డిసెంబర్ 5న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా వైజాగ్‌లోని జగదాంబ థియేటర్లో గ్రాండ్‌గా జరిగిన సాంగ్ లాంచ్ ఈవెంట్లో గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణతో పాటు డైరెక్టర్ బోయపాటి శ్రీను, హీరోయిన్ సంయుక్త తదితరులు హాజరై ఫ్యాన్స్‌లో జోష్ నింపారు. ఈ కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. ‘సింహాచలం అప్పన్న ఆశీస్సులు తీసుకుని ఇక్కడికి వచ్చాం. మొన్న మన దెబ్బేంటో ముంబైలో హిందీవాళ్లకు చూపించాం. ఇంట గెలిచి రచ్చ గెలవాలంటారు. అఖండ ఫస్ట్ పార్ట్ మన దగ్గర ఎంత పెద్ద హిట్ అయిందో చూశారు. ఇప్పుడు సీక్వెల్ ‘అఖండ: తాండవం’ పాన్ ఇండియా రేంజ్లో బ్లాక్ బస్టర్ కాబోతోంది. కోవిడ్ టైంలోనే అఖండ సినిమా సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఆ సినిమా ఇచ్చిన ధైర్యంతో మిగతా సినిమాలు కూడా రిలీజ్ అయ్యాయి. ఇప్పుడు రిలీజ్ అయిన పాట ఐటమ్ సాంగ్ కాదు. కుటుంబం పండగ చేసుకునే నేపథ్యంలో వచ్చే సాంగ్. పాటలో సంయుక్తను చూశారు కదా.. ఆమె ఎంతో అందంగా ఉంది. సినిమాలో ఆమె నటన కూడా చూస్తారు. ఆమె హావభావాలు ఎంతో అద్భుతంగా పలికించి తన పాత్రకు న్యాయం చేసింది. అఖండలో జై బాలయ్య పాటను కంపోజ్ చేసిన భాను మాస్టర్ ఈ జాజికాయ పాటను అద్భుతంగా కంపోజ్ చేశాడు. ఇది కేవలం తెలుగు సినిమా కాదు. మన భారతీయ సనాతన హైందవ ధర్మం శక్తి, పరాక్రమాన్ని చాటిచెప్పే చిత్రం. మన జాతి మూలాలు ఏంటో తెలియజేసే సినిమా. అందుకే అన్ని భాషల్లో సినిమాను ప్రమోట్ చేస్తున్నాం. రేపు కర్ణాటకకు వెళ్లి అక్కడ ప్రమోట్ చేస్తాం. తర్వాత తమిళనాడుకు వెళ్తాం. మొన్న ముంబైలో మన దెబ్బకు హిందీ వాళ్లకు దిమ్మతిరిగిపోయింది. ఇక్కడకు వచ్చిన నా అభిమానులందరికీ ధన్యవాదాలు’ అని చెప్పారు. డైరెక్టర్ బోయపాటి శ్రీను, హీరోయిన్ సంయక్త , నిర్మాత గోపీ ఆచంట పాల్గొన్నారు.

## ‘అఖండ–2’ పాట విడుదల

## ‘ప్రేమంటే’ పెద్ద హిట్ అవ్వాలి

**నాగ చైతన్య**



శ్రీ వెంకటేశ్వర సిని మాస్ ఎల్‌ఎల్పి, స్పిరిట్ మీడియా బ్యానర్ల మీద సొనాలి నారంగ్ సమర్పణలో నారాయణ్ దాస్ కె.నారంగ్ దివ్యాశీస్సులతో జాన్వీ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు సంయుక్తంగా నిర్మించిన చిత్రం ‘ప్రేమంటే’. థ్రిల్లు ప్రాప్తిరస్తు అనేది ఉప శీర్షిక. ఈ మూవీలో ప్రియదర్శి, ఆనంది జంటగా నటించారు. ఈ సినిమాకు నవనీత్ శ్రీరామ్ దర్శకత్వం వహించగా, ఆదిత్య మేరుగు సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ మూవీ నవంబర్ 21న గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో మంగళవారం నాడు లవ్ ట్రోట్టర్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువ సామ్రాట్ నాగ చైతన్య, సెన్సేషనల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో నాగ చైతన్య మాట్లాడుతూ.. ‘నారాయణ్ దాస్ కె నారంగ్ , సునీల్ నారంగ్ వారసత్వాన్ని జాన్వీ ముందుకు తీసుకు వెళ్తున్నారు. వీరి బ్యానర్‌లో ‘లవ్ స్టోరీ’ లాంటి మంచి సినిమాను చేయడం, వారి ద్వారానే శేఖర్ కమ్ముల పరిచయం అవ్వడం ఎప్పటికీ మర్చిపోలేను. ఇప్పుడు మళ్లీ ‘ప్రేమంటే’ అనే లవ్ స్టోరీ చిత్రాన్ని ప్రమోట్ చేసేందుకు రావడం ఆనందంగా ఉంది. నవనీత్ గారు మంచి పాయింట్తో కొత్త ప్రేమ కథను అందివ్వబోతోన్నారు. ప్రియదర్శి మంచి నటుడు. అన్ని రకాల పాత్రల్ని అద్భుతంగా పోషిస్తున్నారు. ఆనంది గారు ‘కస్టడీ’ చిత్రంలో ఓ చిన్న పాత్రలో నటించారు. ఆమె మంచి నటి. సుమని ఇలాంటి ఓ మంచి పాత్రలో చూడటం ఆనందంగా ఉంది. ‘ప్రేమంటే’ సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. 21న ఈ మూవీని అందరూ చూడండి’ అని అన్నారు. శేఖర్ కమ్ముల మాట్లాడుతూ ‘ప్రేమంటే’ టీంకి కంగ్రాట్స్. ప్రియదర్శిని చాలా ఏళ్ల నుంచి గమనిస్తూనే ఉంటున్నాను. ఆయనెప్పుడూ మంచి కథల్నే ఎంచుకుంటూ ఉంటారు. నవనీత్ ఈ మూవీతో మంచి విజయం దక్కాలి. ఆనంది అద్భుతమైన నటి. ఆమె నటించిన చిత్రాలెన్నో చూశాను. యంగ్ టాలెంట్ ప్రస్తుతం ఇండస్ట్రీలో ఎక్కువగా వస్తోంది. ‘ప్రేమంటే’ చిత్రం పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు. ఈ కార్యక్రమంలో వీడియో ద్వారా రానా దగ్గుబాటి బైట్ వినిపించారు. సురేష్ బాబు, నిర్మాత జాన్వీ నారంగ్, సుమ కనకాల, హీరో ప్రియదర్శి, హీరోయిన్ ఆనంది, డైరెక్టర్ నవనీత్ శ్రీరామ్, హైపర్ ఆది, లియోన్ జేమ్స్, కెమెరామెన్ విశ్వనాథ్ రెడ్డి, ఆర్ట్ డైరెక్టర్ అరవింద్ , డైలాగ్ రైటర్ రాజ్ కుమార్, లిరిక్ రైటర్ సనారే పాల్గొన్నారు.

## బిజినెస్‌మ్యాన్ రీరిలీజ్ టీజర్ విడుదల

2012లో విడుదలై ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన సూపర్‌స్టార్ మహేష్ బాబు బిజినెస్‌మ్యాన్ మళ్లీ థియేటర్లలోకి రాబోతోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన రీరిలీజ్ టీజర్‌కు అంచనాలను మించే స్థాయిలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. టీజర్ విడుదలైన కొద్ది నిమిషాల్లోనే సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతూ, ఫ్యాన్స్‌లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. డైరెక్టర్ పూరీ జగన్నాథ్ రూపొందించిన ఈ మూవీకి మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ఎస్ థమన్ అందించిన బీట్స్ అప్పట్లో సెన్సేషన్ సృష్టించాయి. థమన్ కంపోజ్ చేసిన ప్రతి పాట కూడా సినిమాకి ఎనర్జీని పెంచుతూ, మహేష్ బాబు స్టైల్‌ను మరింత హైలైట్ చేసింది. ఈనెల 29న ఈ సినిమా విడుదల చేయనున్నారు. ఆర్ఆర్ మూవీ మేకర్స్ బ్యానర్ పైనిర్మాత డా.వెంకట్ ఈ చిత్రాన్ని నిర్మించారు.



## నితీశ్‌కుమార్ ఎన్నిక (మొదటి పేజీ తరువాయి)

శ్రావణ్ కుమార్ తెలిపారు. ఎన్‌డిఎ నాయకుడి ప్రతిపాదనను జెడి(యు)కి చెందిన విజయ్ చౌదరి ప్రతిపాదించగా, బిజెపి నాయకులు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా బలపరిచారు. ఎల్‌జెపి(ఆర్‌వి), హెచ్ఎఎం, ఆర్‌ఎల్ఎం ఎమ్మెల్యేలు కూడా బలపరిచారని శ్రావణ్ కుమార్ తెలిపారు. ఉదయం జనతా దళ్ యునైటెడ్ (జెడియు) శాసనసభా పక్ష నేతగా ఆ పార్టీ చీఫ్ నితీశ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ అంతర్గత సమావేశంలో నితీశ్ ఎన్నిక జరిగినట్లు రాష్ట్ర మంత్రి శ్రావణ్ కుమార్ తెలిపారు. శ్రావణ్ కుమార్ పిటిఐతో మాట్లాడుతూ, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు నితీష్ కుమార్‌ను జెడి(యు) శాసనసభా పక్ష నాయకుడిగా ఎన్నుకున్నారు అని అన్నారు. ముఖ్యమంత్రి సచివాలయంలోని ‘సంవాద్’లో ఈ సమావేశం జరిగిందని, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలందరూ, పార్టీకి చెందిన 22 మంది శాసనమండలి సభ్యులు హాజరైనట్లు ఆయన తెలిపారు. ‘నితీష్ కుమార్‌ను జెడి(యు) శాసనసభా పక్ష నాయకుడిగా నియమించాలనే ప్రతిపాదనను పార్టీ నాయకులు విజయ్ చౌదరి, ఉమేష్ కుష్వాహా ప్రతిపాదించగా, సీనియర్ జెడి(యు) నాయకుడు బిజేంద్ర యాదవ్ కూడా బలపరిచారు. తరువాత, ఈ ప్రతిపాదనను జెడి(యు) వర్కింగ్ జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఝా, కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ లాలన్ బలపరిచారు అని శ్రావణ్ కుమార్ అన్నారు. జెడియు శాసనసభా పక్ష నాయకుడిగా ఎన్నికైన తర్వాత, ‘సమావేశానికి హాజరైన పార్టీ నాయకులనుద్దేశించి నితీష్ కుమార్ ప్రసంగించారు. రాష్ట్ర సంక్షేమం కోసం అవిశ్రాంతంగా కృషి చేయాలని ఆయన కోరినట్లు జెడియు నాయకుడు తెలిపారు.

### బిజెపి ఎల్‌పిగా సామ్రాట్ చౌదరి

కాగా, రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన బిజెపి శాసనసభ్యులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో తారాపూర్ ఎమ్మెల్యే సామ్రాట్ చౌదరిని బిజెపి శాసనసభా పక్ష నాయకుడిగా ఎంపిక చేసినట్లు యుపి డిప్యూటీ సిఎం కేశవ్ ప్రసాద్ మౌర్య తెలిపారు. బిజెపి శాసనసభా పక్ష ఉప నాయకుడిగా విజయ్ కుమార్ సిన్హాను కూడా ఎన్నుకున్నారని ఆయన అన్నారు. బిహార్‌లో శాసనసభా పక్ష నాయకుడి ఎన్నికకు మౌర్యను కేంద్ర పరిశీలకుడిగా నియమించారు. బిజెపి శాసనసభా పక్ష నాయకుడి ఎన్నికకు కేంద్ర న్యాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, మాజీ కేంద్ర మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతిని కూడా సహ పరిశీలకులుగా నియమించారు. ఇద్దరూ కూడా సమావేశంలో పాల్గొన్నారు. కొత్తగా ఎన్నికైన 10 మంది బిజెపి ఎమ్మెల్యేలు కలిసి చౌదరి, సిన్హా పేర్లను శాసన సభా పక్ష నాయకుడిగా, ఉప నాయకుడిగా ఎన్నిక కోసం ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలను పార్టీ శాసనసభ్యులందరూ ఆమోదించారని బిజెపి నాయకుడు ఒకరు తెలిపారు.





## ఆగడాలు మితిమీరుతున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. దేశంలో పేదప్రజల గొంతుకగా నిలుస్తూ ప్రజా ఉద్యమాలే ఊపిరిగా, 100 సంవత్సరాలలో ఎన్ని ఆటుపోట్లు అవాంతరాలు ఎదురైనా తట్టుకుని నిలబడగలిగిందని,అనేక రాజకీయ పార్టీలు వస్తూ పోతూ ఉంటాయని, కానీ కమ్యూనిస్టు పార్టీ మాత్రం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మళ్లీ కమ్యూనిస్టు ఉద్యమాల్ని బలపరిచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాలలో తమ కార్యచరణ కొనసాగుతుందని, త్యాగాల చరిత్ర కలిగిన సిపిఐ పార్టీ చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకు బలమైన ప్రజా ఉద్యమం నిర్మిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తమ బాధ్యతగా స్వీకరించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బాలనర్సింహ్మా మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుండి దళిత మైనార్టీ వర్గాలపై దాడులు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయని, అంటరానితనం, కుల, మతాల పేరుతో ప్రజల మధ్యలో చిచ్చులు పెట్టే ప్రయత్నాలు పాలకపక్షాలు కొనసాగిస్తూనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్దె శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### మతోన్మాదుల మెదలు వంచేది కమ్యూనిస్టులే: తక్కళ్లపల్లి

దేశంలో రానున్న రోజులలో మతోన్మాదుల మెదలు వంచేది కమ్యూనిస్టులేనని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సిపిఐ శతవసంతాల సందర్భంగా జోతేఘాట్ నుండి ప్రారంభమైన సిపిఐ బస్సు జాత బుధవారం వరంగల్ జిల్లాలోకి ప్రవేశించింది. ఈ బస్సు జాత బృందం సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, రాష్ట్ర సమితి సభ్యులు మారుపాక అనిల్, మణికంఠరెడ్డి, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, వారి బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంలోని ములుగు రోడ్ నుండి పోచమ్మ మైదాన్ సెంటర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అధ్యక్షతన పోచమ్మ మైదాన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు పాల్గొని మాట్లాడారు. ఇటీవల దేశంలో అనేక రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ బిజెపిని ఓడించడంలో చతికిల పడిందన్నారు. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో కమ్యూనిస్టులు పురోగమిస్తున్నారన్నారు. భారత దేశంలో మావోయిస్టులు తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం అన్న తమ పంథాను వీడి ప్రజాస్వామ్య ఉద్యమాలలో కమ్యూనిస్టులతో కలిసి రావాలన్నారు. దేశంలో చీలిపోయిన కమ్యూనిస్టులు సైతం ఏకం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో నిరుద్యోగం, అధిక ధరలు పెరిగి పోతున్నాయని, రూపాయి పతనంతో మరింత ఆర్థిక మాంద్యం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శిలు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### కమ్యూనిస్టుల త్యాగాలు కప్పిపుచ్చాలనుకుంటే గుణపాఠం తప్పదు : ఇటి

కమ్యూనిస్టుల త్యాగాలను కప్పిపుచ్చాలనుకునే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ అన్నారు. బాసర నుండి బయలుదేరిన సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ నాయకత్వంలోని ‘సిపిఐ బస్సు జాత’ బుధవారం హైదరాబాద్ చేరుకున్నది. ఈ సందర్భంగా రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంకు చేరుకున్న బస్సు జాతకు నాయకత్వం వహిస్తున్న పశ్యపద్మ, వలి ఉల్లా ఖాద్రి, ఉప్పలయ్య, నరేంద్ర ప్రసాద్‌లకు సిపిఐ నాయకులు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. అనంతరం ఆడిటోరియం ప్రాంగణంలోని రావి నారాయణరెడ్డి విగ్రహానికి, అనంతరం అమరవీర స్తూపానికి పూలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ అమరవీరుల ట్రస్టు బోర్డు సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభనుద్దేశించి ఇటినరసింహ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా, సంపూర్ణ స్వాతంత్ర్యం దేశానికి కావాలని నినదించి, ఉద్యమించి ఉరికొయ్యలను ముద్దాడిన సిపిఐ చరిత్రను తొక్కి పెట్టాలనుకున్న బిజెపికి ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. ప్రశ్నించే గొంతులను ఉద్యమకారులను అక్రమ కేసులతో నిర్బంధిస్తున్నారన్నారు. మావోయిస్టు పార్టీ నాయకులను పట్టుకుని కాల్చి చంపి, ఎన్‌కౌంటర్ అంటూ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్‌లు, బిజెపికి చేస్తున్న మానవ హననానికి వ్యతిరేకంగా ప్రజా స్వామిక వాదులు, రోడ్లపైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

అంతకుముందు పశ్యపద్మ మాట్లాడుతూ.. ప్రజల హక్కులు, సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేసిన చరిత్ర సిపిఐకి ఉన్నదని, పోరాటాల ద్వారా అనేక హక్కులను, చట్టాలను సాధించుకున్నామని వివరించారు. ఎన్నికల కమిషన్ నుంచి మొదలు అన్ని సంస్థలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తమకు అనుకూలంగా లొంగతీసుకునేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ సిపిఐ వందేళ్ల ఉద్యమ చరిత్రను పునః సమీక్షించేందుకే వందేళ్ల ఉత్సవాలు అని అన్నారు.

### ద్విచక్రవాహన ర్యాలీ

సభ అనంతరం మోటారు సైకిల్‌పై యువత ఎర్ర జెండా చేత పట్టుకుని ర్యాలీగా ఫిలీం చాంబర్ వరకు బయల్దేరారు. అనంతరం అంబేద్కర్, జగ్జీవన్ రామ్, పూలే దంపతుల విగ్రహాలకు దండలు వేసి నివాళులర్పించి, అక్కడి నుంచి గురుబ్రహ్మ నగర్‌కు చేరుకున్నారు. అనంతరం బస్ జాతకు వీడ్కోలు పలికారు. ఈ సభలో తెలంగాణ అమర వీరుల ట్రస్టు కార్యదర్శి కందిమల్ల ప్రతాప్ రెడ్డి, సభ్యులు వి.రత్నాకర్ రావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చంద్ర మోహన్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్ కాంపల్లి శ్రీనివాస్ మామిడి చెట్ల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సిఎం రేవంత్ రెడ్డితో పాటు యావత్ క్యాబినెట్ కల. ఆ కల సాధనకు ప్రతి ఒక్కరం ఆలోచిస్తున్నాం అడుగులు వేస్తున్నాం, ఈ లక్ష్య సాధనలో అందరినీ భాగస్వాములు చేసి సమగ్ర డాక్యుమెంట్ రూపొందించే బాధ్యతను సిఎం రేవంత్ రెడ్డి తనకు అప్పగించారు’ డిప్యూటీ సిఎం వివరించారు. 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ఐఎస్‌బితో అధికారిక ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా ఇప్పటికే వివిధ శాఖల నుంచి నోడల్ ఆఫీసర్లను నియమించి వారి ద్వారా వచ్చిన సమాచారం మేరకు ఐఎస్‌బి బృందం ప్రాథమిక కసరత్తు పూర్తి చేసిందని, గ్లోబల్ సమ్మిట్ డిసెంబర్ 8, 9 తేదీల్లో జరగనుందని, తక్కువ సమయం అందుబాటులో ఉన్నందున పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి విజన్ డాక్యుమెంట్ ను తుది దశకు తీసుకురావాలని డిప్యూటీ సిఎం అధికారులకు సూచించారు. 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పన అనేది చరిత్రలో లిఖించదగిన అంశమన్నారు. ప్రజా ప్రభుత్వం మొదటి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు, వాటి అమలు, చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించే ప్రయత్నం చేశామని తెలిపారు. డిసెంబరు 9తో ప్రజా ప్రభుత్వం రెండవ సంవత్సరం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా రెండేళ్లలో ఏమి చేశామని చెప్పడం కంటే కూడా భవిష్యత్ తరాలకు మేలు చేకూరేలా ఏ విధమైన పునాదులు వేయబోతున్నామని, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంతో పోటీపడేలా ఏ విధంగా తీర్చిదిద్దబోతున్నామనే విషయాలను ప్రపంచానికి విజన్ డాక్యుమెంట్ ద్వారా వివరించనున్నట్టు తెలిపారు. ఆర్థిక, పారిశ్రామిక, సర్వీసు సెక్టార్లలో జిడిపిని పెంచి 2047 లోగా మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ప్రజా ప్రభుత్వం అనుకున్న లక్ష్యాలు సాధించడానికి వివిధ శాఖల ద్వారా వ్యవస్థీకృతమైన పనులు ఏ పద్ధతుల్లో చేస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తామనేది వివరించడానికి కొంత కాలంగా డిజైన్ డాక్యుమెంట్‌పై కసరత్తు జరుగుతుందని డిప్యూటీ సిఎం వివరించారు. ప్రభుత్వం ఏ లక్ష్యాలు పెట్టుకుని ముందుకు పోతుందో వాటికి అధికారులంతా సహకరించి నిబద్ధతతో పనిచేశారని ఈ సందర్భంగా అందరికీ డిప్యూటీ సిఎం అభినందనలు తెలిపారు. ఈ రెండు సంవత్సరాల్లో కనబరిచిన నిబద్ధతతోనే 2047 డాక్యుమెంట్ రూపకల్పనకు అడుగులు ముందుకు వేయాలని అధికారులను డిప్యూటీ సిఎం కోరారు. 2047 విజన్ డాక్యుమెంట్, మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అనే లక్ష్యాలు అసాధారణమైనవి అందుకు పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని డిప్యూటీ సిఎం తెలిపారు. ప్రభుత్వం అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు రాష్ట్రంలో అన్ని రకాలుగా అనువైన వాతావరణం ఉందని డిప్యూటీ సిఎం అధికారులకు వివరించారు. సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, స్పెషల్ జయేష్ రంజన్, సంజయ్ కుమార్, వికాస్ రాజ్, ఉన్నతాధికారులు శ్రీధర్, మహేష్ దత్ ఎక్కా, సందీప్ కుమార్ సుల్తానియా, నవీన్ మిట్టల్, హరీష్, బుద్ధ ప్రకాష్, కృష్ణ భాస్కర్, ముషారఫ్ అలీ, నాగిరెడ్డి, చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

## కీలక నిబంధనలు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

తెలియజేసింది. వేళ్ళూనుకున్న చట్టాలను గౌరవించడం సుపరిపాలనకు అత్యవశ్యకమని పేర్కొంది. న్యాయ వ్యవస్థ ఇప్పటికే పెండింగ్ కేసుల భారంతో కుంగిపోతోందని, ఈ భారాన్ని ఎలా తొలగించాలో చూడాలి తప్ప ఇంకా భారం పెంచకూడదని హితవు చెప్పింది. ట్రిబ్యునల్ సభ్యులు, చైర్మన్ల నియామకాలు, పదవీసేవల నిబంధనలు, పదవీకాలానికి సంబంధించిన నిబంధనలను సుప్రీంకోర్టు ఈ చట్టం నుండి తొలగించింది. న్యాయవ్యవస్థ తీసుకునే నిర్ణయాలపై పార్లమెంటు పెత్తనం చేయలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ లతో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా కటువైన వ్యాఖ్యలు చేసింది. తొలుత జారీ చేసిన ఆర్డినెన్స్‌లో ఉన్న నిబంధనలనే చట్టరూపంలోకి తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ ధర్మాసనం చాలా కటువైన వ్యాఖ్యలు చేసింది. ‘అనేక తీర్పుల ద్వారా సమస్యలపై తుది నిర్ణయానికి వచ్చిఇప్పటికే పరిష్కారమైన వివిధ విషయాలను కేంద్ర ప్రభుత్వం సమ్మతించకుండా కోర్టు మార్గదర్శకాలను పద పదే తిరస్కరించే మార్గాన్ని ఎన్నుకుంది, ఈ విధమైన కేంద్ర ప్రభుత్వ వైఖరిపై మేం అనివార్యంగా అసమ్మతి తెలియజేస్తున్నాం, ట్రిబ్యునల్స్ పనితీరు, వాటి స్వతంత్రతకు సంబంధించి న్యాయస్థానం నెలకొల్పిన వేళ్ళూనుకున్న సూత్రాలను అమలు చేయడానికి బదులుగా దురదృష్టవశాత్తూ అవే నిబంధనలను చట్టసభ తిరిగి ఆమోదిస్తోంది లేదా తిరిగి అవే నిబంధనలను ప్రవేశపెడుతోంది. వివిధ చట్టాలకింద, నిబంధనల కింద రాజ్యాంగపరమైన చర్చకు గురైన తర్వాత ఆ నిబంధనలనే మళ్ళీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతోంది, ఇది దురదృష్టకరం'' అని ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించింది. ఈ ట్రిబ్యునల్ చట్టంలోని అనేక నిబంధనలు చెల్లుబాటు కావని, కాలం చెల్లినవని పేర్కొంటూ మద్రాస్ బార్ అసోసియేషన్‌తోపాటు ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేసి పైవిధంగా తీర్పు చెప్పింది. ట్రిబ్యునల్స్‌లో నియామకాలకు కనీస వయోపరిమితి 50 ఏళ్ళు దాఇ ఉండాలని పేర్కొన్న నిబంధనను కూడా వారు తమ పిటిషన్‌లలో వ్యతిరేకించారు.

ట్రిబ్యునల్ ఛైర్మన్, అందులోని సభ్యులకు పదవీకాలాన్ని నాలుగు సంవత్సరాలుగా నిర్దేశించిన నిబంధనను కూడా పక్కకునెట్టేసింది. న్యాయవ్యవస్థకున్న స్వాతంత్ర్యంలో పదవీకాల స్థిరత్వంతోపాటు ఇచ్చిన హక్కులకు కూడా రక్షణ ఉండాలని, విషయంలో న్యాయస్థానం ఇంతకుముందు ఇచ్చిన ఉత్తర్వులను వదిలేశారని ప్రధాన న్యాయమూర్తి విమర్శించారు. ఈ కేసులో రెండు కోర్టులు ఒకే కారణంతో ఇప్పటికే వీటిని తిరస్కరించాయని తీర్పులో పేర్కొన్నారు. ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయాలను జస్టిస్ చంద్రన్ కూడా సమర్థించారు. 2021 ట్రిబ్యునల్ సంస్కరణ చట్టం గతంలో రద్దైన ఆర్డినెన్స్‌కు మరో ప్రతిరూపంగా చట్టంగా అందరిముందుకూ వచ్చిందని, దీనికి చెల్లుబాటు లేదని అన్నారు. కొత్త సీసాలో పాత సారాలాగా ఉందని విమర్శించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com